లఘు గ్రంథాలు

ప్రపంచ తెలుగు మహాసభలు

27 - 29, డిసెంబరు, 2012

# తెలుగు సాహిత్యంలో హాస్యం


రచన

డా॥ పి.ఎల్.ఎన్. ప్రసాద్



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

పొట్టి శ్రీరాములు

తెలుగు విశ్వవిద్యాలయం

Blank Page

లఘు గ్రంథాలు

# తెలుగుసాహిత్యంలో హాస్యం

## డా. పి.ఎల్.ఎన్. ప్రసాద్

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం
హైదరాబాద్

తెలుగు సాహిత్యంలో హాస్యం


రచయిత : డా.పి.ఎల్.ఎన్. ప్రసాద్

**ISBN : 81-86073-318-9**



© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం



ప్రచురణల సంఖ్య: 455

వెల : **రూ. 20/-**

ప్రతుల సంఖ్య : **5000**

ముద్రణ : **డిసెంబరు, 2012**

ప్రతులకు : **సంచాలకులు**
ప్రచురణల విభాగం,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004.

---

ముద్రణ : **చరిత ఇంప్రెషన్స్,** అజామాబాద్, హైదరాబాదు

యన్. కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాదు

ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్



# నాంది

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక్క వేదిక పైకి తీసుకు వచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబర్ 27 నుండి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్య క్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగు వారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకుంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికో ఈ మహా సభలు ఎంతగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ మహాసభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాన్ని ఎలా మెరుగుపరచాలీ, తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలీ అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవ వైవిధ్య సదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారత దేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశ విదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్వలమైన సభల నిర్వహణకు పూనుకొంది. ఈ సభలలో సదస్సులు, తెలుగు వారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితా కళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు, మొదలైన ఎన్నో అంశాలతో పాటు పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతుంది.

ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహాసభల సందర్భంగా ప్రచురించే లఘు గ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాం.

కిరణ్ రెడ్డి

**(ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి)**

ముఖ్యమంత్రి

**V. VASANT KUMAR,** B.Sc.,(Ag.),M.B.A
Minister for Tourism & Culture, Archeology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat,
Hyderabad-500 022.
Phone : 040-23454168, 23450541
Fax : 040-23450899



# ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తర్వాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు. మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింప జేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచు కునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగు వారి సంస్కృతి బహుముఖీనమైంది. అందులో భాష, సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకుని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే "ప్రపంచ తెలుగు మహాసభల" నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల ముద్రణ,

వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి. అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటి కప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే" ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి, పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, తెలుగు అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వ సిస్తున్నాను.

**(వట్టి వసంతకుమార్)**

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్-500 004.

# నివేదన

ఇన్నేళ్ళ తరువాత ప్రపంచ తెలుగు మహాసభలు జరగడం తెలుగు భాషా సాహిత్యాభిమానులకు, సంస్కృత ప్రియులకు, వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులకు ఆనంద ప్రదమైన అంశం. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఉత్తేజం తోనే 1985లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆవిర్భవించింది. తెలుగు విశ్వ విద్యాలయం ఈ రాష్ట్రంలోను, భారత దేశంలోను, విదేశాలలోను ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించింది. భాషా సాహిత్య సంస్కృతుల్ని దృష్టిలో ఉంచుకొని అనేక గ్రంథాలను వెలువరించింది. తెలుగు విశ్వవిద్యాలయం అప్పటి సాహిత్య అకాడమీ నిర్వహించిన పాత్రను చాలా వరకు బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నది. విస్తరణ సేవా విభాగాన్ని అకాడమీల విభాగంగా మార్చి దానికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నది. నిధుల కొరత వల్ల కొన్ని కార్యక్రమాలను అనుకున్న స్థాయిలో చేయలేకపోతున్నాం.

ఈ నాలుగవ ప్రపంచ మహాసభల సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయం తన వంతు బాధ్యతను స్వీకరించింది. భారత దేశంలో పదిచోట్ల సన్నాహక సభలు ఇప్పటికే అధిక భాగం నిర్వహించింది. 1975లో మహాసభల సందర్భంగా ప్రచురించిన 30 లఘు గ్రంథాల్ని పునర్ముద్రిస్తున్నది. మరొక 50 గ్రంథాలను ప్రత్యేకమైన అంశాలమీద రాయించి ఈ మహాసభల సందర్భంగా విడుదల చేస్తున్నది. ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచేత ప్రామాణిక గ్రంథాలను రాయించాలన్నది మా విశ్వవిద్యాలయం ఆశయం. నిజంగా ఇంత స్వల్ప సమయంలో గ్రంథ రచన చేసి సహకరించిన రచయితలకు మా ధన్యవాదాలు. ఈ గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గౌరవనీయులు మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి, సాంస్కృతిక శాఖామాత్యులు, మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి, సంబంధిత ప్రభుత్వాధికారులకు మా విశ్వవిద్యాలయం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పరంపరలో "తెలుగు సాహిత్యంలో హాస్యం" అనే అంశం మీద చిరు గ్రంథాన్ని సకాలంలో వ్రాసి యిచ్చిన డా.పి.ఎల్.ఎన్. ప్రసాద్ గారికి ధన్యవాదాలు. గ్రంథముద్రణ కార్యక్రమంలో చేదోడు వాదోడుగా ఉన్న ఆచార్య సి.మృణాళిని గారికి, ఆచార్య డి. మునిరత్నం నాయకుడు గారికి అభినందనలు.

(ఎల్లూరి శివారెడ్డి)

# విషయసూచిక


| | | పేజి నెం. |
|---|---|---|
| 1. | హాస్య వైభవం - ప్రాచీన యుగం | 1 |
| 2. | తెలుగు నాటకాలు - హాస్యం | 9 |
| 3. | ప్రహసనాలు - నాటికల్లో హాస్యం | 18 |
| 4. | నవలాసాహిత్యంలో హాస్యం | 26 |
| 5. | వ్యాసాలు - కాలమ్స్‌లో హాస్యం | 45 |
| 6. | కథానికల్లో హాస్యం | 63 |
| 7. | పేరడీల్లో హాస్యం | 92 |
| 8. | హాస్యపరిణామం | 102 |

# 1

# హాస్య వైభవం - ప్రాచీన యుగం

ఈ ప్రపంచంలో హాస్యంకన్నా ఆహ్లాదం కలిగించేది, ఆనందం కలిగించేది, ప్రజలకు చాలా ఇష్టమైనది మరొకటి లేదు. నవరసాల్లో దీనికి రెండో స్థానమే ఉన్నా, జీవితంలో హాస్యానిది ప్రథమస్థానమే. నవ్వుల్లో తేలియాడాలని, నవ్వులు పంచుకోవాలని, జీవితమంతా నవ్వుతూ గడిపేయాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. నిజానికి ఈ ప్రపంచంలో ఆదిశంకరులు అన్నట్లు అంతా దు:ఖమయమే. జన్మదు:ఖం, జరా దు:ఖం. మానవుడు జీవితంలోని ప్రతి కష్టాన్నీ నవ్వులతో ఎదిరించాలి. చిరునవ్వు పెదవుల పైనుండి చెరగనీయకూడదు. జీవితంలోని ప్రతి సంఘటనలో నుండి హాస్యం జనిస్తూనే ఉంటుంది. అన్నిటా హాస్యాన్ని చూడగలిగిన హృదయమే అందరికీ హాస్యాన్ని పంచగలుగుతుంది. అన్ని రసాలనీ ఆనందంగా స్వీకరించి ఆస్వాదించి అందరితోనూ పంచుకునేవారినే సహృదయులంటారు.

నవ్వు తగిన సమయంలో ఎంత మంచిదో, సమయం సందర్భం లేకుండా నవ్విన నవ్వు, "నాలుగు విధాల చేటు" అని పెద్దలంటారు. రాజ్యనష్టం, మాననష్టం, ధననష్టం, పుత్రనష్టం అనేవి నాలుగువిధాల నష్టాలు, పాపం ద్రౌపది ఈ నాలుగువిధాల నష్టాలనూ అనుభవించింది. ఆవిడ నిజంగా దుర్యోధనుని చూసి ఏ విధంగా నవ్విందో, ఆమెకి చీరలిచ్చిన ఆ కృష్ణపరమాత్ముడికే ఎరుక. కాలుజారిపడి పాండవుల మీద కత్తి కట్టిన దుర్యోధనుడి కధ మాత్రం అందరికీ తెలుసు. శ్రీరామపట్టాభిషేక సమయంలో లక్ష్మణుడి నవ్వు చూసి ఆ సభలో ఉన్నవారంతా కలవరపడ్డారు. "మీ అన్నలని మీరే స్వయంగా చంపించారు. మేము చూడు మా అన్నని ఎలా సేవిస్తున్నామో, భ్రాతృభక్తి అంటే ఇది" అని మా ఇద్దరినీ చూసి నవ్వుతున్నాడా అని సుగ్రీవుడు విభీషణుడు కించపడ్డారు. "తన తల్లిని తనని, చూసి నవ్వుతున్నాడా" అని భరతుడు సిగ్గుపడ్డాడు. సీతమ్మవారు శీలపరీక్ష తలచుకొని ఇదే నవ్వుకు కారణమా "అని అనుకుంది శ్రీరామచంద్రుడు" సభలోని వారి కలవరం

గ్రహించి కారణం అడిగి అందరి మనస్సులను సేదతీర్చాడు. "వనవాస సమయంలో ఎప్పుడూ రాని నిద్ర తీరా ఈ పట్టాభిషేక సమయంలో వచ్చింది. కదా" అని లక్ష్మణుడు తనని చూసి తానే నవ్వుకున్నాడు. సభలో ఉన్న ప్రతి ఒక్కరూ తమని చూసి లక్ష్మణుడు నవ్వుతున్నాడేమో అని సందేహపడ్డారే తప్ప నిజమైన కారణం గ్రహించలేకపోయారు.

హాస్యానికి స్థాయీభావం నవ్వు. నవరసాల్లో భరతుడు హాస్యానికి ద్వితీయ స్థానం ఇచ్చినా వెయ్యేళ్ళ తెలుగుసాహిత్యంలోనూ, ఎన్నో వేలసంవత్సరాల పాటు సంస్కృతసాహిత్యంలో కూడా కవులు హాస్యానికి పెద్ద పీట వేయలేదు. ప్రధాన రసంగా ఏ ఒక్కరూ స్వీకరించలేదు. 20వ శతాబ్దంవరకు తెలుగుసాహిత్యంలో శతకం, ప్రహసనం వంటి ఒకటి రెండు సాహిత్య ప్రక్రియల్లో తప్ప హాస్యం అంగిరసంగా అంటే ప్రధాన రసంగా ఏ యుగంలోనూ స్వీకరించబడలేదు. సంస్కృత నాటకాల్లోనూ, కావ్యాల్లోనూ వాటి తెలుగుఅనువాదాల్లోనూ కూడా హాస్య పోషణ కోసం వారికి ఒక ప్రత్యేక హాస్య పాత్ర అవసరమయింది. అదే విదూషక పాత్ర. నాయిక, నాయక. ప్రతి నాయక పాత్రల్లో అక్కడక్కడా సందర్భవశాన ఛలోక్తులు సరసాలు వినిపిస్తే వాటి గురించి విశేషంగా చెప్పుకునేవారు. ఆ పాత్రల హాస్య సంభాషణాసామర్థ్యం గురించి కూడా ప్రశంసించేవారు.

లక్షణశాస్త్రం, అలంకారశాస్త్ర నిర్వచనానుసారం హాస్యం అంటే ఏమిటి ? అని పరిశీలిస్తే "వికృతమైన, విలక్షణమైన వేష భాషా చేష్టలను చూడటం వలన కలిగే మనోవికారమే హాస్యం" అనే అర్థం వినిపిస్తుంది. ఒక విధంగా హృదయంలో నుండి పొంగి వచ్చే నవ్వుల వెన్నెలలకి ఈ నిర్వచనానికి అన్వయం కుదరదు. హాస్యరసానికి స్థాయీభావం హాసం వికృతమైన రూప వేషాలు మాటలు చేష్టలు హాస్యరసోత్పత్తికి దోహదం చేస్తాయని లాక్షణికుల అభిప్రాయం.

"వికృతాకార వాగ్వేష చేష్టాదేర్కుహ కాద్భవేత్ హాస్యో హాస: స్థాయీభావ:"అని అంటుంది. (విశ్వనాథుడు)

ఏ రసానికైనా భూమిక భావమే కదా. అది పరిపుష్టస్థితిని పొందితేనే రసస్థాయికి చేరుతుంది. జీవితంలోని సర్వవిధ అనుభూతుల్లోనూ సజీవంగా హాస్యం తొణికిసలాడుతూ కనిపిస్తుంది. అయినా హాస్యం వినోదాలకీ పరిహాసాలకీ

చమత్కారాలకే ప్రాచీన సాహిత్యంలో పరిమితం కావడంతో అంగిరసంగా అంటే ప్రధానరసంగా ఏ ప్రక్రియలోనూ పోషించబడటానికి నోచుకోలేకపోయింది. శతాబ్దాలు గడచినా, ఆధునికయుగం వరకు హాస్య రసపోషణలో పెద్దగా మార్పు రాలేదు. వికృతమైన ఆంగిక వేష భాష చేష్టల్లో తప్ప మరోవిధమైన ఉత్తమ హాస్యం కనిపించకపోవడం మనకి చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది.

ఈ నవ్వులు మొత్తం ఆరు విధాలని పెద్దలు ఎన్నో గ్రంధాల్లో వివరించారు స్మితం. హసితం, ఈ రెండూ ఉత్తమజాతి నవ్వులు. నాజూగ్గా పెదవులు విరిసీ విరయకుండా కళ్ళల్లో ముఖంలో ప్రసన్నత కనిపిస్తుండగా నవ్వే నవ్వులు, గొప్ప గొప్ప నాయికలు పాత సినిమాల్లో సావిత్రి వంటి వారు నవ్వే నవ్వులు. విహసితం అతిహసితం మూడు నాలుగు. ఇందులో కాస్త బుగ్గలు ఉబ్బి కళ్ళు విచ్చుకొని మీ దంత కాంతులు చిమ్ముతుండగా సంపూర్ణంగా నవ్వే నవ్వు. నాయకులు, విలన్లలో కూడా ఎస్.వి. రంగారావు వంటి గంభీరశాల్తీల నవ్వులు. అవహసితం, అపహసితం అన్నవి అధమ రూప నవ్వులు. వాళ్ళు ఒక్కొక్కసారి నవ్వుతున్నారో, ఏడుస్తున్నారో కూడా తెలియదు. కన్నీళ్ళు తెచ్చుకొని, ఎదుటివాడి భుజాలు పట్టుకొని ఊపుతూ, శరీరం అంతా కదుపుతూ, ఎదుటి వాడి మీద పడి పిసికేసే నవ్వులు,

ఆధునిక యుగంలోని లలిత హాస్యం ప్రాచీన యుగంలో వక్రోక్తులు ధ్వనులు శ్లేషల్లోనే వినబడేది. ప్రాచీన సాహిత్యంలో అక్కడక్కడ సందర్భవశాన కనిపించే హాస్యం, దాని స్వరూపస్వభావాలను సమీక్షిస్తే, లలితమైన హృదయగత హాస్యం స్వల్పంగా అక్కడక్కడ కనిపిస్తుంది. హాస్యం కోసం ఆ కవులు కొన్ని సన్నివేశాలను సృష్టించేవారు. ముందుగా వికృతమైన ఆకారంతో ఓ స్థూలకాయుడు ప్రవేశించేవాడు. అతడి మాటలు, నడక, క్రిందపడటం మొదలైనవి చూసి అందరూ నవ్వేవారు. బహుశ ఆధునిక సర్కస్ బఫూన్లకి వారే మౌలిక రూపాలయి ఉంటారు. భోజన ప్రియుల వికృత చేష్టలను కూడా హాస్యంగానే సంస్కృత తెలుగు నాటకాలు పరిగణించాయి. ప్రాచీన తెలుగుసాహిత్యంలో అసభ్య శృంగారం కూడా హాస్యంగా చలామణీ అయింది. కుంచిమంచి జగ్గకవి హాస్య ప్రబంధాన్ని సృష్టిస్తానని బాహాటంగా చెప్పుకొని చంద్రరేఖా విలాపాన్ని అసభ్యశృంగారం ఆధారంగా రచించి కొంత జుగుప్సనే కలిగించాడు.

*పారదోపమ వీర్య ధారాతతభగంబు*
*స్తనచర్మ భస్త్రికా తాడనంబు*
*గార్ధభస్వర నిస్సరద్గ్రామ్య వచన*
*మమిత రోదన జల పూరితాననంబు*
*చంద్రరేఖాభిదాన వేశ్యానలాస్య*
*ప్రథమ సురతంబు నీ భూపతి గరంచె*

(చంద్రరేఖా విలాపం 3-138)

దశవిధ రూపకాల్లో ప్రహసనం ప్రత్యేకంగా హాస్యం కోసమే నిర్మించబడినట్లు పెద్దలు చెబుతారు. ప్రకృష్టమైన హసనమే కదా ప్రహసనమంటే. వీటిల్లో కూడా వికృతమైన ఆంగికచలనాలు, అసంబద్ధ ప్రలాపాల మధ్య ప్రయత్నించి వెతికితే అక్కడక్కడ హాస్యం కనిపిస్తుంది.

ఈ విధంగా ప్రాచీనసాహిత్యంలో హాస్యంపేరిట వ్యాప్తిలో ఉన్న అనేకరూపాలను ఉత్తమహాస్యం కాదని నిషేధిస్తే, ఉత్తమహాస్యం అంటే ఏమిటి ? అనే ప్రశ్నని మనం వేసుకోవలసిన అవసరం ఉన్నది. శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ఒక సందర్భంలో తెలుగువారికి నవ్వుకోవడం తప్ప, హాయిగా నవ్వడం చేతకాదు. అది ఇంకా ఎవరినైనా చూసి నేర్చుకోవలసిన విద్య అని అన్నారు. "జీవితంలో ఎంతో హాస్యప్రియులు, హాస్యాలాడేవారు కూడా పెన్ను పట్టుకుని వ్రాయవలసివచ్చినప్పుడు బిగుసుకుపోయి హాస్యరచన చేయడానికి ఎందుకు ఇబ్బంది పడతారో నాకు అర్థం కాని విషయం" అని ఆయన అన్నారు.

మొల్ల తన రామాయణంలో అహల్యవృత్తాంతాన్ని దృష్టిలో పెట్టుకుని ఇలా చమత్కరిస్తుంది. శ్రీరామచంద్రుడు పాదరక్షలు లేకుండా సీతాలక్ష్మణ సమేతుడై అడవుల్లో నడుస్తున్నాడు. పదునైన రాళ్ళు రామయ్య ఎర్రని పాదాలకు గాయం చేస్తుంటే సీతమ్మ మనస్సు విలవిలలాడింది. తన ఆవేదనని చమత్కారంలో ధ్వనిని నింపి ఇలా అన్నది.

*అలజవరాలు రాలు విభుదంఘ్రుల బోవగ ద్రోవ ద్రోవన*
*ట్టుకి సతీశతంబులగునో యను శాక మొరంగి నాథరా*

నెలవుల నూదమెట్టకుము నీ చరణాబ్జము కందు నావుడున్
వెలది తలం పెరిగి రఘువీరుదు నవ్వుచు నేగె నవ్వలన్
(రామా 5-106)

"ప్రభూ రాళ్ళన్నీ మీ పాదస్పర్శ కోసం తహతహలాడుతూ పాదాలనంటాలని ప్రయత్నిస్తున్నాయి. వాటిని చూసి ప్రక్కకు జరిగి నడవండి" అని పక్కకి తిరిగి కొంగు అడ్డం బెట్టుకుని ధ్వని గర్భితంగా నవ్విందట. రాళ్ళన్నీ జవరాళ్ళయి రామయ్య వెంటబడితే ఇంకేమైనా ఉందా. శతాధికమైన అహల్యలు వెంటబడితే ఎలా ? ఏకపత్నీ వ్రతుడైనా రామయ్యనే సీతమ్మ పరిహాసం చేస్తున్నది. పాలకురికి సోమనాథుడు అధిక్షేపరూపంలో కొంత హాస్యం అందించాడు. అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుడిని సరస చమత్కారాలతో సఖ్య భక్తితో పూజించాడు. హితోపదేశాలు చేశాడు. హాస్యరూపంలో వ్యాప్తిలో ఉన్న భిన్న హాస్యరూపా ఎలా ఉన్నాయి.

**ధ్వని:**

ఈ లోకంలో హాస్యాన్ని సృష్టించడానికి ఎన్నో పద్ధతులను సిద్ధాంతాలను పెద్దలు ప్రయోగించారు. అందులో ధ్వని విశిష్టంగా వినిపిస్తుంది. ధ్వని అంటే ఎక్కడైతే శబ్దం తన అర్థాన్ని మరుగు పరచుకొని మరో ప్రత్యేక అర్థాన్ని స్ఫురింపచేస్తుందో అది ధ్వని. ఓ జాణ తన కుక్కకి బ్రహ్మాండమైన తరిఫీదిచ్చిందట. ఎంత బాగా ఇచ్చిందంటే ఆ కుక్క ఆవిడ భర్త వచ్చినప్పుడు మాత్రమే మొరుగుతుందట. అంటే మిగతా వాళ్ళొచ్చినప్పుడు మొరగదన్నమాట అదీ ధ్వని అంటే. హాస్యం, వ్యంగ్యం శబ్దానికి అందమైన అర్థాలు ఉన్నప్పటికీ, ఆ శబ్దశక్తి చేత మరొక అందమైన అర్థం కూడా స్ఫురింపజేస్తే అది వ్యంగ్యం. హాస్యం కూడా అవుతున్నవి. నన్నెచోదుడి కుమారసంభవంలో దక్షయజ్ఞ విధ్వంస సందర్భంలో హరిబ్రహ్మాది దేవతలంతా కకావికలయి పారిపోయిన ఘట్టంగా హాస్యాన్ని పేర్కొనడం వినిపిస్తుంది. తిక్కన భారతంలోని ఉత్తర గోగ్రహణంలో ఉత్తరకుమారుడి ప్రగల్భాలు, అతడు యుద్ధానికి సమాయుత్తం కావడం, అర్జునుడు జీవితంలో ఎన్నడూ కవచం ఎరుగనివాడుగా నటించడం మొదలైనవి కొంత వినోదాన్ని కల్పించి హాస్యం స్ఫురించినట్లుగా క్వాచిత్కంగా కనబడుతుంది. మనుచరిత్రలో వరూధిని ముందు ప్రవరాఖ్యుడి అమాయకత్వంలో వరూధిని చేష్టల్లో ప్రయత్నిస్తే కొంత హాస్యం మనకు కనబడుతుంది.

శ్రీనాథుడి చాటు పద్యాల్లో చమత్కార పూరిత పద్యాలు అనేకం వినిపిస్తాయి.

*సిరిగలవానికి చెల్లును*
*దరుణుల దగ పదియారు వేలతగపెండ్లాడన్*
*తిరిపెమున కిద్దరాండ్రా*
*పరమేశా గంగ విడువుము పార్వతి చాలున్.*

భయంకరమైన కరువు కాటకాల్లో చుక్కనీరు లేక మృత్యు ముఖంలో ప్రభవించిన పద్యంలో చాలా అందమైన హాస్యమే ధ్వనించింది.

**"వక్రోక్తి – ధ్వని":**

తాళ్ళపాక అన్నమాచార్యులు తన శృంగార సంకీర్తనల్లో హాస్య వ్యంగ్య చమత్కార వక్రోక్తి ధ్వనులను విస్తృతంగా ప్రయోగించాడు. సఖ్యభక్తి ప్రస్థానంలో ఏకంగా శ్రీవారికే సభక్తికంగా హితోపదేశాలు ఓదార్పులు సాంత్వనాలు సమర్పిస్తాడు.

శ్రీవారితో సరసమాడుతూ సఖీ రూపంలో ఇలా చమత్కారించాడు. బహుశ ఆనందనిలయవాసుడు కూడా చిరునవ్వులు చిందించి ఉంటాడు.

*నగుబాటు లివిగొన్న నడపేవు గాకయీ*
*అగడు జేతలు సేసి ఆడిక కెక్కుదురా ॥*

*మగువనే కట్టుగొంటి మంగళసూత్రముగాను*
*యెగసక్కెల గొల్లెత లేమందురో*
*జగములో నెవ్వరైనా సతులకు పురుషులు*
*తగ గట్టుదురు గాక తాము గట్టుకొందురా ॥*

*ఆకె పుట్టినిల్లే నీకు నాకరము సేసుకొంటి*
*వీకడ బో(బొం) దైన సతులేమందురో*
*మేకమై తమ సతుల యిల్లు నించుకొంటగాక*
*యేకడా ఘనులైన వారిల్లిటములుందురా.* (తా.అ.శృ.స.సం.20)

"ఈ ప్రపంచంలో ఆలికి తాళి కట్టి ఘన కార్యం చేసినట్లు ఆనందపడే

పురుష పుంగవులను చూశాం కాని ఈ పురుషోత్తముడు ఆలినే తాళిగా చేసుకోవడం తోబాటు పాలసముద్రమనే అత్తారింట్లో ఇల్లరికపుటల్లుడిగా శోభిల్లుతున్నాడని" అన్నమయ్య హాస్యరస ధ్వనిని తన సంకీర్తనలో ఇలా వినిపించాడు. గుండెలో కొలువైన దేవేరి ఆయనకి తాళి అయిందట. క్షీరసాగరం శ్వసుర గృహమట. అదీ చమత్కార వైభవం. అనంతర కాలంలోని వేమన మహావిష్ణువుని కూడా అధిక్షేపరూప హాస్యంగా ఇలా కీర్తించాడు.

పాలసాగరమున పవ్వళించినవాడు
గొల్లయిండ్ల పాలుగోరనేల
ఎదుటివారి సొమ్ము ఎల్ల వారికి తీపి
విశ్వదాభిరామ వినుర వేమ.

కాసుల పురుషోత్తమ కవిగారు అధిక్షేపం రూపంలో సభక్తికంగా శ్రీకాకుళాంధ్ర దేవ శతకం వ్రాశాడు. ఇలాంటి వ్యంగ్య అధిక్షేప వక్రోక్తులు సామాజిక దర్శనం కావించడం కోసం వేమన విస్తృతంగా ప్రయోగించాడు. శతకసాహిత్యంలో కూడా హాస్యం అక్కడక్కడ కనిపిస్తుంది.

ప్రబంధయుగంలోకి అడుగు పెట్టిన తరువాత చాటుపద్యాల్లోను కవుల జీవితాల్లోను పరిమళించిన హాస్యం ప్రజావాణిలో వినిపించింది. తెనాలిరామకృష్ణుడి చాటుపద్యాలు సుప్రసిద్ధాలు. ఆయన ప్రతి కదలికలో హాస్యం తొణికిసలాడేది. అల్లసానిపెద్దన తెనాలిరామకృష్ణుల పేరిట ఎన్నో చాటు పద్యాలున్నాయి. "తన కాలికి ఉన్న అందియని ఘల్లుమనిపిస్తూ "కాలికి ఉన్న అందియ ఏమని పలికెరా" అని ఆయన అంటే కిటికీలో నుండి తొంగిచూస్తూ "నొసటన భాగ్యరేఖ లేదని నొక్కి పలికెరా" అన్నాడట తెనాలిరామకృష్ణుడు. ఆ యుగంలో తిట్లు నిందలు దూషణలు హేళనల రూపంలో హాస్యం ఎక్కువగా కనిపించేది. రామకృష్ణుడి మరో పద్యం.

ఎమితిని సెపితివి కపితము
భ్రమపడి వెరిపుచకయ వడిదిని సెపితొ
యుమెతకయ తిని సెపితివొ
అమవసనిసిని అలసని పెదన !

అన్నీ లఘువులతో సాగిన వ్యంగ్య పద్యమిది. "భావ భవభోగ సత్కళా భావములకు" అనే పద్యానికి ఎవరైనా అర్థం చెప్పగలరా అని అడిగితే "మేకతోకకు మేక పద్యం చాలా సుప్రసిద్ధంగా వినిపిస్తుంది".

ధ్వన్యనుకరణ పదంతో వ్రాయడానికి అసాధ్యమైన పదం "తృవ్వట బాబా తలపై" అంటూ రాయల వారి కొలువులో చెప్పిన రామకృష్ణుడి చమత్కార పద్యం ఈనాటికీ వినిపిస్తుంది.

నవ్వించే ప్రయత్నంలో సందర్భశుద్ధి తెలిసి నవ్వాలని, ఆ నవ్వులకి ఔచిత్యం, దేశకాల పాత్రాదులు ఉండాలని నవ్వేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మరీ నవ్వాలనే సుమతీ శతకకారుడు బోధించాడు. పరిహాసాలాడేటప్పుడు వావి వరసలు పెద్ద చిన్న చూడమని దీని తాత్పర్యం.

నవ్వకుమీ సభలోపల
నవ్వకుమీ తల్లిదండ్రి నాథులతోడన్
నవ్వకుమీ పరసతితో
నవ్వకుమీ విప్రవరుల నయముగ సుమతీ

కురవంజి భాగవతమేళాలు, భామాకలాపం కర్రబొమ్మలాటలు, తోలుబొమ్మలాటలు, ఛాయా నాటకాలు, పగటివేషాలు జానపదసాహిత్యంలో హాస్యం కాస్త మోటుగా అయినా సమకాలీన సమాజాన్ని సందర్భవశంగా నవ్విస్తుండేది.

**హాస్యం చమత్కారం:** హరికథా పితామహులు ఆదిభట్లనారాయణదాసు గారు, ఆనందగజపతి మహారాజుగారు చాలా మంచి స్నేహితులు. వారిద్దరూ ఒకసారి పేకాడుతున్నారు. మూడు రోజులు నారాయణదాసుగారికి వచ్చాయి. ఆయన వాటిని చూపించి 'షో' అన్నారు. మహారాజుగారు ఆశ్చర్యపోయి గర్వంగా "దాసుగారూ !! నా దగ్గర ఇవిగో మూడు ఆసులున్నాయి. నేనే గెలిచాను అంటారు ఏం గడుసుదనం" అన్నారట. వెంటనే దాసుగారు అమాయంగా ముఖం పెట్టి "అదేమిటి రాజుగారూ!! రాజులకంటే ఆసులెక్కువా ? నాకు తెలియదే" అన్నారట. వెంటనే రాజుగారు "ఇచ్చేశాం ఆట" అన్నారట. అదీ రాజసం, రసజ్ఞత.

**శ్లేష - హాస్యం:** చాలా మంది నిత్యజీవితంలో శ్లేషతో మాట్లాడటం మనమందరం వింటూనే ఉంటాము. ఒకసారి హరికథా పితామహులు ఆదిభట్ల నారాయణదాసుగారు రోడ్డుమీద నడిచి వెళుతున్నారు. ఆనందగజపతి మహారాజావారు గుఱ్ఱం మీద ఎదురుగా వస్తున్నారు. దాసుగారిది ఆరు అడుగుల భారీవిగ్రహం. ఛాతీ ఉప్పొంగించి చేతులు ఊపుతూ దర్జాగా వెళుతున్నారు. రాజావారికి ఓ చిలిపి ఊహ పుట్టింది. "కవి వృషభులు ఎచ్చటికో వేంచేయుచున్నారు!!" అని అన్నారట. దాసుగారు ఒక్కక్షణం తెల్లబోయారు. ఆహా ! రాజావారు మరీ ఎద్దుతో పోల్చారే! "మాంఛి" సమాధానం ఇవ్వకపోతే చేతకానితనం అవుతుంది. సమాధానం ఇద్దామంటే ఆయన రాజావారు. అయినా సాహసించి "కామధేనువు వంటి మీ వద్దకే" అన్నాడట. రాజా వారి ముఖం చూడాలి. రసజ్ఞుడు కదా నొచ్చుకోలేదు, మెచ్చుకున్నాడు.

జీవితంలో ప్రతి క్షణంలోను, ఎంతటి విషాదంలోనైనా సర్వకాల సర్వావస్థల్లోను హాస్యం జీవిస్తూనే ఉంటుంది. దీనిని ప్రాచీన సాహిత్యంలో ఎంతో కష్టపడి వెదికి పట్టుకోవడం కన్నా నవ్వొచ్చే విషయం మరొకటి లేదేమో హాస్యం కేవలం ఆభాసరూపంలోనే ప్రాచీన యుగంలో కనిపించింది. హృదయోల్లాస మాధుర్య హాసం ఆధునిక సాహిత్యంలోని పరిణామ రూపం.

# 2

# తెలుగు నాటకాల్లో - హాస్యం

సంస్కృత ఆంగ్లనాటకాల నేపథ్యంలోనుండి ఆధునిక నాటకరంగసాహిత్యం 1860 ప్రాంతంలో ప్రారంభమయింది. సాంప్రదాయికమైనవి, రంగస్థలం పైన సంపూర్ణ నాటక లక్షణ సమన్వితంగా సాగే నాటకాలన్నింటిలోను హాస్యం విదూషక పాత్రలు లేదా విదూషక ప్రవృత్తితో ఏర్పడే భిన్న రూపాలకే పరిమితమయింది. విప్రవినోదులు, పగటి వేషగాళ్ళు, జానపదులు, కూచిపూడి భాగవతులు తోలుబొమ్మలు, చెక్క బొమ్మలాటల ఆహార్యంలోనో సంభాషణలోనో వ్యాఖ్యానంలో కొంత ఆధునికత సంతరించుకుని మాత్రమే కృతక వికృతహాస్యంరంగస్థల ప్రదర్శనలో కనిపించింది. తిండిపోతు పాత్రలు వికృతవస్త్రధారణ అసందర్భ ప్రేలాపనలు శృతిమించిన శృంగార ప్రసంగాలు, సమస్త భేదాలతో కనిపించాయి. నాటకశిల్పానికి కాని జీవితసౌందర్య నిరూపణకు కాని మానవ మనస్తత్వ విశ్లేషణకి కాని హాస్యాన్ని నాటకకర్తలు ఉపయోగించుకోలేదు. ఇవి కేవలం ఆధునిక తెలుగునాటక పరిణామ లక్షణాలు.

గురజాడ అప్పారావుగారు కన్యాశుల్కం నాటకలక్షణ నిబంధనలనుండి స్వేచ్ఛ సంపాదించుకుని రంగస్థలం పైన ఆసాంతం ప్రదర్శించడానికి వీలు కాదనే విమర్శని పొందినా అది మలితరం నాటక పరిణామ లక్షణంగా కనిపిస్తుంది.

మొదటిసారిగా మానవజీవితంలోని సమస్యలని, అవి సృష్టించే భిన్న మనస్తత్వాలను సామాజికస్పృహతో వివేచిస్తూ, అధిక్షేప వ్యంగ్య చమత్కార రూపంలో కన్యాశుల్క నాటకాన్ని గురజాడ అప్పారావుగారు నిర్మించారు. హాస్యం ఒక శిల్పంగా రసంగా నాటకం అంతా అన్ని పాత్రల్లోనూ కనిపిస్తుంది. హాస్యం తొలిసారిగా ఒక

పాత్రకి పరిమితం కాకుండా జీవితంలోని సర్వవిధ సంఘటనల్లో నుండి ప్రభవించింది. ఒక సామాజికమైన దురాచార నిర్మూలన దీని ప్రధాన లక్ష్యమైనప్పటికీ, దీనిలో ఆకార వేష చేష్ట భాష ప్రవర్తనాది సమస్త వికారాలు ఒక వ్యక్తి నుండి కాక సమాజం నుండి పరిస్థితులనుండి సమస్యలనుండి భిన్నమనస్తత్వాల దృక్పథాలనుండి స్వీకరించి, దాని ఆధార జనిత హాస్యం సజీవంగా మనకి కనిపిస్తుంది. ఇది కల్పిత కృత్రిమ హాస్యం కాదు. ప్రజల అనుభూతుల్లో నుండి ఆవిర్భవించిన వాస్తవ యదార్థ సత్య రూపమైన హాస్యం. ఇది కన్యాశుల్కంలో సర్వాంగీణంగా కనిపిస్తుంది. కాబట్టే ఇప్పటికీ కన్యాశుల్కమనే దురాచారం అదృశ్యమైపోయినప్పటికీ, కన్యాశుల్క నాటకమే శతాబ్దం దాటిపోయినా ప్రథమ స్థానంలో నిలుస్తుంది.

కన్యాశుల్కం నాటకంలో భిన్నమనస్తత్వాలు తమ స్వార్థం అహంకారం, మూర్ఖత్వం, మోసం మొదలైన ప్రవృత్తులతో భిన్న భావాల్లో కనిపిస్తాయి. వారి ప్రవృత్తి స్ఫూర్తిస్తూ హాస్యం జీవించింది. అది ప్రకటించే వాక్యనిర్మాణంలోను భాషలోను చేష్టల్లోను హాస్యం పండింది.

గిరీశం లాంటి మోసగాళ్ళు మేధావి అనే ముఖం తగిలించుకున్న మాయావులు హైదరాబాద్ నైజాం వద్ద వెయ్యి సిక్కారూపాయిల ఉద్యోగం ఉందని నమ్మించేవారు. ఎన్ని కబుర్లయినా చెబుతారు. అప్పుడు ఇలా అంటాడు గిరీశం.

గిరీశం : ఇలాంటి దుర్మార్గపు కూతలు ఆ ఇల్లాలి చెవిని పడితే చాలా ఖేదిస్తుంది. ఆ పాపమంతా నిన్ను చుట్టుకుంటుంది. ఆమె ఎంత పతివ్రత ! యెంత యోగ్యురాలు.

మధురవాణి: వెధవ ముండకి పాతివ్రత్యం అన్నమాట యీ నాటికి విన్నాను.

గిరీశం : దానికి. . . కాదు ఆమెకి మొగుళ్ళేకపోయినా ఆమెని విధవ అనడానికి వీల్లేదు.

మధురవాణి: మీరుండగా వెధవెలా అవుతుంది.

గిరీశం బాలెన్స్‌షీట్‌లో విధవా వివాహం చేసుకోవడం వలన సామాజికంగా తనకు ఒనగూడే లాభనష్టాలు బేరీజు వేసుకుంటాడు. జమ ఖర్చు వ్రాసుకుంటాడు. బుచ్చెమ్మలాంటి రిచ్చి విడోలని చేసుకుంటే కీర్తి సుఖం దక్కి అది విడో మ్యారేజి

అవుతుంది కాని, పిల్లల్ని కనేసి లేచిపోవడానికి సిద్ధంగా ఉన్న వాళ్ళను చేసుకుంటే అది దొంగముండా మ్యారేజి అవుతుందాంటాడు. విడోమారేజీల మీద అతగాడి ఉపన్యాసాలు మోసగాళ్ళ ప్రవృత్తిని యథార్థ సంఘటనల స్వరూపాన్ని చూపిస్తూ ఎంతో నవ్విస్తుంది. విడో మీద ఆయనగారి ఆంగ్ల కవిత్వం ఇలా ఉంటుంది.

The widow
She leaves her bed at A.M. four
And sweeps the dust from off the floor
And heaps it an behind the door the window
And now and then she leaves a mate
And lets the hair grown on her pate
And cares a hang what peope prate
I Love the widow - however she be
Married again - Or Single free
Bathing and Parying
A Model of Saintless
Or Model of Comeliness
What were the earth
But her birth.

మరో పద్యంలో

పుల్లు మూనులైటటా
జసమిన్ను వైటడటా
మూనుకున్న మొల్ల కన్న
నీదుమోము బ్రైటటా టా టా

"ఇది నేను రిఫార్మర్లో అచ్చువేసేటప్పటికి టెన్నిసన్ చూసి గుండె కొట్టుకున్నాడు. అంటాడు గిరీశం. మధురవాణి పాత్ర ఒక అద్భుత పాత్ర. అసలు ఈ పాత్ర వల్లనే నాటకానికి సమతుల్యత ఏర్పడింది. అన్ని పాత్రలూ ఆ పాత్ర చుట్టూ తిరుగుతాయి. నెపోలియన్ అఫ్ ఏంటీ నాచ్చి బిరుదాంకితుడు గిరీశం నుండి. . . తాను చేస్తే లౌక్యం ఎదుటివాడు చేస్తే మోసం అనే రామప్పపంతులు,నోరు కొంచెం చుట్ట వాసన కొట్టే ఆడవేషంలోని మహేశాలు, పొలిశెట్టి బృందం నుండి

ఆఖరికి వకీలు సౌజన్యారావు పంతులు దాకా అందరూ మధురవాణి చేత మంత్రముగ్ధమైన వారే. హాస్యం అంగిరసంగా సర్వాంగీణంగా కనబడే నాటకం కన్యాశుల్కం. గురజాడ వారు ఇలా వెక్కిరించారు. ఎత్తి పొడిచారు. ఇదీ హాస్యమే "వెధ్వల్ అన్నది లాటిన్ మాటండీ" అంటాడు గిరీశం. మనకి ప్రతి పదానికి వ్యుత్పత్తి లాటిన్ అయితే పరమ ప్రమాణం కదా.

## శ్రీవిశ్వనాథ కవిరాజు దొంగాటకం:

హాస్యానికి ప్రయోజనం, నిబద్ధత కల్పిస్తూ పాత్రోచిత సంభాషణలతో సహజ సన్నివేశాలతో శ్రీ విశ్వనాథ కవిరాజు దొంగాటకం నాటకం రచించారు. సంపూర్ణంగా రంగస్థలంపై ప్రదర్శించడానికి అనువుగా ఉండే నాటకం ఇది. ఆంధ్రదేశంలో అనేక ప్రాంతాల్లో ఇది ప్రదర్శించబడి ఎంతగానో ప్రశంసించబడింది.

ఇందులో ఒక సంభాషణ. "ఆయన ఆంధ్రా షెర్లాక్‌హొామ్సుట అన్నయ్యా ! అంటే ఏమిటి" అన్నది రాజ్యం. ఆంధ్ర అంటే ఇమిటేషన్ అన్నమాట ఆ తరువాత ఎంత గొప్ప పేరున్నా ఫరవాలేదు. దాని శక్తిని ఇది ఆర్పేస్తుంది అంటాడు వ్యంగ్యంగా.

## శ్రీకాళ్ళకూరి నారాయణరావు: వరవిక్రయం:

శ్రీకాళ్ళకూరి నారాయణరావు కన్యాశుల్కం కాలంలో అంతం మన మరో సాంఘిక దురాచారం వరవిక్రయానికి చమత్కారంగా పరిష్కారాన్ని సూచిస్తూ వర విక్రయ నాటకం రచించారు. వరవిక్రయంలో సర్కారు జిల్లాల బ్రాహ్మణ కుటుంబాల్లో జరిగే పెళ్ళిళ్ళ అరాచకత్వాన్ని దుయ్యబట్టి, ఆనాటి సమాజంలోని సమకాలీన సంస్కృతిని ఆచారాలనీ హేళన చేయడం నాటకంలోని ప్రధానాంశం.

ఈ నాటకంలో ఈ నాటి బహుళ ప్రజాదరణ పొందిన సుప్రసిద్ధ తెలుగు సినిమా 'ఆహా నా పెళ్ళంట'లో శ్రీ కోట శ్రీనివాసరావుగారు పోషించిన పరమ పిసినారి పాత్రకి మాతృక అనదగిన సింగరాజు లింగరాజు పాత్ర ఈ నాటకంలో చాలా విఖ్యాతమయింది. సాహిత్యంలో లోభత్వానికి ఇది పరిపూర్ణమైన ఉదాహరణ. సింగరాజు లింగరాజు తన వంటవాడు ఘంటయ్యతో భోజనం కోసం ఇలా చర్చిస్తున్నాడు.

సింగ, లింగరాజు : . . . చెప్పు . . . బియ్యమెన్ని
ఘంట : పిడికెడు తక్కువ మానెడు
లింగ : (వ్రాయుచు) వంట కట్టెలు
ఘంట : మూడు.
లింగ : పిడకలు?
ఘంట : రెండు.
లింగ : నిప్పు పుల్ల !
ఘంట : నిన్న మధ్యాహ్నము చీల్చిన పుల్లలో నిలవ బాపతు భాగం
లింగ : ఉప్పు ?
ఘంట : ఉద్ధరిణెడు
లింగ : చింతపండు
ఘంట : నిన్న మధ్యాహ్నం పులుసుకోసం పిసగ్గా నిల్వ ఉన్న తుక్కు.
లింగ : ఇదిగో కరివేపాకు చెట్టు మీద కాకి గూడు పెట్టింది. దొంకినితో దానిని పడదోసి యీ పూట పొయ్యిలోకి సిద్ధం చేసుకో ! కరివేపాకుమండ చీల్చినచో కడుపు చీల్చెదను సుమా.
ఘంటయ్య : రామ రామా ! పక్షిగూడు పడగొట్టడం పాపం కదండి.
లింగ : పాపమేమిటి నీ బొంద ! ఖర సంవత్సరంలో మా ఇంటి వంట అంతయు కాకి గూళ్ళతోను వెళ్ళిపోయింది.

**చింతామణి:**

చింతామణి నాటకం కూడా ఆనాడు వేశ్యా ప్రియత్వాన్ని సమాజంలో ఈ వ్యామోహ దుష్పరిణామాన్ని వివరిస్తుంది. చింతామణి సుబ్బిశెట్టి బిళ్వమంగళుడు భవానీశంకరుడి పాత్రల ద్వారా వేశ్యల జీవిత విధానంను, వారి ప్రవృత్తిని తెలియపరుస్తుంది. సర్వనాశనమైనా కనువిప్పు కాని ప్రజల మనస్తత్వాలు దీనికి ఋజువుగా కనిపిస్తాయి. అడుగడుగునా హాస్యం వినిపిస్తుంది. అన్ని పాత్రల హావభాష చేష్టా విలాసాదుల్లో కనిపిస్తుంది. సుబ్బిశెట్టి పాత్రలో హాస్యం విస్తృత స్థాయిలో కనిపిస్తుంది. వేశ్యమాత ప్రవర్తన వచ్చిన విటుడిని బట్టి ఉంటుంది. బ్రహ్మదేవుడి బుద్ధి బుగ్గి అయిపోయిందని భవానీశంకరుడు ఇలా బాధపడతాడు.

దివ్యస్థలంబగు తిరుపతి కొండను
కోతిమూకను బాదు కొలిసినావు
తతహంసతూలికా తల్పంబులందును
జెదు నల్లులను సృష్టి జేసినావు
ప్రీతి నించెదు గులాబీ చెట్లులను వాడి
మించెదు ముండ్లు సృజించినావు
ప్రభువుల మందిర ప్రాంగణముల మూర్ఖ
వేత్రహస్తులను గర్వించినావు
సౌఖ్యముల కాకరములైన సాని యిండ్ల
విటుల నెత్తురు పీల్చెడి వేశ్యమాత
లను మహాపిశాచముల గాపు నిలిచానవు
గదర వృధగాను నీ తెలివి కాలిపోను

## మధుసేవ:

మధుసేవ మహిమని నిత్య జీవితంలో దాని ప్రాధాన్యాన్ని ఇలా అధిక్షేపాత్మక హాస్యంగా వివరించారు.తెలుగు ఆంగ్ల పదాలతో కూడిన వాక్యనిర్మాణమిది. మధుసేవ ఫలితంగా సంభవించే యధార్ధ జీవిత వ్యథాపూరిత దృశ్యమిది. ఒక భావచిత్రంలో వ్యంగ్య అధిక్షేప రూపంలో సామాజిక బాధని ధ్వనింపజేశారు నారాయణరావు గారు.

మార్నింగు కాగానె మంచము లీవింగు
మొఖము వాషింగు చక్కగ సిటింగు
కార్కు రిమూవింగు గ్లాసులు ఫిల్లింగు
గడగడ డ్రింకింగు గ్లాసులు గ్రంబులింగు
భార్యతో ఫైటింగు బయటకు మార్చింగు
క్లబ్బును రీచింగు గాంబులింగు
విత్తము లూసింగు చిత్తము రేవింగు
వెంటనే డ్రింకింగు వేవరింగు
మరల మరల రిపీటింగు మట్టరింగు

*బసకు స్టార్టింగు జేబులు ప్లండరింగు*
*దారిపొడుగున డాన్సింగు ధండరింగు*
*సారె సారెకు రోలింగు స్లంబరింగు.*

## పానుగంటి లక్ష్మీనరసింహారావు: కంఠాభరణం:

పానుగంటి వారి నాటకాల్లో హాస్యం ప్రధానంగా కంఠాభరణం వృద్ధ వివాహం మొదలైన నాటకాల్లో కనిపిస్తుంది. 1917లో ఈ నాటకం ముద్రించబడింది. నాటక ప్రస్తావనలోనే హాస్యం ప్రయోజనాలను వివరించారు. దు:ఖమయమైన లోకంలో ప్రజలను నవ్వించడం ఛాందస ఆచారాలతో ఇతరులను శ్రమపెట్టేవారిని, ధర్మా కర్మలు వీడి ఇష్టం వచ్చినట్లు తిరిగే వారిని, డబ్బే పరమార్ధంగా జీవించే వారిని బాహాటంగా ఎత్తి చూపి హాస్యం సృష్టించటం ప్రయోజనంగా చెప్పారు. దీనిని విమర్శకులు ప్రహసనమని కామెడీ అఫ్ మేనర్స్ అని అన్నారు. ఇందులో సోమావధాని ప్రాత క్రొత్తల కలిసిన మనిషి ఆడంబరం ఛాందసం ఎక్కువ. లౌకిక జ్ఞానం పూజ్యం. దిక్కుమాలిన కాగితాల పైన కోపం కొద్దీ అక్షర స్వీకారం మానేశాడు. పెద్ద పెద్ద మాటలు ప్రయోగిస్తాడు. వాటి అర్థం తెలియదు. మాలె ప్రాపిజం కలిగిన పాత్రల్లా మాట్లాడతాడు. కాకపోతే పానుగంటివారు మరో పాత్ర ద్వారా వాటిని దిద్దిస్తారు. శిష్టాచార సంపన్నులు అనడానికి శిష్టాచార విపన్నులు అనీ తారతమ్యం అనడానికి తాత్పర్యం అని తు.చ.లు అనడానికి సబాబు అవీ మాట్లాడతాడు. ఆనాటి మత పరిస్థితులు కొన్ని సందర్భాల్లో ఎలా దిగజారాయో తెలుసకోవడానికి ఒక ఉదాహరణ.

రామశాస్త్రి: నత్వేవాహం జాతువానం అను శ్లోకంలో ద్వైవతం కనబడుచున్నది కదా. త్వమేవాహంలో అద్వైతం సృష్టంగా ఉన్నది కదా. ద్వైతాద్వైత మత సంబంధ సాంకర్య సన్నివేశానికి హేతువేది?

సుబ్బలక్ష్మి: ద్వైతులు నిలువుబొట్టువారు. అద్వైతులు అడ్డబొట్టువారు. ద్వైతుల్లో మగవారు తరచుగ చుట్ట కాలుస్తారు. అద్వైతుల్లో తరచుగా పొడుం పీలుస్తారు. వారిలో ఆడవారు కచ్చబోసి బట్ట కట్టుకొంటారు. వీరిలో అడ్డ కట్టాచారం వారిలో వితంతువులు రాత్రి యందు అటుకులే కాని తినరు. వీరిలో మినపరొట్టె తిందురు.

వారు పచ్చడులు చేయుటలో సమర్థులు. వీరు కూరల్లో గట్టివారు. వారికి ఏకాదశీ నియమం వీరికి శివరాత్రి నియమం.

ఈ నాటకంలో ప్రతి పాత్ర ఎంతో కొంత విలక్షణంగా విపరీతంగానే ఉంటుంది. ముచ్చటైన చిన్నదానిని చూడగానే మన్మథుడు చెప్పు తీసి చెంపపై కొట్టాడు అంటాడు రామశాస్త్రి.

సంభాషణా సామర్థ్యంలో పౌరాణిక తత్వం వినిపింపచేశారు. సుబ్బలక్ష్మి రామశాస్త్రి రెండు చెవులు పట్టుకుని ఈడ్చింది.

రామశాస్త్రి: చెవుల బిగింపు చేత కైమని శ్రుతి తారకంలో పడింది అహహా. . . మా భారతమునకు కర్ణ పర్వమే ఆరంభం. అయినను శల్య పర్వములోనికి బొదుచుచున్నది. అబ్బ. . . అబ్బ. స్త్రీ పర్వమే బెడిసి కొట్టిన మాకిక స్వర్గారోహణ పర్వం తప్పదు. వెర్రివాడుగ వీధుల్లో తిరిగే రామశాస్త్రి గొప్ప జ్ఞాని పండితుడు. చివర్లో అతడి వెర్రి కుదిరి సుబ్బలక్ష్మి రామశాస్త్రి కలుస్తారు.

రాధాకృష్ణ విప్రనారాయణ సారంగధర మొదలైన నాటకాల్లో కూడా సునిశిత హాస్యం పరిమళించింది. ఆధునిక యుగంలో హాస్యం పానుగంటి వారి కాలానికి పదను దేలి, హాస్యం ఆహ్లాదంగా నవ్వించే ప్రయోజనం కోసమే సృష్టించబడే పరిణామం పొందింది. ధ్వని వ్యంగ్యం వక్రోక్తులు అధిక్షేపాలు ముసుగులో నుండి స్వచ్ఛమైన లలితమైన హాస్య రచనలు ప్రారంభమయినాయి.

# 3

# ప్రహసనాలు - నాటికల్లో హాస్యం

## శ్రీచిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు:

చిలకమర్తి ప్రహసనాల్లో వరదక్షిణ ప్రహసనం పిల్ల కన్నా కట్నమే ఎంత ఎక్కువ ముఖ్యమో చెబుతుంది. పెళ్ళి కొడుకుల ధనవ్యామోహానికి అద్దం పడుతుంది. పెళ్ళికొడుకు తండ్రి రాఘవరావుగారు చిదంబర దీక్షితులు పెళ్ళిళ్ళ పేరయ్య సంభాషణ ద్వారా మనకు ఆ వ్యవస్థ ఇచ్చిన ప్రాధాన్యాలు స్ఫురిస్తాయి.

పెళ్ళిళ్ళ పేరయ్య సంబంధం చెబుతూ "పిల్లను తమ కళ్ళతో తామే చిత్తగించారు. రంభలా ఉంటుంది. మతాబూ కాని అది పిల్లకాదు" అంటాడు. కాని నసుగుతూ "ఏదో నూరు రూపాయల వస్తువు కంటే యెక్కువ ఇవ్వలేరా" అంటాడు.

"పిల్ల బానే ఉంది కానీ ఏదో ముచ్చి బొమ్మలా ఉన్నది. కళా కాంతులు లేవు అయినా సంసారానికి అందమెందుకయ్యా ! భార్యా రూపవతి శత్రువు అన్నాడు శాస్త్రకారుడు" అన్నాడు రాఘవయ్య.

"సింగరాజుగారి పిల్లను చూసి వచ్చానండి. . . పిల్ల లక్షణంగానే ఉంది కాని పెద్దపిల్ల ఈడు జోడు. కాని వీళ్ళు కూడా వెయ్యి నూటపదహార్లు కంటే ఎక్కువ ఇవ్వలేరు" అన్నాడు చిదంబరం.

"అంత పెద్ద పిల్ల వాడికెందుకండీ ! పిల్లవాడి చదువు చెడిపోతుంది. పెండ్లాముతో కాపురం చేస్తూ చదువేమిటి వెధవ చదువులు" అన్నాడు రాఘవరావు.

"వాడ్రేవువారి పిల్లని చూసి వచ్చాను ఆహా హా. . . ఆ పిల్ల వీణ పుచ్చుకుని యెంత బాగా పాడిందనుకున్నారు. శేషువాలకించేట్లు పాడింది. పిల్ల కూడా దబ్బపండులా ఉంటుంది. కాకపోతే పిల్ల తండ్రి కట్నం నాకు తోచింది పెడతాను. ఖండించి నన్నెవరూ అడగకూడదు అంటున్నాడండి" అన్నాడు చిదంబరం.

"రామ రామ ఆ పిల్ల నాకే కాదు నా శత్రువులకు కూడా వద్దు బాబూ ! సంగీతం నేర్చుకున్న కోడలున్నదంటే కొంపకి ఎంత అప్రతిష్ఠ" ఎక్కడెక్కడి సంగీత పాఠకులు వచ్చి చేరతారు. ఆ పిల్ల మనకి వద్దు అంటాడు. ఇలా ఆ పెళ్ళిళ్ళ పేరయ్య ఎంతెంత మంచి సంబంధాలు తెచ్చినా వాళ్ళందరూ ధనవంతులు ఎక్కువ కట్న కానుకలు ఇచ్చుకోలేకపోవడంతో అందరికీ పెళ్ళికొడుకు తండ్రి రాఘవరావు వంకలు పెడతాడు. చివరికి చిదంబరం నసుగుతూ ఓ సంబంధం చెబుతాడు.

"పిల్ల బంగారం బొమ్మండి . . మూడు వేల కట్నం రెండువేల బాల తొడుగు. . . లాంఛనాలు పట్టు బట్టలు.. బంగారం. . .. కానీ అంటాడు". ఇంకా కానీ ఏవిటయ్యా అంటాడు రాఘవరావు ఆనందంగా

"నిజం దాచకూడదు. . . పిల్లకి క్షయ ఉన్నది. జబ్బులోనే రజస్వల అవుతుందని భయం. . . పెళ్ళి చేస్తే బ్రతుకుతుందని ఆశ. . ." అంటాడు చిదంబరం.

"ఆ బతక్కపోతేం లేతురు. మనలో మనకు సందేహాలెందుకు? మూడువేల కట్నం, రెండువేల బాలతొడుగు రాను పోను ఖర్చులు ఇస్తారు. మూడు నాలుగు వందలతో పెళ్ళి కానిద్దాము. పిల్ల చస్తే దినవారపు ఖర్చు కదా. . . శ్రాద్ధాల వెంకటావధానులకు ఇరవై అయిదు రూపాయిలిస్తే దినవారాలు తేల్చేస్తాడు. ఎలాగైనా మనకి వ్యాపారంలో అయిదారు వేల రూపాయల లాభం" అంటాడు రాఘవరావు.

"నిజమే కానండయ్యా కాని మీ వాడిని రెండవ పెళ్ళి వాడంటారు కదా" అంటాడు.

అంటే అంటారు. అంటే మనకొచ్చిన నష్టమేమిటి. పైగా రెండవ పెళ్ళికి స్నాతకం ఖర్చు ఉండదు అంటాడు.

"మీరు చెప్పింది చాలా బాగుందండీ ! ఇది తోళ్ళ వ్యాపారం వంటిది. చచ్చిన జంతువుల తోళ్ళతో వ్యాపారం చేసేవాళ్ళు కొందరు, బ్రతికిన తోళ్ళతో వ్యాపారం చేసేవారు కొందరు" అంటూ నిర్వేదంగా పలుకుతాడు చిదంబరం.

ఈ సంభాషణలు కొద్దిగా మార్పుతో శతాబ్దానికి పైగా దేశమంతటా ప్రతిధ్వనిస్తున్నాయి. ఇందులో కొందరికి హాస్యం వినిపిస్తే, మరికొందరికి సామాజిక జీవితం కనిపిస్తుంది. ఆచార వ్యవహారాలను, వాటిపేరిట జరిగే అక్రమాలను, దోపిడీలను అనేక ప్రహసనాల్లో చిలకమర్తి వారు వర్ణించారు. బలవంత

బ్రాహ్మణార్థప్రహసనంలో ఆపద్ధర్మ సూత్రాలు, ఆచారాలకు సమయానుకూలంగా వ్యాఖ్యానాలు చెప్పి పబ్బం గడుపుకునే వ్యక్తులు కనిపిస్తారు.

తద్దినం పెట్టేవాడు తద్దినం పెట్టేలోగా ఉదయం ఏమీ తినకూడదు. ఆయనకి ఓ ధర్మ సందేహం వచ్చింది. "రాత్రి మా ఆవిడ ఉల్లిపాయ పులుసు కాచింది. అది ఎంతో పాకాన పడింది. పొద్దిటికి కూడా పులుసు మిగిల్తే అది పోసుకుని చద్ది అన్నం తిన్నాను. ఎలా?" అని ఆందోళనగా ఆ పెద్దమనిషి అన్నాడు.

అన్నంభొట్లు అనే బ్రాహ్మణుడు "ధర్మశాస్త్రం ఆలోచిస్తున్నాను" ఇంతకీ మీరు మొహం కడుక్కున్నారా? అన్నాడు. ఆ పెద్దమనిషి ఆలోచనలో పడి "పొద్దున్నే ఏదో మాటల్లో పడి పొరబాటున శీతగ్రాసం చేసేసాను సుమా" అంటాడు.

అన్నంభొట్లు కుదుటపడి "ఇప్పుడు వినండి చెబుతాను. పలుగఱ్ఱ వేయకమునుపు (ముఖం కడుక్కోకముందు) చేసిన భోజనం నిన్నటి భోజనంతో సమానం. ఇప్పుడు లేచి చప్పున ముఖం కడుగుకొనండి. దంతధావనం అయిన తరువాత భోజనం చెయ్యకపోతే ఈ భోజనం చెయ్యనట్లే లెక్క" అంటాడు. అలా ధర్మశాస్త్రానికి ఆపద్ధర్మ భాష్యాలు చెప్పి సమయానికి తగు మాటలాడే వారు కోకొల్లలుగా కనిపిస్తారు. ఈ ప్రహసనంలో శ్రాద్ధానికి మరొక బ్రాహ్మణుడు అవసరమౌతాడు. బలవంతాన వచ్చిన ఆ బ్రాహ్మణుడు అన్నంబొట్లుని చూసి తెల్లబోతూ అన్నంబొట్లుగారు! మీ మెడలో జంధ్యం లేదేమి ? అంటాడు.

అన్నంభొట్లు ముందు తెల్లబోయినా తేరుకుని అతి తెలివి ఉపయోగించి "ఈ తద్దినమెవరిది" ? అంటాడు. "మా అమ్మది అంటాడా ఎదురుకుండా ఉన్న వ్యక్తి. మీ అమ్మకు జంధ్యం ఉన్నదా? మీ నాయనకే ఉంది. కాబట్టి ఆవిడ తద్దినానికి జంధ్యమక్కరలేదు. ఆ వచ్చిన బ్రాహ్మడి మెడలో జంధ్యం కూడా తీసేయమనండి" అంటాడు. ఆపదని అవసరాన్ని దాటడంలో వారు మహాఘనులుగా కనిపిస్తారు.

సంతుష్టి అనే ప్రహసనంలో కొంత మంది నిత్య సంతుష్టుల మనస్తత్వం చిలకమర్తి వివరిస్తారు. వీరు ఏదీ తెలుసుకోవాలని అనుకోరు. ఎవరైనా చెప్పినా తిరస్కరించి తమ జ్ఞానంతో తమకున్న తృప్తి ప్రకటిస్తారు. వీళ్ళకి ఏదీ చెప్పడం. కష్టం మెప్పించడం మరీ కష్టం.

ఎవరైనా పెద్దమనిషి వచ్చి "పేపరు చదివారా సోమరాజుగారూ ! అని ఏ కామరాజు అడిగినా" ఎందుకు? ఎందుకు పేపర్లు చదవడం. వాడు వంగుని వంకాయ తిన్నాడు ! వీడు గుమ్మడికాయ తిన్నాడు ఇవేగా వార్తలు? అంటాడు సోమరాజు.

సదరు కామరాజుగారు తెల్లబోయి "ఇంతేనా పత్రికల్లో ఉండేది. నిజంగా పత్రిక ఉపయోగం మిమ్మల్నే అడగాలి" అంటాడు.

"ఓస్ నేను మూర్ఖుడను కాబోలు నీవు గొప్ప నవనాగరీకుడవు బయల్దేరినావు. పత్రికలొకసారి అలవాటైతే నల్లమందులాగ పట్టుకుంటాయి. నల్లమందు వాడికి వేళకు మందు అందకపోతే వాడికి కాళ్ళెట్లు పీకునో, పత్రికలకు అలవాటు పడిన వాడికి ఆ వేళకి పత్రికలందకపోతే కాళ్ళ అట్లు పీకును. అంచేత ఆ దురభ్యాసం నేను చేసుకోను" అంటాడు సోమరాజు. సర్వం ప్రత్యక్షంగా చూసినట్లు మాట్లాడే వాళ్ళు మనకి ప్రతి ఊళ్ళో కొందరు కనిపిస్తుంటారు.

"మీరీ సంవత్సరం కాంగ్రెసు సభకు రారా" అని అడిగితే (స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న రోజులవి) ఆ సోమరాజుగారు.

"ఎందుకు నలభయ్యో యాభయ్యో దండుగ. కాంగ్రేసంటే నాకు తెలియదా. . . మామూలు మీటింగు కన్న పది మంది ఎక్కువ ఉంటారు. ఇందులో పైవాళ్ళు పది మంది మాట్లాడతారు. కన్నడ, గుజరాతి, మరాఠి వాళ్ళు వస్తారు. తమాషా జుట్లు కనబడతాయి." నేను ఊహించుకోగలను అంటాడు.

కామరాజుగారు ఆశ్చర్యంగా "అంతా మనోభావంతోనే వెళ్ళుచున్నది కదా. చెన్నపట్నం చూడరా మీరు" అంటాడు.

"చూచేదేమిటి చూడకుండానే యెరుగుదును. మన ఊరి కంటె మరో పది ఇండ్లెక్కువ ఉంటాయి. పది దుకాణాలుంటాయి. మన ఊర్లో గోదావరుంటే అక్కడ సముద్రముంటుంది. ఇక్కడ రాధారీ పడవలకు బదులు అక్కడ నావలుంటాయి. మన ఒంటెద్దుబండి బదులు అక్కడ ట్రాంబండి ఉంటుందట. ఆ మాత్రం ఊహించుకోలేనా నేను" అంటాడా బ్రహ్మజ్ఞాని.

మానవ మనస్తత్వంలోని ఇటువంటి విపరీత బుద్ధులని చూపి మనకు ఎంతో హాస్యం అందించాడు చిలకమర్తి.

## నాటికల్లో హాస్యం:

రంగస్థలం పైన నాటక లక్షణాలతో ప్రదర్శింపబడే నాటకం పరిణామం చెంది నాటికగా మారింది. ఇందులో శ్రవ్యనాటికలు దృశ్యనాటికలు కూడా ఉన్నాయి. రంగస్థలం పైన ప్రదర్శించడానికి వీలుకాకపోయినా అద్భుత హాస్యనాటికలు రచించబడినాయి. ఆధునిక సమాజంలోని వాతావరణం ఇతివృత్తం, సమస్యలు, సమస్యలకి స్పందించే తీరు ప్రధానంగా నాటికల్లో హాస్యం మలచబడింది. సమస్య ప్రధానంగా తీర్చేవి కొన్నైతే, పరిష్కారాలు సూచించినవి కొన్ని. ఆధునిక యువతీ యువకుల ప్రేమ ఇతివృత్తం ఒకవైపుకనిపిస్తే, పెళ్ళిళ్ళు, స్నేహాలు కుటుంబ సమస్యలు ఘర్షణలు మరో ప్రక్క కనిపిస్తాయి. మొత్తం మీద నాటికల్లో హాస్యం యధార్థ జీవిత దృశ్యాన్నే చూపించే దిశగా పరిణామం చెందింది.

## శ్రీకందుకూరి వీరేశలింగం పంతులు:

'కన్యాశుల్కం' నాటికలో అప్పటి కష్టసుఖాలు గురజాడ అప్పారావు గారిలా ఆయన నాటి సామాజిక స్థితిగతులను ప్రతిబింబింపజేశారు. ఒక ఘట్టం ఇది.

కామా: నీకు లేనప్పుడు నాకు మాత్రం వెలియేవిటి? యీ వూళ్ళో వోర్వలేని లౌక్యపు ముండా కొడుకుల కుట్ర చేత కన్యా విక్రయం చేసినందులకు వెలివేస్తానని బెదిరించినాడు గాని నేను భిక్షవేసి యిర్వై రూపాయలు పాద పూజ సమర్పించడంతోటే అన్నీ పోయినవి. పూర్వాశ్రమంలో అయిదేసి వందల రూపాయలు పుచ్చుకొని యిద్దరు కూతుళ్ళను అమ్ముకున్న ముండాకొడుకు స్వామివారికి మాత్రం కష్టసుఖాలు తెలియవా? నేను అయిదారుగురు పిల్లలను అమ్ముకుని కాస్తసొమ్ము చేసుకున్నానని వోర్వలేని గాడిదకొడుకులకు కన్నెర్రగా వున్నది. నేను కష్టపడి కన్న నా పిల్లలను అమ్ముకున్నాను వూళ్ళో వాళ్ళ పిల్లలను అమ్ముకోలేదు గదా ?

రామ: నిన్ను వెలివేస్తానన్నది యెందుకు? పిల్లలను అమ్మినందుకా? నీ మూడో చిన్నది రజస్వల అయిందాకా పెళ్ళి చెయ్యకుండా వుంచినందుకా?

కామ: పిల్లది రజస్వల అయిందో లేదో యెవరు చూచినారు ? నేను మూడు ముట్లు యింట్లో కలుపుకుని పిల్లది రజస్వల కానేలేదన్నాను దానితో సరిపోయింది.

**శ్రీభమిడిపాటి కామేశ్వరరావు:**

హాస్యం లలితమై ఆధునికమై భాషలో కూడా సారళ్యంలో భమిడిపాటి కామేశ్వరరావు గారి నాటికల్లో కనిపిస్తుంది. "కచటతపలు" నాటికలో తెలుగువారి అనైక్యతని ఎలా అధిక్షేపిస్తూ హాస్యం పండించారు.

త్రిమూ: సరేకాని, ఇల్లారా (అని చిదానందాన్ని పక్కకి తీసికెళ్ళి) ఇప్పుడు ఓ పనిజరగాలి. నేను ఓ గొప్ప సమాజం స్థాపిస్తున్నాను. అందులో అందరికి సమాన హక్కులు ! దానివల్ల చాలా లాభం ఉంటుంది. యాభై వేలుండదంటావా?

చిదా : వెధవా యాభైవేలా ? లక్ష ఉంటుంది.

త్రిమూ : నవ్వు సందేహిస్తున్నావు గాని కోటి కూడా ఉంటే ఉండవచ్చు.

చిదా : నవ్వు ఇంకా మొహమాటంగా చెబుతున్నావు గాని, శతకోట్లు ఉంటుందన్నా ఆశ్చర్యం లేదు. (వీళ్ళిద్దరూ జేబులు తడుముకుంటూ ఇల్లా మాట్లాడుతుంటే పూర్ణానంద కూర్చున్న కుర్చీమీదే జోగుతుంటాడు. (బ్రహ్మానందం ఆ సంగతి చూస్తుంటాడు.)

త్రిమూ : కాని, నాకు ఊహూ దురాశ లేదస్మీ, కొందరు వెధవలకి మల్లే ! నాకు ఓ కోటి చాలు, పోనీ నా పెళ్ళానికి నాకూ కలిపి కోటిన్నర చాలు.

చిదా : నాకు ఓ అరకోటే చాలు, ఇప్పటి పొట్టి కోటంతటిది.

త్రిమూ : అల్లాయితే నాకు లక్షే చాలు !

చిదా : (సిగ్గుపడి) ఏమో ! నాకు వెయ్యే చాలుస్మీ.

త్రిమూ : నాకు ఒక రూపాయిచాలు. మళ్ళీ మాట్లాడితే కాణీ చాలు ఆ మాటకొస్తే దమ్మిడీ చాలు ! ఎక్కడికి దీనికి. అంతం.

చిదా : నాకు ఏమీ అక్కరలేదు తన్నకుండా ఉంటే చాలు.

మల్లాది వేంకటకృష్ణశర్మ గారి వారసత్వం కథలో పిల్లా పీచు లేని సంపన్నుడికి వారసులు తయారయి అతగాడిని పరలోకానికి పంపేస్తారు. చిత్రంగా జడ్జీగారు తీర్పు ఇస్తారు.

**శ్రీమునిమాణిక్యం నరసింహరావు:**

గృహప్రవేశం నాటికలోనూ ఆయన ముద్రతో ముసలోడికి దసరా పండగ

తత్త్వం కనిపిస్తుంది. మొక్కపాటి నరసింహశాస్త్రి గారి పాతివ్రత్యం నాటికలో ప్రజాస్వామికపు రోజుల్లో పాత కాలపు పాతివ్రత్యపు ధర్మాలు ఎలా చెల్లుతాయో హాస్యంగా నిరూపించబడింది. పెళ్ళికి తారాబలము కాదు వధూవరుల మనోబలం ఉండాలని చెప్పే హాస్య నాటిక తారాబలం. పెళ్ళికొడుకు పెళ్ళికూతురు పెళ్ళిచూపుల మాటలు కనువిప్పు కలిగించే హాస్యంతో ఉంటాయి.

## రావికొండలరావు:

రావికొండలరావుగారు చాలా మంచి హాస్యనాటక రచయిత. ఆయన వ్రాసిన కుక్కపిల్ల దొరికింది. చాలా మంచి హాస్య నాటిక రంగస్థలం మీద కూడా ఇది ప్రదర్శించబడి ఎంతో మెప్పు పొందింది. చూసేటప్పుడు ప్రేక్షకులనీ, చదివేటప్పుడు పాఠకులనీ కూడా మెప్పించగలిగితే అది నిజంగా మంచి నాటకమే అవుతుంది. చాలా నాటకాలు రంగస్థలం మీద ప్రదర్శించడానికి అనుకూలంగా ఉండవు.

ఈ నాటికలో ఓ పెద్దమనిషి కుక్కపిల్ల తప్పిపోయింది. దానికి గాను ఆయన ఆ సదరు కుక్కపిల్లని వెతికి తెచ్చి ఇచ్చిన వారికి మంచి బహుమతి ఇస్తానని పేపర్లో ప్రకటన వేశాడు. అక్కడినించి చాలా మంది ఓ కుక్కపిల్లని పట్టుకొచ్చి డబ్బిమ్మని పీక్కుతింటారు.

ఓ యువకుడు కుక్కపిల్లని పట్టుకొచ్చి దబాయించాడు. దీనికి ముందు కుక్కపిల్ల యజమాని విసుక్కోకుండా ఇలా అంటాడు. చూడు ! నేను కొన్ని ప్రశ్నలడుగుతాను సమాధానం చెప్పావా నీ డబ్బు నీకిస్తాను.

లేకపోతే ఇవ్వరా !

ఇస్తాలే చెప్పు. . . చెప్పు ఫరవాలేదు. . . మీ ఇల్లు హాస్పిటల్‌లా ఉ ంటుంది. కదూ ! అక్కడ కొందరు మనుషులు కేకలు వేస్తూ అరుస్తూ ఉంటారు కదూ !

అబ్బాయికి అర్థమయింది. పిచ్చాసుపత్రి మా ఇల్లా ! అంటే పిచ్చాసుపత్రి నుంచి నేను వచ్చానని మీరు అనుకుంటున్నారా. . . నేను పిచ్చోణ్ణా. . . అని అరుస్తాడు మరో పెద్దమనిషి రోడ్డు మీద పోయే కుక్కపిల్లని తెచ్చి బలవంతాన అంటకట్టి కాదంటే ఉగ్రుడై అరుస్తాడు.

"ఏమండోయ్ ఇదేం మర్యాదగా లేదు మిమ్మల్ని మోసగించి మీ దగ్గర డబ్బెత్తుకు పోవాలనే చచ్చు ఉద్దేశ్యంతో వచ్చాననుకుంటున్నారా? కావలిస్తే మీకు కావలసినంత డబ్బు గుమ్మరించేస్తాను. పోనీ గదా అని పనీపాటా మాని ప్రాణం పోతున్నా లక్ష్య పెట్టక కుక్కని వెతికి తీసుకొస్తే ఇది కాదు పొమ్మని కొట్టేస్తారా. . .

"ఇదేనా పెద్ద మనిషి తరహా"

ఇది నా కుక్కపిల్ల కాదు మహాప్రభో ! మీకు శతకోటి నమస్కారాలు వెళ్ళు. కుక్కపిల్ల దొరక్క నేను బాధ పడుతున్నాను. ఇది ఆయన మధురమైన హాస్యం.

బుద్ధవరపు నాగరాజామాత్యుడి మీసాల పక్షులు ధనికొండ హనుమంతరావు ఎర్రబుట్టలు ఎంతో నవ్విస్తాయి. బ్రతుకు గతినే మార్చివేయగల మతిమరుపుపై శ్రీ సోమంచి యజ్ఞన్నశాస్త్రి పెద్దమనుషులు నాటిక గందరగోళపు హాస్యంతో నవ్విస్తుంది.

శాకినీ డాకినీ పిశాచాలు మరెక్కడో కాదు మనిషి మేధలోనే ఉంటాయని చెప్పే హాస్య నాటకాన్ని అంటాడు ముద్దుకృష్ణ రచించారు. శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మిగారి మ్యాచ్ ఫిక్సింగ్ నాటిక ఆపద్ధర్మాలు సృష్టించే అద్భుతాలని ఎత్తి చూపిస్తూ నవ్విస్తుంది.

శ్రీయండమూరి వీరేంద్రనాథ్, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, మల్లాది అవధాని, నార్ల చిరంజీవి ప్రఖ్యాతులు నరసరాజు, బాబు శంకరమంచి పార్థసారథి. వి.ఎస్. కామేశ్వరరావు, రమణమూర్తి, ఆర్.వి.ఎస్. రామస్వామి, రత్నగారి జగన్నాథం, బెల్లంకొండ రామదాసు సుప్రసిద్ధ హాస్యనాటకలు రచించారు. ఆదివిష్ణు అతిథి దేవుళొస్తున్నారు, హత్యా ? ఆత్మహత్యా నాటికలు వాంటెడ్ ఫాదర్స్ సుప్రసిద్ధ హాస్య నాటికలు.

# 4
# నవలాసాహిత్యంలో హాస్యం

## శ్రీకందుకూరి వీరేశలింగంపంతులుగారు:

కందుకూరి వారి ప్రేరణ పొంది సమాజంలోని దురాచార ఖండనని లక్ష్యంగా చేసుకుని హాస్యరచనకి పూనుకొన్నా, చిలకమర్తి వారు లలితమైన హాస్యాన్నే అందించారు. వారి ప్రహసనాలు. రామచంద్ర విజయం నవ్వులగని మొదలైన రచనల్లో సామాజిక స్థితి యదార్థంగా హస్యరూపంలో కనిపిస్తుంది. సమాజంలోని భిన్నమనస్తత్వాలు, ఆలోచనా రీతులు, సంభాషణా వైవిధ్యాలు భావ ప్రకటనలు చిలకమర్తివారు అధ్యయనం చేశారు. వారందరూ తమ జీవితాల్లో తమ స్వార్థం కోసం ఎలా ఇతరులను వినియోగించుకున్నారో వివరించారు. సమాజంలోని సమస్యలకు స్పందించి భిన్న సాహితీ ప్రక్రియల ద్వారా ప్రజల్లో మార్పు చైతన్యం తీసుకురావడం కోసం ఎందరో రచయితలు ప్రయత్నించిన కాలం 1875-1950. కందుకూరి నుండి వారసత్వంగా ఒక ఉద్యమస్ఫూర్తితో ప్రజా జీవితాన్ని తన ప్రహసనాల్లో చిలకమర్తివారు చూపారు.

ప్రాచీనసాహిత్యంలోని హాస్యం ఆధునికయుగంలో ఎంతో పరిణామం చెందింది. వస్తువులోను ప్రక్రియలోను శిల్పంలోను నిర్మాణంలోను ప్రయోగంలోను వైవిధ్యం వచ్చింది. ముఖ్యంగా సాహిత్యప్రయోజన కాక సామాజిక ప్రయోజనం కోసం హాస్యం సృష్టించడం ఆరంభమయింది. పాల్కురికి, అన్నమయ్య వేమన కాసుల పురుషోత్తమ కవి వంటి వారు అధిక్షేపం వ్యంగ్యం వక్రోక్తి రూపంలో హాస్యం పండించినా వారి లక్ష్యం వేరు. "నేనొకండ లేకుండితే నీ కృపకు పాత్రమేది ? పూని నా వల్లనే నీవు కీర్తి పొందేవు" అని అన్నమయ్య మానవుల మనస్తత్వంలోని అహంకారాన్ని వ్యంగ్య హాస్యరీతిలో శ్రీవేంకటేశ్వరుడితో పలికినా, ఆయన లక్ష్యం

ఆధ్యాత్మిక భక్తి స్వరూపాలే. ఇలాగే ప్రతి ఒక్కరికీ వారి లక్ష్యాలు వేరు. హాస్యం వారికి ఒక లక్ష్యానికి సాధనమే అయింది కాని లక్ష్యం కాలేదు. అలా హాస్యమే లక్ష్యంగా రచయితలు ఆధునిక యుగంలోనే తమ రచనలని రూపొందించారు.

సమాజంలోని దురాచారాలు మూర్ఖత్వాలు అవినీతులని ఖండించడం కోసం హాస్యాన్ని ఆయుధంగా రచయితలు స్వీకరించారు. సామాజిక స్థితిగతులు సాహిత్యంలో చోటు చేసుకోవడమే క్రొత్త అయితే, అదీ హాస్యరూపంలో వ్యాఖ్యానించి చెప్పడం మరీ క్రొత్త అవడంతో ప్రజల్లో ఇది త్వరగా ప్రచారంలోకి వచ్చింది. పద్యం నుండి ప్రజలు నెమ్మదిగా గద్యాన్ని వచనాన్ని చదవడానికి అలవాటు పడుతున్న కందుకూరి యుగంలో ఇది ఆదరణలోకి వచ్చింది. కబుర్లు కాలక్షేపాల ద్వారా సమాజంలో సులభంగా వ్యాపించింది.

ఈ విధంగా ఎన్నో ప్రక్రియలకి శ్రీకారం చుట్టిన కందుకూరి వీరేశలింగం పంతులుగారు నవీన హాస్యరీతికి కూడా ఆద్యులయ్యారు. 1850 నాటికి వచనం గద్యం చదవడం తెలుగు ప్రజలకు క్రొత్త. దానికి తోడు కందుకూరి వారు వచనంలో తొలి తెలుగు నవల (కొందరు కాదనవచ్చు) కథానిక. జీవితచరిత్ర వ్యాసం వంటి ఎన్నో సాహిత్య ప్రక్రియలను ఒకేసారి వ్యాప్తిలోకి తీసుకు వచ్చారు. ఇది ఒక సాహితీ విప్లవం. ఉద్యమాలు రెండు విధాలు. మొదటిది వ్యక్తి నుండి సంఘానికి వ్యాపించేది. రెండవది సంఘం నుండి వ్యక్తులకు వ్యాపించేది. కందుకూరి వారు మొదటి తరగతికి చెందినవారు. సమాజంలోని దురాచారాలను ఎత్తి చూపుతూ ఒక్కొక్క వ్యక్తిని పట్టుకుని నిలదీసి 'ఎందుకు మారవు' అని సంస్కరణ ఉద్యమం నడిపిన మహానుభావుడు కందుకూరివారు. ఈ ఉద్యమాలు సంఘంలో ఎవరి కోసమో కాదు, నీ కోసం, నీ కూతురి కోసం, నీ కుటుంబ సుఖసంతోషాల కోసం అని వాదించి ఆయన పోరాడేవాడు.

కన్యాశుల్కం, బాల్యవివాహాలు, వేశ్యాలోలత్వం, అవినీతి తాండవమాడుతున్న కాలమది. స్త్రీ విద్య మరీ తక్కువ ఉన్న కాలం. ఆ రోజుల్లో "నా భార్యని కూతురిని కండలుగా కోసుకుంటాను. అవసరమైతే అమ్మేస్తాను నువ్వెవరిని అడగటానికి" అని బాహాటంగా ప్రజలు అనే కాలమిది. తల్లిదండ్రులని ఎదిరించి ఆడపిల్లలని వారిళ్ళలో నుండి తీసుకువచ్చి విద్య చెప్పించి వివాహాలు చేయించిన ఘనుడు

కందుకూరి.

నిజానికి కందుకూరి వారి హాస్యంలో అధిక్షేపం, వ్యంగ్యం, ఎత్తిపొడుపు, హేళన తిరస్కారాలే ఎక్కువగా వినిపించేవి. తిట్లు శాపనార్థాలు కూడా కొంత మేరకు ప్రజల సమకాలీన భాష వినిపిస్తూ హాస్యం పండించాయి. రాజశేఖరచరిత్రలో ఆనాడు గురుశిష్యులు సందర్భానుసారం మారిపోతూ ప్రజల నుండి లబ్ధిని పొందే వైనాన్ని వివరించేవారు.

"ఒక వైష్ణవస్వామి పల్లకీలో ఊరేగుతూ శిష్యగణంతో సాగుతూ కనిపించాడు. రాజశేఖరుడుగారికి ఆయన పూర్వ పరిచితుడు కాబట్టి, ఆయన గురించి వాకబు చేస్తూ రాజశేఖరుడు ఇలా అడిగారు. వెనుక నేను చూసినప్పుడు మీరు గురువుగాను, మీకు ఆయన శిష్యుడు గాను ఉండేవారు కదా" అన్నాడు. దానికి ఆ స్వామి ఇలా చెప్పాడు. మాలో మాకు అటువంటి భేదము లేదు. నాకు శిష్యులున్న గ్రామంలో అతడు శిష్యుడుగాను, అతడికి శిష్యులున్న గ్రామంలో నేను శిష్యుడిగాను మారుతుంటాము" అన్నాడు.

కందుకూరి వారి సత్యరాజా పూర్వదేశ యాత్రలు 1891లో వచ్చిన నవల ఈ నవల ఆనాటి స్త్రీల స్థితిగతులు, సామాజికంగా స్త్రీ ఎదుర్కొన్న భయంకర సమస్యలు, సంప్రదాయలు, ధర్మశాస్త్రాలు కూడా స్త్రీని ఎంత బానిసంగా మార్చాయో స్పష్టంగా చూపిస్తుంది. అయితే ఈ సమస్యలన్నీ స్త్రీపరంగా కాకుండా పురుషపరంగా చెప్పడమే దీని ప్రత్యేకత. ఈ వ్యంగ్య అధిక్షేప నవలలో సత్యరాజు కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో, స్త్రీలే పరిపాలించే, పూర్తిగా స్త్రీ స్వామ్య వ్యవస్థలో నడిచే ఆడమళయానికి చేరుకుంటాడు. అక్కడ మొదట అతడిని నిర్బంధించిన వారే ఆ తరువాత ఆదరించి, వారి భాష నేర్పి, అక్కడి ఆచార వ్యవహారాలన్నీ బోధిస్తారు.

భారతదేశంలో స్త్రీలు పడే బాధలన్నీ అక్కడ పురుషులు అనుభవిస్తుంటారు. హిందూదేశంలో వితంతువైన స్త్రీకి తలగొరిగించినట్లే ఆడు యళయాళంలో పత్ని మరణించినప్పుడు పురుషుడికి ముక్కు కోసివేస్తారు. ఇందుకు కారణం పురుషుడు పాపకార్య ప్రవృత్తుడై దోషాలకు పాల్పడడని, అతడిని ఏ స్త్రీ దగ్గరకు రానీయదని ఆచార నియమాలు విధించారు. భారతదేశంలో పతిభక్తి ఎంత ఎక్కువో అక్కడ సతి భక్తి అంత ఎక్కువ. సతీ నియమాలు ఉన్నట్లే అక్కడ పతికి నియమాలు ఇలా

విధించారు.

ఆ నవల్లో వివరించబడిన పత్నీవ్రత ధర్మబోధిని గ్రంథంలో పతులకు విధించబడిన నియమాలీలా ఉన్నాయి.

*గీ.* *ప్రతి దినంబును బురుషుండు పత్ని కంటె*
*ముందుగా లేచి నదిలోన మునిగి జలము*
*కలశమున దెచ్చి నిజపత్ని కాళ్ళు కడిగి*
*తాను శ్రీపాద తీర్థంబు త్రాగవలయు ॥*

*గీ.* *కుష్ఠురోగిణియైన గ్రుడ్డిదైన*
*భూరి వికలాంగియైన ముసలిదైన*
*బత్ని యెంగిలి భుజింపవలయు సతతము*
*పుణ్యలోకంబు గాంచించు పురుషవరుడు ॥*

క. *పురుషుండు గార్ధభమున్*
*స్థిరముగ దండనము లేక చెడిపోదురిలన్*
*గరుణ దలంపక నెలకొక*
*పరియైన గొట్టవలయాన్ని బత్ని పురుషునిన్ ॥*

ఇలా భార్యలు భర్తలను దండిస్తూ అదుపు ఆజ్ఞల్లో పెట్టుకోవాలట. ఇలా కొట్టకపోతే భర్తలు గాడిదలై చెడిపోతారట. భార్య పాదతీర్థం త్రాగి తరించాలట. ఇప్పటి తరం పురుష పుంగవులు ఎవరైనా ఈ పద్యాలు చదివితే ఇవి మా ఆవిడ కంటబడితే ఇంకేమైనా ఉందా అని హడలిపోతారు. వినడానికి చాలా హాస్యంగా మనకు అనిపించినా ఇవన్నీ నిజంగా స్త్రీలకు ఆనాడు విధించారని జ్ఞాపకం తెచ్చుకుంటే నవ్వేవారే నవ్వుల పాలవుతారు.

కవిపురుష శనైశ్చర విలాసంలో కొన్నింటికి ఎంగిలి పాటించరని మహా కటువుగా కందుకూరి చెప్పారు.

*పొగచుట్టకు సతిమోవికి*
*అగణితముగ మద్యమునకు నమృతమ్మునకున్*

*తగనుచ్ఛిష్టము లేదని*
*ఖగవాహనుతోడ కాలకంఠుడు బలికెన్*

ఈ పద్యాన్ని గురజాడ అప్పారావుగారు కూడా కన్యాశుల్కంలో వేంకటేశం నోట పలికిస్తారు.

## శ్రీచిలకమర్తి లక్ష్మీనరసింహం:

సంపూర్ణమైన హాస్యం పరిమళించిన నవల గణపతి. ఒక కథా నాయకుడి పాత్ర ద్వారా సంపూర్ణ హాస్యం అందించిన రచనలు ఇప్పుడు సాధారణంగానే కనిపించినా ఆనాడు ఇది విశేషం. ఈ విపరీత చేష్టలు విలక్షణ దుస్తులు, ప్రత్యేక సౌష్ఠవం కలిగిన గణపతి తెలుగు వారికి సంపూర్ణ హాస్యం అందించాడు.

"ఉదయమే లేచి చల్ది కూడు తిని గిరజాలు దువ్వుకొని, కోటు తొడుగుకొని తెల్లపంచె కట్టుకొని పొగచుట్ట నోట బెట్టుకొని, కుడిచేతితో చెంబు పట్టుకొని ఎడమ చేతి తర్జనవిద్య, అంగుళీయముతో బొగచుట్ట నోటి నుండి తీసి పట్టుకొని యుమ్మివేయుచు" పుర విహారం చేసే సుందరం వదనారవిందుడు గణపతి. ఇదీ అతడి యవ్వన ముగ్ధ మనోహర రూపం.

బాల్యంనుండి గణపతి జీవితంలోని ప్రతి ఘట్టం చదివిన వారెన్నటికీ మరచిపోలేరు. గణపతి నవల మూడు తరాల చరిత్ర. గణపతి తాత పాపయ్య. తండ్రి గంగాధరుడు. తరువాత గణపతి. "సింగమ్మకు వరప్రసాదియై పప్పుభట్ల వంశరత్నాకర పూర్ణచంద్రుడై ఈ కథానాయకుడు గణపతి జన్మించెను" అని చిలకమర్తి వారు కావ్య నాయక కీర్తి ప్రతిష్ఠలను వివరించారు. గణపతి చరిత్ర వ్రాయకపోతే ఏమవుతుందో కూడా చిలకమర్తికి గణపతి కలలో కనిపించి చెప్పాడు. కాశీలో గోహత్య చేసినట్లే, ప్రయాగలో బ్రహ్మహత్య చేసినట్లే. మీరు వ్రాయని పక్షమున నేను దయ్యమునై మీ వంశము నాలుగు తరములను పట్టుకొని పీడించెదను. వ్రాసిన తరువాత యిది పఠింపని వారు. చెదపురుగులై పుట్టి మరొక జన్మమున దీనిని తినివేయుదురు అని శాపం కూడా పెట్టాడు.

ఇంతటి మహాపురుషుడి బాల్యావస్థ మహాద్భుతం. అతడు బడికి పోవడం ఒక వింత దృశ్యం. యమకింకరుల్లాంటి పిల్లలు గణపతి కాళ్ళు చేతులు కట్టి ఈడ్చుకొని

బడికి తీసుకుపోతారు. గణపతి ఆ పిల్లలని కొరికి గోళ్ళతో బరికి గిల్లి ఉమ్మి నోటికి వచ్చినట్లు తిట్టి గోల చేస్తాడు. ఆ విద్యాభ్యాసమే ఒక ప్రహసనం.గణపతికి గుర్రంపై మక్కువ. అయినా స్వారీకి గుర్రం ఎక్కువేమిటి? గాడిద తక్కువేమిటి? పైగా గణపతి నవల ప్రారంభంలోనే "శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం ప్రసన్న వదనం" అనే స్తుతి వినిపిస్తుంది. శుక్లాంబరధరం అంటే తెల్లని వస్త్రాలు మోయునది. శశివర్ణం. గాడిద తెల్లగా ఉంటుంది. చతుర్భుజం. అది ఎలాగూ చతుర్భుజమే కదా. విష్ణుం. విష్ణువు అంటే సర్వవ్యాపి. గాడిద ఎక్కడ కావాలంటే అక్కడే కనిపిస్తుంది. పైగా దీనికి ప్రామాణికత కోసం చిలకమర్తి వారు నిరంకుశ: కవయ: అనే ఆర్యోక్తి జ్ఞాపకం చేస్తారు. గాడిదస్వారీ వలన అన్నీ లాభాలే. ఖర్చులేదు.ఇది డబ్బులేని వాడి గుర్రం, పైగా వసుదేవుడు ఎవరి కాళ్ళు పట్టుకున్నాడు? కాబట్టి గౌరవానికి లోటు లేదు" అన్నాడు గణపతి.

గణపతి నవనాగరీకుడు. బ్రాహ్మణార్థం భోక్తలకు సైను గుడ్డలు వద్దనీ కోటు గుడ్డలు ఇవ్వాలనీ ఒక వర్గ నాయకుడౌతాడు. ఇటువంటి వ్యక్తి బడి పిల్లల పూర్వజన్మ సుకృతం కొద్దీ గురువు అవుతాడు. ఉపాధ్యాయ హాస్యంలో అధిక్షేప రూపంలో ఎంతో హాస్యం పండింది. గణపతి సిద్ధాంతం ప్రకారం పంతులు పాఠాలు చెప్పడం కన్నా భయపెట్టడంలోనే దృష్టి పెట్టాలి. తమ గురువుల భీకర శిక్షణ వల్లనే తానింత వాడయ్యానంటాడు. చిత్ర విచిత్ర రీతుల్లో శిక్షిస్తాడు. పిల్లలు గజగజలాడిపోతారు. కానుకలిచ్చుకొన్నవారు రక్షించబడతారు. ఆయన ఒకసారి అనివార్యంగా "శ్రీరఘురామ చారు తులసీ దళదామ" పద్యానికి అర్థం చెప్పవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ సహజ పండితుడు ఇలా అర్థం చెబుతాడు.

శ్రీరఘురామ = శ్రీరాములవారు; చారు = ఒకనాడు పైత్యంగా ఉండి చారు కాపించుకున్నారు. ఆ దేశంలో కరివేపాకు దొరకదు కాబట్టి తులసీ దళాలే అందులో వేశారు. శమక్షమాది శృంగార గుణాభిరామ = శ్రమ యావత్తు పోగొట్టగలిగి బహు శృంగారంగా ఉన్నదట ఆ చారు. త్రిజగన్నుత శౌర్యరమాలలామ = ఆ చారు త్రాగిన తరువాత శ్రీరాముల వారికి కావలసినంత శౌర్యం కలిగిందట; దుర్వార కబంధ రాక్షస విరామ = వారందరికీ కఫం పట్టకుండ పోయిందట; భద్రగిరి= అందరికీ భద్రం కలిగిందట. ఇలా పద్యానికి విశేష పాండిత్యంతో చెప్పిన

దుర్వ్యాఖ్యానం తెలుగు కావ్యాలున్నంత కాలం ఉంటుంది. అందులో కూడా రామనామం ఉంది కదా. ఈ విధంగా చిలకమర్తి హాస్య వ్యంగ్య చమత్కార ప్రస్థానం ఆచంద్ర తారార్కంగా నిలుస్తుంది.

## శ్రీమొక్కపాటి నరసింహశాస్త్రి:

మొక్కపాటి వారి బారిస్టర్ పార్వతీశం 1920ల్లో రచించబడింది. ఏ వాదమూ సిద్ధాంతం, కోసం హాస్యాన్ని ఆయుధంగా వాడుకోకుండా అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో మానవ జీవిత మనస్తత్వ వైఖరుల్లో నుండి ప్రభవించిన హాస్యమిది.

ఒకప్పుడు బెర్నార్ట్‌షా ఇలా అన్నాడట. "ఏదైనా పిక్నిక్‌కి కాని విహారయాత్రకి కానీ వెళ్ళినప్పుడు, మనతోబాటు ఏ విషయాన్నీ అర్థం చేసుకోలేక "అదేమిటి ఇదేమిటి" అని అడిగే తెలివి తక్కువవాడు ఒకడు ఉండటం అవసరం. మనం అడగలేని విషయాలన్నీ అతగాడు అడిగి మన సందేహాలు తీరుస్తాడు. ఈ వ్యాఖ్యంలో మనం అందరం ఎంతో కొంత తెలివితక్కువ వాళ్ళమే అనే భావం వినిపిస్తుంది. ఎంతో మేధావులనుకునేవారికి కూడా లోకజ్ఞానం ఉండకపోవచ్చును. అసలు మేధాశక్తికీ లోకజ్ఞతకీ సంబంధం లేదు. చిలకమర్తి వారన్నట్లు ఎవరో "ఇంతలావు ఉన్నావు తేలు మంత్రం రాదా" అన్నాడట.

మొగలితుర్రు వాస్తవ్యుడు పార్వతీశానికి ఇంగ్లాండులో విద్యాభ్యాసం చేయాలనే సంకల్పం కలిగింది. "ఇంగ్లీషు వాడి విద్య మనం నేర్చేసుకుంటే స్వాతంత్రోద్యమం నేపథ్యంలో వాడి కంట్లో వాడి వేలుతోనే పొడిచినట్లవుతుంది". అని గాఢంగా నమ్మాడు. గ్రామీణ సంస్కృతిలో పెరిగిన పార్వతీశానికి విదేశాలకి వెళ్ళేటప్పుడు ఆ చూకీ ఎవరికీ తెలియకుండా వెళదామనుకుంటే, వెళ్ళే ఊరిపేరుని ఆ బుకింగ్ క్లర్కుకి చెప్పే తీరాలనడం ఏ మాత్రం నచ్చలేదు. ఇది అతడి మనస్తత్వం అమాయకత్వం. ఏ విషయమైనా నిన్న ఒకరికి తెలిసిన విషయం రేపు నాకు తెలుస్తుంది ఇది పెద్దగా పట్టించుకోదగిన విషయం కాదనేది పార్వతీశం స్వభావం. విదేశాలలో తనకు జరిగే అవమానికి కాని అక్కడి పరిస్థితులను అర్థం చేసుకోలేక పది మందినీ అడుగుతూ ఇబ్బంది పడుతున్నప్పుడు కూడా అతడేమీ అవమానపడడు. సిగ్గుతో క్రుంగిపోడు. పరిస్థితులని క్రమ క్రమంగా అర్థం చేసుకుంటూ ముందుకు సాగుతాడు. అతడి వ్యక్తిత్వంలో వచ్చిన పరిణామాన్ని అందులో జీవించిన హాస్యాన్ని

మొక్కపాటివారు అత్యంత సహజంగా రూపొందించారు. పార్వతీశం వ్యక్తిత్వమనే అద్దంలో మన ముఖం కూడా కనిపించి మనకు నవ్వొస్తుంది. బారిస్టర్ పార్వతీశం నవల గురించి శ్రీశ్రీ గారే వ్యాఖ్యానిస్తూ తన సిరిసిరిమువ్వ శతకంలో

క్షితిలో బారిస్టర్ పా
ర్వతీశమును చెప్పి పిదప పలుక వలెము
కిత కితల కితరులను భా
సిత సిత సుశ్లోకుడతడు సిరి సిరి మువ్వా

అని అన్నాడు. కదిలే ప్లాట్ ఫ్లారాలు, లిఫ్టులు, ఆంగ్ల సమాజంలో పార్వతీశం అవస్థలు మనకి నవ్వొచ్చినా ఏ స్థితులోనూ అతడి మీద చిన్నచూపు కలుగదు. అతడి పరిణామంలో వ్యక్తిత్వ వికాసంతో మనకి ఎంతో తృప్తి కలుగుతుంది.

## శ్రీకొడవటిగంటి కుటుంబరావు:

శ్రీకొడవటిగంటి కుటుంబరావుని ఎవరూ హాస్య రచయితగా పేర్కొనలేదు. హాస్యనవలల పట్టికలో ఆయన నవలలు ప్రత్యేకించి ఏవీ లేవు. ఎందుకంటే ఆ బోర్డు ఆయన పెట్టుకోలేదు. ఆయన లక్ష్యం కూడా అది కాదు. అధిక్షేపం వ్యంగ్యం ధిక్కారం వారి రచనల్లో కనిపిస్తాయి. అయినా హాస్యం జీవితాన్ని విడిచి ఉండదు. కదా జీవితాన్ని సమగ్రంగా విశ్లేషించి చూపించే మహా రచయితల రచనల్లో హాస్యం తొణికిసలాడుతునే ఉంటుంది. ఈ కోవకే చెందినవారు కుటుంబరావు రాచకొండ విశ్వనాథశాస్త్రి, బీనాదేవి.

ఆడవాళ్ళు ఏం మాట్లాడుకుంటారనే విషయం మగవాళ్ళకి ఎప్పటికీ అర్థం కాదు. ఆడవాళ్ళకి మాట్లాడటానికి క్రొత్తవాళ్ళే ఉండాలనే నియమం లేదు. పాత వాళ్ళయినా ఫరవాలేదు అంటాడు కుటుంబరావు. మనస్తత్వాల్లోని వైవిధ్యం విశ్లేషణ కుటుంబరావు అపూర్వంగా నిర్వహించాడు. ఆడవాళ్ళ మాటలు కూడా అంత ఖచ్చితంగా ఉంటాయట.

"ఆడంగులు మాట్లాడుతుంటే సీతప్ప అసూయపడేవాడు. వాళ్ళు ఎన్ని విషయాలైనా మూడు ముక్కల్లో చెప్పేస్తారు. మగవాళ్ళకి ఒక్క విషయానికే ఎంతోసేపు

పతుడుంది. అయినా అనుమానం ఉండిపోతుంది. ఆడాళ్ళా అమ్మో ! ఇంకా వేద వ్యాసుడు ఆడదై ఉంటే భారతమంతా అయిదు పేజీల్లో రాసును. కాని దాన్నెవరూ చదువక పోదురు. అదీ అసలు కిటుకు. తన భార్య శేషంపిన్నిగారికి అంతా చెప్పిందే కాని ఆవిడ తెలుసుకోవలసిన అసలు విషయం చెప్పనేలేదు" అంటాడు కుటుంబరావు.

అసలు చెప్పవలసిన విషయంలో కిటుకులు మర్మాలు ఆడవారికే బాగా తెలుస్తాయి. అదే వారి బలమూ బలహీనతా కూడా ఈ విషయాన్నే కుటుంబరావు వివరిస్తాడు. నవగ్రహ కూటమి వచ్చి జలప్రళయం వచ్చేస్తుందని సర్వనాశనం అవుతుందని అంతా భయపడి పోతుంటారు. కష్టాలు భయాలు అవివేకం కూడా ఒక్కోసారి వినేవారికి హాస్యంగానే వినిపిస్తాయి. మన సంగతి చంద్రమతీ హరిశ్చంద్రుల వంతు అయింది. మనం చూరు క్రింద కూడా నిలబడే అర్హత లేకుండా చేశాయి నవగ్రహాలు. గ్రహాలు ఓ పట్టాన వదిలి పెట్టవు. మనం ఇవాళ వచ్చి రేపెళ్ళే వాళ్ళం కాకపోతిమి. ప్రళయం జరిగిపోయి కలియుగం ముగిసి మళ్ళీ కృతయుగం ఆరంభమయ్యే దాకా ఇక్కడే ఉండిపోతున్నాం. (మనిషి భయం), మనకున్న భయాలన్నీ కుటుంబరావు అరటిపండు ఒలిచినట్లుగా చెబుతాడు.

తిరుపతి వెంకట్రామ చంద్రమూర్తికి నువ్వెన్ని మొక్కులైనా మొక్కుకో. అన్నీ ఒక్కసారే చెల్లించేయవచ్చును. తప్పులేదు ఆ విషయంలో, ఏడుకొండలవాడు చాలా లిబరల్. ఎందుకూ మా తాత మొక్కిన మొక్కు నా చిన్నతనంలో తీర్చారు గాదూ. అంచేత అబ్బీ ! ఎన్ని మొక్కులు మొక్కినా భయం లేదు. నువ్వేమి కంగారు పడిపోకన్నాడు సీతప్ప (గ్రహభయం). నిత్యజీవితంలోని భయాలన్నీ చెబుతాడు కుటుంబరావు సహస్ర అనుభూతులనీ సమస్యలనీ వాదాలనీ సిద్ధాంతాలనీ చెబుతాడు. ఒక్క మాటలో జీవితం చూపిస్తాడు. కాబట్టి అందులో హాస్యం లేకుండా ఎలా ఉ ంటుంది.

## శ్రీపాలగుమ్మి పద్మరాజు:

ఆధునికయుగంలో నవలాసాహిత్యంలో హాస్యం ఎంతో పరిణామం చెందింది. సమాజంలోని ఒక సమస్యని లేదా దురాచారాన్ని ప్రధానాంశంగా తీసుకుని దాన్ని ఖండిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించడం కోసం హాస్యాన్ని సాధనంగాను ఒక

ఆయుధంగాను ఉపయోగించుకోవడం వచనంలోని అన్ని ప్రక్రియల్లోను 1875 నుండి ఇంచు మించు 1950 దాకా కనిపిస్తుంది. స్వాతంత్ర్యానంతర తెలుగుసాహిత్యంలో హాస్యం క్రొత్త సొగసులు సంతరించుకున్నది. జీవితంలోని సర్వవిధ అనుభూతుల్లో నుండి జనించిన హాస్యం అన్ని ప్రక్రియల్లోను చోటు చేసుకోవడం ప్రారంభమయింది. దీని ఛాయలు మనకి మునిమాణిక్యం, మొక్కపాటి రచనల్లోనే కనిపిస్తాయి.

సమాజంలోని భిన్నవ్యక్తుల మనస్తత్వాలను నిత్యజీవితంలో మనం గమనిస్తున్నప్పుడే మన పెదవులపై నవ్వులు విరబూస్తాయి. ఇది సాహిత్యంలో పూర్తిగా ఆవిష్కరించబడినప్పుడే జీవిత సమగ్రదర్శనం కలుగుతుంది. హాస్యం యొక్క సంపూర్ణ వైలక్షణ్యం స్ఫురిస్తుంది. పాలగుమ్మి పద్మరాజు బ్రతికిన కాలేజి, రెండవ అశోకుడి మూణ్ణాళ్ళ పాలన నవలల్లో హాస్య రసాన్ని సంపూర్ణంగా ఆవిష్కరింపజేశాడు.

ప్రపంచంలో ఎన్నో విచిత్రమైన అలవాట్లు వింత మనస్తత్వాలు విపరీత ధోరణులు. విలక్షణ వ్యవహార శైలులు కలిగినవారు మన కళ్ళముందే కనిపిస్తుంటారు. సర్వత్రా ఇలా సజీవంగా తొణికిసలాడే హాస్యావిష్కరణకి ప్రత్యేకించి కొన్ని పాత్రలు, నిర్దిష్ట సన్నివేశాలే అవసరం లేదు. ఇలా జీవితంలో కనిపించే హాస్యాన్ని పాలగుమ్మి పద్మరాజు "బ్రతికిన కాలేజి" నవల్లో చిత్రీకరించారు.

బ్రతికిన కాలేజి నవల్లో ప్రతి పాత్రలోను మనకి ఎంతో కొంత హాస్యం కనబడుతుంది. అది వారి జీవితాల్లో నుండి వచ్చిన సహజ హాస్యం. పెళ్ళి చూపులకి వచ్చిన పట్టు అనబడే పట్టాభిరామారావు, పెళ్ళికూతురు కళ్యాణికి చెల్లెలు రాధని చూసి, ఉత్తర క్షణంలో మనసు పారేసుకున్నాడు. మెరుపుల్లాంటి రెండు కాళ్ళు, ఎగిరిన జడమీది తళ తళ, చెక్కుల మీద లేత గులాబులు విచ్చుకున్న పెద్ద కళ్ళల్లో సిగ్గు ఆశ్చర్యాల వింత వెలుగుతో పట్టూకి రాధమ్మ దర్శనమిచ్చింది అసలు పెళ్ళి కూతురు కళ్యాణి, తల్లిదండ్రులు శాంతమ్మ, జ్యోతిష యుద్ధాల్లో ఆరితేరిన వీరాధివీరుడు శంకరయ్య అనుకోకుండా ముందే పెళ్ళివారు వస్తున్న విషయం తెలియక నివ్వెరపోతారు. పట్టూకి పెళ్ళికూతురు ఫలానా అని తెలిసే లోగానే పట్టూ తండ్రి రామయ్య శంకరయ్యల జ్యోతిషయుద్ధంతో సంబంధం బెడిసికొడుతుంది. పెళ్ళికొడుకు స్నేహితుడు మిస్టర్ చింతా చొరవతో తిరిగి పెళ్ళి కుదిరినా, పీటల మీదికి వచ్చాక

పెళ్ళికూతురు రాధ కాకపోవడంతో పట్టూ దిగ్భ్రమకి లోనయి పారిపోతాడు. అక్కడ నుండి కథ మలుపులు తిరుగుతుంది. స్వతంత్ర వ్యక్తిత్వంతో జీవించాలనుకునే రాధ కళ్యాణి నాట్యం నేర్చుకుంటారు. మిస్టర్ చింతా ఒక నాటక ప్రదర్శనలో వీరిద్దరినీ పాల్గొనేలా చేయడంతో అపార్థాలు తొలిగి మిస్టర్ చింతా కళ్యాణిని, పట్టూ రాధని పెళ్ళాడటంతో కథ సుఖాంతమవుతుంది.

పాత్రల ప్రవృత్తులని విశ్లేషించి చెప్పడంలోను కథన శిల్పంలోను, సంభాషణల్లోను హాస్యం బాగా పండింది. శంకరయ్య జ్యోతిష్యంలో దిట్ట. అందులో కాస్తో కూస్తో తెలిసిన వారితో జ్యోతిష యుద్ధాలు చేయడమంటే మహాపిచ్చి. అతడు ప్రతి పక్షుల్ని కాఫీ ఫలహారాలు ఎర చూపి జ్యోతిష పోరాటాలకి ఆహ్వానించినా, ఆయన భార్య శాంతమ్మ దీనిని పడనీయక వంటింట్లోనే కాఫీ ఫలహార కార్యక్రమాలు సాగాలని శాసనం చేసింది. శాసనలు చేసిన వారికి వాటిని ఉల్లంఘించే హక్కు ఎప్పుడూ ఉంటుంది కదా. శాంతమ్మ అనే పేరుకీ ఆవిడకీ ఏ సంబంధం లేదు. ఆవిడకి పెద్దలిచ్చిన వంశ పారంపర్య ఐశ్వర్యాలు. రెండు, ఒకటి పందిరి మంచం రెండవది నడుం నొప్పి. శాంతమ్మ తనకి అవసరమనిపించినప్పుడూ, తన ప్రాధాన్యం తగ్గిందని అనుకున్నప్పుడు మూర్ఛపోతుంది. పైగా మూర్ఛకి ప్రోత్సాహం కూడా అవసరమే. ఇంటి యజమానురాలి హోదాలో మూర్ఛని ఆయుధంగా ఆవిడ వాడుకునేది. భర్తకి పిల్లలకే కూడా సందర్భాన్ని బట్టి తన మూర్ఛకి అనుగుణంగా వారెలా ప్రవర్తించాలో కూడా వారికి అలవాటు చేసింది. తద్వారా ఆవిడ తాననుకున్న ఫలితాలు రాబట్టుకునేదట.

మిస్టర్ చింతాతో ఎవరు మట్లాడినా వారి మాటల్లో చివరి రెండు మాటలే అతడికి ఇలా తలకి ఎక్కుతాయి. ఓ పెద్ద మనిషి తన ఇంటి గోలని చింతాకి వివరించి చివరికి జుట్టు పీక్కుంటాడు.

పెద్దమనిషి : చూశారూ ! ఉన్న పేచీ ఏమంటే నా పెళ్ళాం సత్య.

చింతా : . . .సత్యవరమేనా తమలపాకులకి ప్రసిద్ధి

పెద్దమనిషి : కావచ్చు. ఇంతకూనే చెప్పేదేమిటంటే నా బావమరిది వాడొట్టి

లండాచోరీ.

చింతా : చోరీ. . . చోరా చోరీ రాజకపూర్ పిక్చర్ కదండీ. . .

ఇలాంటి సంభాషణ సుదీర్ఘంగా కొనసాగి చివరికి ఆ పెద్దమనిషికి దిక్కు తోచదు.

**రెండవఅశోకుడి మూణ్ణాళ్ళపాలన:** ఇది ప్రధానంగా భారత రాజకీయాలపైన రచించబడిన వ్యంగ్య అధిక్షేప ధ్వని గర్భిత నవల. దేశంలోని భిన్న రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీల్లోని నాయకులు, వారి స్వార్థప్రవృత్తులు. రాజకీయ పరిణామాలు, పార్టీల సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని దేశ సమగ్ర రాజకీయదృశ్యాన్ని మన కళ్ళముందు సాక్షాత్కరింపజేస్తుంది. మహారాష్ట్రలో కేరళ మహారాష్ట్రీయుల మధ్య వివాదంలో తిలక్ గురుకుల విద్యాలయంలో బాలు అనే ఎనిమిదేళ్ళ బాలకృష్ణనాయర్ రాజకీయ అలజడుల నేపథ్యంలో ఎవరికీ ఆహారం దొరకని స్థితిగతుల్లో వారికి నాయకుడవుతాడు. ఆ సమయంలో లోకసభలోని వివాదంలో ఏ పార్టీ వారు, తమకి తప్ప మరెవరికీ ప్రధానమంత్రి కాగల అర్హత యోగ్యత లేవని నమ్మడంతో ప్రతిష్ఠంభన ఏర్పడుతుంది. "అల్లరి మా జన్మహక్కు దానిని పెద్దలు అపహరించడానికి వీల్లేదు" అనే నినాదంతో ముప్ఫైవేల మంది బాల బాలికలు లోకసభని ముట్టడిస్తారు. లోకసభ్యులని ఏకగ్రీవంగా ప్రధానమంత్రిని ఎన్నుకొని తమకి చదువు కొనసాగే పరిస్థితిని కల్పించమని సవినయంగా ఘెరావ్ చేస్తారు. చివరికి పేర్వార గ్రామంలో అశోకచక్రవర్తి చరిత్ర వ్రాస్తున్న శ్రీయుత మోరి అశోక వర్ధనరాజుగారిని రాజుగా ఎన్నుకుంటారు. ఆయన మూణ్ణాళ్ళ పరిపాలనలో అనుకోకుండా చోటు చేసుకున్న అద్భుత రాజకీయ పరిణామాలెన్నో మనల్ని ఎంతగానో నవ్విస్తాయి. లోక సభ్యులు రాజకీయ నాయకులు చివరికి ఆయనని హత్య చేద్దామనుకోవడంలో బాలు సహాయంతో రాజ్యపరిపాలన చేసిన అశోకవర్ధనరాజుగారు పేర్వారానికి వెళ్ళిపోయి నాపరాళ్ళ మీద హాయిగా పడుకొని తామ్రశాసన రహస్యాలు ఛేదించే ప్రయత్నంలో మునిగిపోతారు. అసంభవమనిపించే కథాంశమైనా ఆద్యంతం దేశంలోని రాజకీయ నాయకుల పార్టీల నిర్ణయాలు వాటి పరిణామాలు వారి స్వార్థ పూరిత కార్యకలాపాలు మనకి చక్కిలిగింతలు పెడతాయి. వ్యంగ్య హాస్య ధ్వని అధిక్షేపాత్మక నవల ఇది. నవల్లో ఓ సన్నివేశం.

"నోర్ముయ్" అన్నాడొక లోకసభ సభ్యుడు 'ఆ నోరుముయ్యి' అనే పదం లోసభలో ప్రయోగార్హమైనదేనా అనే చర్చ అన్ని భాషల్లో ప్రారంభమైయింది. "ప్రివిలేజిస్ కమిటి" అని గట్టిగా అరిచాడు మద్రాసు న్యాయవాది. ఆ తరువాత అనేక భాషా సముచ్చయమైన ఆ ధ్వని తరంగాన్ని లోకసభ అనువాదశాఖ విశ్లేషించలేకపోయిందట.

ఆ లోకసభలో చర్చలు ఆత్మస్తుతితో ప్రారంభమయి పరదూషణగా మారడానికి ఎక్కువ సమయం పట్టలేదట. మూడు వందల అరవై అయిదు ప్రశ్నలు ప్రివిలెజెస్ కమిటికి సమర్పించబడినాయి. ఆ తరువాత ఏడు వందల గొంతులు పదహారు భాషల్లో ఒకేసారి చర్చ సాగించాయి. భోజనావసరాలకు ఎవరు బయటికి వెళ్ళినా మిగతావారు అన్యాయంగా ప్రధానమంత్రి ఎన్నిక జరిపిస్తారేమోనని అందరికీ భయం.

అశోకవర్ధనరాజుగారి చక్రవర్తి రూపాన్ని ప్రపంచ పత్రికలన్నీ తమదైన శైలిలో వర్ణించాయి. మీసాల వెనుక మహాత్మాగాంధీ అన్నాడు శతవృద్ధ అఫ్ఘన్ రాజకీయ నాయకుడు, అచ్చు మచ్చు మావోయే అన్నారు చైనీయులు. (చైనాలో ప్రజలంతా ఒకే మాట అంటారు) అమెరికన్లు మాత్రం ఆయనని ఏ ప్రముఖుడితోనూ పోల్చలేదు. తమకంటే ఎంత భిన్నంగా ఉంటే అంత ఆకర్షణ, బహుశ మొదటి అశోక చక్రవర్తి ఇలాగే ఉండవచ్చని దక్షిణ అమెరికా చరిత్ర వారులన్నారు. యూరపులో మాత్రం ఏకగ్రీవంగా గ్రీకు పౌరపితల పోలికలు వీరిలో ఉన్నాయన్నారు.

మహారాణివారి అలంకరణలో కొంత గడ్డు ప్రతిష్ఠంభన ఏర్పడింది. విదేశీ స్త్రీలు పురుషులతో సమానం కాబట్టి వారితో కొలతలు తీయించుకోవడానికి ఆవిడ అభ్యంతరం చెప్పింది. లేసర్ కిరణాల సహాయంతో చంద్రమండలం మీద ఉన్న లేసర్ కిరణాలు భూమికి కొలతలు తీసినట్లు తీశారట. ప్రభుత్వ శాసనాల వలన ఎలాంటి పరిణామాలు ఏర్పడతాయో ఒక సన్నివేశం చెబుతుంది. ఒక ఉద్యోగి టాక్సెస్ అన్నాడు ఆంగ్లంలో బాలు "పన్నులు" అని అనువాదం చేశాడు. అశోకవర్ధనరాజు గారికి కోపం వచ్చింది. మహారాణీగారికి పంటి నొప్పి ఉంటే తామేం చేయగలరు. వచ్చీరాని ఆంగ్లంలో. . .

"నోటాక్సెస్ ఆల్‌రిమూవ్" (పళ్ళు వద్దు. ఆవిడకి అన్నీ తీయించేయండి

అని ఆయన భావం). అందరికీ మతులు పోయాయి

రాజకీయ చరిత్రలో విప్లవత్మాక ప్రకటన – ఇజ్వెస్టియా
ఆర్థిక నీతికి అంతిమ సూత్రం – లండన్ టైమ్స్
మావోస్ గన్న లక్ష్య ప్రాయమైన కమ్యూనిస్టు పథం పీపుల్స్ డెయిలీ.

అమెరికన్ ప్రభుత్వం భారతరాజ్యాంగ వ్యయాన్ని, రవాణా తపాలా శాఖ అని రష్యా విద్యా సాంకేతిక రంగాలు, చైనా భరిస్తానన్నాయి. ఇది ఆచరిస్తే ప్రభుత్వాదాయం సన్నగిల్లి, సైనికసంపద ఆయుధ పటుత్వం తగ్గిపోతుంది. ఎవరికీ యుద్ధం చేయాలనే కోరిక ఉండదు. ఇంక ప్రపంచం అంతా శాంతే. పాలగుమ్మి పద్మరాజు నవల్లోని వ్యంగ్యం అధిక్షేపం మనల్ని ఎంతో నవ్విస్తుంది ఆలోచింపజేస్తుంది.

## శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి:

## ప్రేమలేఖ:

ఈ నవల అధారంగానే శ్రీవారికి ప్రేమలేఖ అనే సినిమా తీసారు. అచ్చ తెలుగు వాతావరణానికి సంస్కృతికి తెలుగువారి మనస్తత్వాలకీ అద్దం పట్టే నవల ఇది. చీటికి మాటికి చిరాకుపడుతూ పెద్దరికపు ఠీవి దర్జాలో అందరినీ భయపెడుతూ తను కంగారు పడుతూ అందరినీ కంగారు పెట్టే నాన్నలు, అందమైన అమ్మాయిల అందమైన ఉత్తరాన్ని అందుకుని మురిసిపోయే ఆనందరావులు, సినిమా కథలు చెప్పి అదరకొట్టే అతివలు చతుర్ముఖ పారాయణంతో ఆ భాషలోనే మాట్లాడే పేకాటరాజులు, తెలుగు నేలలోని విలక్షణ విశిష్టమైన వారందరూ ఈ నవల్లో కనిపిస్తారు. తనకు తానే సోనీ అని నామకరణం చేసుకున్న ఓ స్వర్ణలత పెళ్ళికాని అబ్బాయిల గుండె ఝుల్లుమనేలా ఓ ప్రేమలేఖ వ్రాసి ఎవరికి పోస్టు చేస్తున్నానో కూడా తెలియకుండా వ్రాసేసి, త్రికరణ శుద్ధిగా ఇది నాకు కాబోయే పతిదేవుడికీ అందాలని చేతికి దొరికిన ఓ అడ్రస్‌కి పోస్టు చేస్తుంది.

ఎందరో ఆనందరావుల్ని దాటుకొని ఈ ఉత్తరం అసలు హీరో అనందరావు చేతిలో పడుతుంది. పెళ్ళాడితే ఈ ప్రేమలేఖ వ్రాసిన అమ్మాయినే పెళ్ళాడతానని శపథం చేసిన ఆనందరావు తనకి వచ్చిన పెళ్ళి సంబంధాలని తిరగగొడుతూ

అన్వేషిస్తుంటాడు. కథ మలుపులు తిరిగి చివరికి ఈ ప్రేమలేఖ వ్రాసిన తప్పని పరిస్థితుల్లో స్వర్ణనే పెళ్ళి చేసుకున్న ఆనందరావు చివరికి తన భార్యే తన ప్రేమలేఖ ప్రేయసి అని తెలుసుకుని మూర్ఛపోతాడు. పాత్రల మనస్తత్వాల వర్ణనలో సంభాషణల్లో గిలిగినంతలు పెట్టె హాస్యంలో శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారు అందె వేసిన చేయి. ప్రేమలేఖే తప్ప పిల్ల ఎవరో తెలియదని బెంగపడే తమ్ముడిని భాస్కరరావు ఇలా ఓదారుస్తాడు.

"చూడు ఆనందూ. . . ఏ ప్రేమ వ్యవహారానికైనా ఆడపిల్ల అంటూ ఉంటుంది. ఉండాలి. నీ ప్రేమకథలో అమ్మాయే లేదు. ఉన్నది కాగితం ముక్క. దీనితో నవ్వు ప్రొసీడ్ అవుతున్నావు. చూడు తమ్ముడూ! పేకాట ఆడాలంటే ఓ సీక్వెన్సో, ఓ ట్రిప్లెట్టో, ఏదీ కాకపోతే కనీసం రెండు జోకర్లో ఉండాలి. అదీ ఇదీ లేకపోతే డ్రాప్ చేయాలి" నీ కేసూ ఇంతే అంటాడు పేకాట భాషలో భాస్కరావ్

పాత్రలందరి మనస్తత్వాలని సూర్యం నవల చివర్లో ఇలా కడిగేస్తాడు. "ఛీ నోర్ముయ్! నీకు పేకాట పిచ్చి. మీ నాన్నకి అందరినీ తిట్టే పిచ్చి. నీ పెళ్ళానికి సినిమాల పిచ్చి. నీ చెల్లెలికి పుట్టింటినించి తెచ్చుకోవాలని పిచ్చి, నీ తమ్ముడికి ప్రేమ పిచ్చి. మీ అందరి పిచ్చివాళ్ళ మధ్యా నాకూ పిచ్చేక్కేలా ఉంది అంటాడు. వీళ్ళందరి మధ్యా మన జీవితం చుట్టాలు పక్కాలు పెళ్ళిళ్ళు కనిపిస్తాయి. ఆనందంగా నవ్విస్తాయి.

**బీనాదేవి:**

రావిశాస్త్రిగారి శైలిలో కథనశిల్పంలో కథలు నవలలు ఇంకా ఇతరుల రచనలు చేసేవే వ్యక్తి లేదా వ్యక్తులు బీనాదేవి. అంటే కలం నామం ఏకవచనాన్ని సూచిస్తున్నా రచన ఇద్దరిదీ. సుందరమ్మ నరసింగరావు గారి మీద వ్యాఖ్యలు "ఎవరో జడ్జిట! వాళ్ళావిడ పేరు మీద వ్రాస్తున్నాడట". అని మాది హ్యూమనిజం అని వాళ్ళే చెప్పుకున్నారు. మరి హ్యూమర్ అనివార్యంగా అంతర్లీనంగా కరెంట్‌లా వారి రచనల్లో కనిపిస్తూ షాకుల్లాంటి నవ్వులు నవ్వుల షాకులిస్తుంటుంది.

న్యాయవ్యవస్థని కాచివడబోసిన వీరికి సమాజం తీరు తెన్నులని అపహాస్యపు తీరును వ్యంగ్య అధిక్షేప రూపంలో చెప్పడం ఒక సహజశైలిగా కనిపిస్తుంది.

ప్రపంచంలో ప్రతి దృశ్యాన్ని ఎవరు వర్ణించినా. ఒక్కొక్కరికి ఒక్కోలా కనిపిస్తోంది. ఈ కనబడటంలోనే అనంతమైన విశ్లేషణ ఉంది. ఇతరుల దు:ఖాలు కష్టాలు కూడా మరొకరిని అప్పుడప్పుడు నవ్విస్తాయి. "పుణ్యభూమి కళ్ళు తెరు" నవల్లో న్యాయ వ్యవస్థని బోనులో పెట్టి చూపించారు బీనాదేవి.

కోర్టులు న్యాయాన్ని నిలబెట్టడానికి పుట్టాయి. అక్కడ కేసు పోయినోడు పబ్లిగ్గా ఏడుస్తాడు. గెలిసినోడు యింట్లో ఏడుస్తాడు. అంటాడు సమానత్వం ఇక్కడ చాలా కనపడుతుంది అంటారు బీనాదేవి. అక్కడ అంతమందిది ఒక్కటే ఏడుపు అనివార్యమంటాడు డబ్బుంటే. . .అక్కడ బీదోడూ గొప్పోడూ ఒక్కటే . . . పెద్ద ఫీజులిచ్చుకుంటే అక్కడ అన్నేయం దాని పన్జేసుకున్నాగ్గాని సావదు. పేదవాడి ఆకలి అవసరం డబ్బు మహత్యం ఆయన అధిక్షేపరూపంలో వెటకారంగా చెబుతుంటే ఎక్కడో మనస్సులో ముల్లులా గుచ్చుకున్నా జీవితాన్ని చూసి నవ్వొస్తూనే ఉంటుంది. దేవుడు అగుపడితే వరం అడగటానికైనా ఆలోచిస్తారు కాని డబ్బున్నోడు అగుపడితే అప్పడగడానికి మాత్తరం ఆలస్యం సెయ్యరు. అడుక్కునే తినే ఎదవనడుగు అమెరికా ప్రెసిడెంటునడుగు.

"నీకేటి కావాల అని అంటే వెంటనే డబ్బు అంటారు. పోనీ బుద్ధి గడ్డితిని ఔసరంలో ఉన్నవాడిని ఆదుకున్నామా. అంటే పట్టుకెళ్ళిన పానం యముడు తిరిగిచ్చేస్తే యిచ్చీ వచ్చుకాని, అప్పు పుచ్చుకున్నవాడు మాత్తరం తిరిగియ్యడు. తల్లికి ముందుకిస్తే అది బతకాల. పెళ్ళాం పురిటికిస్తే ఆ పుట్టిన పిల్ల డాక్టరవ్వాల. బాబ్బాబు నా తల్లొకటి నీ తల్లొకటీ కాదంటాడు. ఆడి తల్లిని నా తల్లిని అనుకోమన్నాడు కాని అడి పెళ్ళాన్ని నా పెళ్ళాం అనుకోనిస్తాడా ! లోకంలో ప్రతి వాడికీ పక్కింటోడి పెళ్ళాం రంభలాగే అగుపడ్తాది అంటాడు. మానవుడి బలహీనతలు అహంకారాలు అసమర్ధతలు అవసరాలు ఇలాగే ఉంటాయి. ఇలాగే మనకి కనిపిస్తాయి. ఇలాగే మనకి బీనాదేవి లెన్సులో నుండి. ప్రతి ఒక్కరికీ తన వ్యక్తిత్వం మీద స్పష్టమైన అభిప్రాయాలు ఉంటాయి అవి చాలా ఉన్నతంగా ఉంటాయి, రావణాసురుడు కూడా తను అపర ధర్మాత్ముడిని అనే అనుకున్నాడు. మన మనస్తత్వం మన దృష్టిలో ఎలా ఉంటుందో బీనాదేవి. పుణ్యభూమీ కళ్ళు తెరు నవల్లో అద్భుతంగా విశ్లేషించి చూపించారు.

తనకున్న కంపునీ చారలన్ కోలనీ దాచుకోగలిగిన జాతి మనుషులదేననీ, తన కొవ్వుని కవిత్వం అనీ, స్వార్థాన్ని పేట్రియాటిజం అనీ తన అకలి సంఘం ఆకలి అనీ, తన బాధ్యతలు సంఘానికి అనీ, తన పిరికితనం అహింస అనీ, తన పిసినిగొట్టుతనం నిరాడంబరత్వమనీ తమ మాంసం తిన్నా సారా త్రాగినా శ్రీరాముడు చేసిందే తానూ కేస్తున్నాననీ, తాను అవి చెయ్యకపోతే శ్రీరాముడికంటే గొప్పవాడిననీ, తాను రాజుగారిని కొలిస్తే ప్రభు భక్తి పరాయణుడినని రాజు పీకకోస్తే ప్రజస్వామ్య వాదిననీ ఇంకా ఎన్నో మానవ భిన్న మనస్తత్వాలు విశ్లేషిస్తాడు.

తనలోపాలన్నీ సుగుణాలు ఎదుటివాడి సుగుణాలన్నీ బలహీనతలు చాతకానితనాలు. ఒక వాక్యంలో ఆత్మస్తుతి పరనిందా పరాయణం మనస్తత్వం ఇది. దీనిని విశ్లేషించి చూస్తే అందులో మన ముఖం కూడ కనిపించి ముందు నవ్వొస్తోంది తరువాత భయమేస్తుంది. తరువాత కోపమొస్తుంది. ఒక్క మనిషే ఇలా చేయగలడు అంటారు బీనాదేవి.

## శ్రీమతి ముప్పాళ రంగనాయకమ్మ:

శ్రీమతి ముప్పాళ రంగనాయకమ్మగారు మార్క్సిస్టు ముద్రలోనే ఇంచుమించుగా రచనలన్నీ చేసినా రచనల తొలిదశలో స్వీట్‌హోమ్ నవలతో లలితమైన హాస్యాన్నే అందించిందని చెప్పుకోవాలి. లాయర్ బుచ్చిబాబు చాలా మంచివాడు, ఉత్తముడు. రంగనాయకమ్మగారి రచనల్లో పురుష పాత్రల్లో బుచ్చిబాబుని తీర్చినంత అందంగా ఇంకెవరినీ తీర్చలేదని అనిపిస్తుంది. ఆయన సౌమ్యుడు. భార్య విమల ఏమన్నా అన్నా పెద్దగా పట్టించుకోడు. ఆదర్శ భర్త. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే బడీదీదీ నవలలో నాయకుడి కజిన్ బ్రదర్. (బాటసారిలో నాగేశ్వరరావు) కాకపోతే తెలివితేటల్లో లోటులేదు విమల అతడిని ఆటపట్టిస్తుంది. వేళాకోళం చేస్తుంది. ఏడిపిస్తుంది. వారి దాంపత్యంలో నిజంగా స్వీట్‌హోమ్ మనకి కనిపిస్తుంది. ఓ రోజు సడన్‌గా అతడి మనస్సుకి పెళ్ళాం అందాన్ని మెచ్చుకోబుద్ధేస్తుంది. “చాలా అందంగా ఉన్నావ్ విమలా” అన్నాడు. –బుచ్చిబాబు.

“నిజమా ఆ కుర్చీ కంటేనా. . .” అన్నది విమల.

ఓసారి కుర్చీని పరీక్షగా చూసి “దేనికదే బాగుంది నీకు నువ్వే బాగున్నావ్.”

అన్నాడు బుచ్చిబాబు వినయంగా.

'నా ఖర్మ' తలబాదుకుంది విమల. "ఏమిటబ్బా ఇలా అంటుంది" అని ఆలోచనలో పడ్డాడు బుచ్చిబాబు.

**ముళ్ళపూడి వెంకటరమణ: ఎనభై రోజుల్లో భూప్రదక్షిణం:**

**అనువాదం హాస్యం:** జుల్స్‌వెర్న్ రచించిన ఎరౌండ్ ది వరల్డ్ ఇన్ ఎయిటీ డేస్. (1873)కి తెలుగు అనువాద నవల ఎనభై రోజుల్లో భూప్రదక్షిణం. ఫిలియాస్‌ఫాగ్ అనే పెద్దమనిషి రిఫారం క్లబ్బులో ఎనభై రోజుల్లో భూప్రదక్షిణం చేస్తానని పందెం కాస్తాడు. ఈ ప్రపంచ ప్రదక్షిణంలో ఓడలు, ఏనుగులు నావలు రైళ్ళు, స్లెడ్జిబళ్ళు, ఇంకా ప్రయాణానికి పనికొచ్చే ప్రతిసాధనమూ ఫాగ్ ఎక్కుతాడు. ప్రయాణం ప్రారంభించిన రోజే ఇంగ్లాండులో ఒక పెద్ద బ్యాంకుదొంగతనం జరగడంతో ఫాగ్‌ని అనుమానించి డిటెక్టివ్ ఫిక్స్ వెంటబడతాడు, కలసి ప్రయాణం చేస్తాడు. ఫాగ్ సేవకుడు పాస్పార్తు, నాయిక ఆయదా ప్రధాన పాత్రలు. ప్రపంచ దేశాల నాగరికతలు సంస్కృతులు కష్టాలు ప్రమాదాలు కోర్టు కేసులతో కథ ఎన్ని మలుపులు తిరిగినా ఫాగ్ సకాలంలో యాత్ర ముగించడంలో కథ సుఖాంతమవుతుంది.

మూలంలోని భాషలోని అందాన్ని తెలుగు నుడికారంతో జాతీయాలతో భాషా సౌందర్యంతో అనువాదం చేయడంలో ముళ్ళపూడి సిద్ధహస్తుడు. అనువాదంలో ముళ్ళపూడి చమత్కారాలు రచనా విశేషాలు పాస్పార్తు ఒక దువ్వెన తీసుకుని మూడంటే మూడు సార్లు దువ్వుకుంటాడు. అంతే వేణీసంహారం సమాప్తం. అందులో ఓ సన్నివేశం.

"ఇంక నించి మనం స్నేహితులమన్న మాటేగా" అన్నాడు డిటెక్టివ్ ఫిక్స్ "స్నేహితులం అనకు జతగాళ్ళం అంటే కలిసి పని చేస్తాం. తెలిసిందా. ఇదిగో ఈ తరువాత గనక నువ్వు చెప్పిందాంట్లో ఏదైనా తేడా వచ్చిందా. . . మళ్ళీ ఏమైనా పిచ్చి పనులు చేస్తున్నట్టు అనుమానం కగిలిందా. . . అంతే పీక నులిమేస్తాను. సరేనా" అన్నాడు పాస్పార్తు.

"సరే అన్నాడు ఫిక్స్. ముక్తసరిగా. . ." సరే అనేది పాస్పార్తు షరుతుల్లో పై భాగానికి వర్తిస్తుందనీ విడిగా చెప్పకుండా ఆంగ్లభాషా వాక్య నిర్మాణం ఎంత

నవ్విస్తుందో తెలుగు కూడ అంతగానూ నవ్విస్తుంది. అసలు తెలుగు పేర్లు పెడితే ఇది అనువాదమంటే ఎవరూ నమ్మరేమో. అందరిలా ఫాగ్ ఏరు దాటాక తెప్ప తగలేయడు. తెప్ప తగలేసి మరీ ఏరు దాటాడట. ఆ వైనం ఇలా.

"అయ్యా ! మీతో ఓ విషయం మాట్లాడాలి అన్నాడు ఫాగ్.

"పైరేట్ ! బందిపోటు అన్నాడు స్పీడీ."

"మీ ఓడను కొనదలచుకున్నాను. అమ్మవలసిందని కోరుతున్నాను."

"అమ్మను ఛస్తే అమ్మను"

"దీన్ని తగులబెట్టవలసి ఉన్నది."

"ఏమిటీ నా ఓడని తగలేస్తారా" అన్నాడు స్పీడీ.

"అంతా కాకపోయినా పైనున్న కలప భాగాలు తగలేయాలి." బొగ్గు అయిపోయింది.

స్పీడీ ఫాగ్ మాట వినిపించుకోలేదు.

"హు తగలేస్తాట్ట! 50 వేల డాలర్ల ఓడ తగలేస్తాట్ట తగలేస్తాట్ట... తగ..."

ఇదిగో అరవై వేలు ఇస్తున్నా పుచ్చుకోండి నోట్ల కట్టతీశాడు ఫాగ్.

తన ఓడ యిరవై ఏళ్ళనాటిది. పదివేలంటే లాభసాటి బేరమే మొత్తం మీద బాంబు పేల లేదు. నోరు మూసుకుంది. ప్రేలాపన మానేసి.

"ఓడ ఇనపచట్రం అంతా నాకే వదిలేయాలి అన్నాడు మృదువుగా. చట్రం ఇంజను కూడా మీవే. . . సరేనా. . .ఆపదల్లోనూ ఆక్రోశంలోను హాస్యమే కనిపిస్తుంది.

# 5

# వ్యాసాలు - కాలమ్స్‌లో హాస్యం

## శ్రీపానుగంటి లక్ష్మీనరసింహారావుగారు:

శ్రీకందుకూరి వీరేశలింగంపంతులుగారి యుగంలో సాహిత్య ప్రయోజనంతో బాటు సామాజిక సమస్యలు. మూఢనమ్మకాలు, తెలివితక్కువతనాలు, స్వార్థం అవినీతి, స్త్రీపై జరిగే సామాజిక దౌష్ట్యం ఇతివృత్తంగా ఎంతో హాస్యం సృష్టించబడే సంప్రదాయం మొదలైంది. కందుకూరి చిలకమర్తి వారితోబాటు అదే యుగంలో ఆ బాణీలో అధిక్షేపం, ఎగతాళి హాస్యం వ్యంగ్యం వక్రోక్తులతో సమాజోద్ధరణకై ఉద్యమించి ఆంధ్రా ఎడిసిన్‌గా సుప్రతిష్ఠులైనవారు శ్రీపానుగంటి లక్ష్మీనరసింహారావుగారు. వీరు తమ నాటక కథా రూపక వ్యాస ప్రక్రియల్లో సందర్భం దొరికినప్పుడు, సందర్భాన్ని దొరికించుకుని సుప్రసిద్ధ హాస్యవాఙ్మయ రచయితగా నిలిచారు.

పానుగంటివారి హాస్యసృష్టికి లోకవృత్త పరిశీలనం. వారి లోకజ్ఞత, అద్భుతంగా కనిపిస్తుంది. దేశకాలమాన పరిస్థితులకు తలవంచి కొంత, పాశ్చాత్య నాగరికతా ప్రలోభానికి లోనయి కొంత, మతఛాందసభావాలకు, సంప్రదాయం పేరుతో సాగే అనాచార ప్రవృత్తికి లోనయి కొంత జీవించే సమాజాన్ని సంస్కరించాలని ఆయన తపించారు. హాస్యమనే అస్త్రం సంధించారు. సాక్షివ్యాసాల్లో ఈ తత్త్వమే కనిపిస్తుంది. పానుగంటివారు సాక్షి వ్యాసాలతోపాటు ఇరవయిఆరు నాటకాలు రచించారు. వీటిలో కంఠాభరణం, వృద్ధ వివాహం, విచిత్ర వివాహాల్లో హాస్యం విశేషంగా కనిపిస్తుంది. స్పెక్టేటర్ వ్యాపావళికి ముగ్ధుడై తెలుగులో అటువంటి సామాజికదురాచార ధిక్కరణ వ్యాసాలు రావాలని పూనుకొని పానుగంటివారు 'సాక్షి'

వ్యాస నిర్మాణానికి పూనుకున్నారు. వీరి హాస్యరచనా శిల్పంలో డికెన్స్ ధోరణి ఎక్కువగా కనిపిస్తుంది. సాక్షివ్యాససంపుటిలో కూడా మొదటి వ్యాసాల్లో ఉన్నంత సౌమ్యంగా వారు చివరి వ్యాసాల్లో ఉండరు. ఖండనలో తీవ్రత కనిపిస్తుంది. ఈ సాక్షి వ్యాసాలు మొదట 1913లో ప్రారంభమయినాయి. 1920 నుండి రెండు సంవత్సరాలు ఆంధ్రపత్రికలో వారానికి ఒకటి చొప్పున ప్రచురించబడినాయి.

గ్రాంధిక వ్యావహారికభాషా యుద్ధంలో పానుగంటివారు గ్రాంధిక భాషావాదిగా నిలిచారు. ఆయన భాష ఎంత సుదీర్ఘ సమాస భూయిష్టంగా ఉన్నా పాఠకుడిని జుట్టుపట్టుకొని ఈడ్చుకొనిపోతుంది. పదాల కూర్పులో, శబ్దంపై ఆయనకున్న పట్టు ఎంత గొప్పదంటే, ఒక సన్నివేశంలో చేరిన ఆడవారిని అలంకారాలు చేష్టలు భాష, స్వభావాల సహితంగా ఏక కాలంలో వర్ణించగలిగిన శబ్దార్థ సంయోజన నిపుణుడు పానుగంటివారు.

'గాజుల గలగలలు, అందెల ఘుణఘుణలు, కాంచీ ఘటిక గణగణ చెక్కుటద్దముల తళతళ, తారాహారముల మిలమిల, వేణీభారముల జులజులలు ఒక వైపు మరొకవైపు, కొర్నాటివారు, బనారసు కోకలవారు, బరంపురపు పీతాంబరములవారు, సన్నకుసుంబా చీరలవారు. వేలుముళ్ళవారు, జడచుట్టవారు ఇలా లోకంలో ఉన్న సమస్త జనులు వారి సకల రూపాలతో సాక్షి వ్యాసాల్లో కనిపిస్తారు. ఆయన పాశ్చాత్య నాగరికతా వ్యామోహాన్ని తీవ్రంగా విమర్శించేవాడు. గోష్పాదమంత జుట్టున్నవాడు వెఱ్ఱివాడుగ మీ కంటికి కనబడగా, గొఱ్ఱెతలయంత జుట్టున్నవాడు మాకెట్టులగపడునో చెప్పవలెనా ? అంటారు.

గాంభీరంగా చెప్పవలసిన దానిని సులభంగా తేల్చి చెప్పడం సాధారణ విషయాన్ని ఉదాత్తంగా చెప్పటం వారి హాస్య పద్ధతి. దోమలు, ఎలుకలు నల్లులు మానవుడిపైన తీవ్ర నేరారోపణలు చేస్తాయి. మానవుడి అసమర్థతని బలహీనతని ఇలా వెక్కిరిస్తాయి.

"నరజాతి యంతటి తుచ్ఛజాతి ప్రపంచమున మరొకటి లేదు. నరుడు మనకు శత్రువు. ప్రబల శత్రువు, తానే మహావీరుడట. వీరాధివీరుడట, వీని గర్వము

కాలిపోను. పిరికి దద్దమ్మల్లో అగ్రగణ్యుడెవరు? నరుడు. . . తెలిసినదా. . . (సెబాస్ సెబాస్) అని కేకలు చేతవాత కాని చచ్చు దద్దమ్మల్లో అగ్ర తాంబూలమునకు సిద్ధపడు వాడెవ్వడు? నరుడికి తేలును జూచి భయమా? జెర్రిని గాంచి ఏడుపా? పాముని చూచి పరుగా! దోమ కరిచి పోవునేమోనని సాయంకాలమగు సరికి సన్నని గుడారములో దూరిన వాడు వీరుడా ? మన నల్లిపోతుల్లో ఒక్కటి ప్రక్కజేరి కటుక్కున అంట బొడిచిన యెడల కల్లు ద్రావిన వానివలె తయితెక్కలాడువాడు ధీరుడా? అంత వరకెందుకు? గాలి చల్లబడిన యెడల ఒక్క రోగము, వెచ్చబడిన వేరొక్క రోగము - గంగిరెద్దుకున్నంత గంత వేసుకుని కాని వెలుపలికి వేంచేయడే - వీడేనా సృష్టికి ప్రభువు"? అని ఒక మూషిక శిఖామణి అధ్యక్షోపన్యాసం చేసింది. ఇది వింటే తత్త్వశాస్త్ర కోవిదులకు కూడా దిమ్మతిరిగి నోట మాట రాలేదట. దోమలకు స్త్రీవాంఛ కామవాంఛ పూర్వం అంతగా ఉండేది కాదట. నరుల రక్తం త్రాగి త్రాగి వాటిలో కామవాంఛ అధికమై పోయిందట. పానుగంటి వారు తమ రచనల్లో ఆంగ్ల పదాలకు బదులు సంస్కృత సమాసాలు వాడి శబ్దాశ్రయ హాస్యం సృష్టించారు. బనీన్లు తొడుగుకున్నవారిని "ఖండకర కార్పాస కూర్పాసము వారు" అన్నారు, నున్నగా జుట్టు వెనుకకు దువ్విన వారిని పృష్ఠపరిపాటి సమశిరోవాటి వాడు అన్నారు.

ఎందరో వ్యక్తులు చిన్న చిన్న ఆంగ్ల పదాలను చాలా గొప్ప విషయం చెబుతున్నట్లు చెబుతారు. దానిని పానుగంటి వారు ఇలా హాస్యంగా ఎగతాళి చేశారు. "ధనియాలు డైజేషనుకు మంచివి, మిరియాలు లివరు మీద ఆక్టు చేయును, క్రాపింగులను జంఘాలుడు అధిక్షేపిస్తూ" తలపెరుగటేమి? మూతి గొరుగుడేమి?

మొత్తం సాక్షి వ్యాసాల్లో నలుగురు ప్రధానంగా కనిపిస్తారు. మొదటివాడిని జంఘాలశాస్త్రి అంటారు. ఇతడు వాచాలుడు లోకజ్ఞత కలిగినవాడు. రెండవవాడు కాలాచార్యుడు. శ్రీవైష్ణవుడు. ధారాళమైన అంత:కరణ కలిగినవాడు, వేద వేదాంగాలు చదివినవాడు. వికారరూపమున బ్రహ్మచారిగా ఉండిపోయాడు. మూడవవాడు వాణీదాసుడు. కవి సోమరి అసూయా పరుడూ శ్లేష కవిత్వంపై ఆదరణ కలిగినవాడు. ఆధునిక కవిత్వం చెప్పడానికి ప్రయత్నించేవాడు. నాలుగవవాడు బొర్రయ్యశెట్టి.

వాణిజ్య రహస్యాలు తెలిసినవాడు. కొంతకాలం ధనం బాగా సంపాదించి చితికిపోయినవాడు.

**శ్రీ పుచ్చా పూర్ణానందం:**

హాస్య చతుర్ముఖ బిరుదాంకితులైన శ్రీ పుచ్చాపుర్ణానందంగారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ హాస్యం కోసమే ఏర్పరచిన ప్రత్యేక బహుమానం గ్రహించిన మహా రచయిత. వీరి రచనలో ఎక్కువగా భోజన ప్రియత్వం కనబడుతుంది. కాబట్టి వీరు నభ్రీనాథుడు అనే బిరుదు కూడా సంపాదించారు. వీరి రచనల్లో ఆవకాయ ఆంధ్రత్వం సుప్రసిద్ధం.

వీరు పెన్ను గురించి వ్రాసిన సరసోక్తులు కొందరికి ధూమపానం గిట్టనట్లు నా పెన్నుకు కాగితం కంపు పడదు. పేపరు వాసన చూడగానే పెద్ద వమనం చేసుకుంటుంది. అమెరికాయో జపానో మొత్తం మీద విదేశాల్లో దీని జననాన్ని కొందరు సిరాల నష్టపు వ్యాధి అని నిర్ణయించారు. చిత్రకళ కూడా వట్టి పక్షి. ఒక్కటే ముగ్గులు పెడుతుంది. క్రితం జన్మలో ఆడమేళం కాబోలు. ఆకుపచ్చ సిరావైలెట్ సిరా వాడేరోజుల్లో నా అవతారం చూసి ఒక లాండ్ లేడీ తన యింటికి రంగులు వేయమంది నేను పెయింటర్‌ను అనుకుని. ఇలా సాగుతుంది వారి మకరంద వ్యాస సాగరం.

**బీనాదేవి:**

బీనాదేవి నిత్యజీవితంలో కనిపించే ప్రధానమైన విలక్షణమైన విపరీత ధోరణులన్నీ తన వ్యాసాల్లో హాస్య స్ఫోరకంగా ఎత్తి పొడిచినట్లుగా స్పష్టంగా చెబుతుంది.

ఇప్పుడు అమ్మాయిలకి అబ్బాయిలకి హృదయ వైశాల్యం ఎక్కువ (ద్వంద్వార్థం లేదని మనవి) ఎంత మందిని ప్రేమించినా ఇంకా ఒకరికి చోటుండే పుష్పక విమానం వారి హృదయం. పెళ్ళి మాత్రం లాభసాటి బేరమే. డబ్బే పెళ్ళికి అర్హత ఇప్పుడు ప్రేమ పెద్ద బిజినెస్ పెళ్ళి పెద్ద బిజినెస్ ఈ రెండు బిజినెస్‌లలో డబ్బులేని వాళ్ళకి అనుమతి అర్హత లేవు.

**వేలెంటైన్స్‌డే అనగా నేమి:**

పురుషాధిక్య ప్రపంచంలో స్త్రీ జీవిత శాసనకర్తగా మగాడు ప్రవర్తిస్తున్న నేపథ్యంలో బీనాదేవి ఇలా అంటారు. పతిత పతివ్రత ఈ రెంటికీ ఒక్క అక్షరమే తేడా. . . ఈ ఒక్క అక్షరానికే అర్థం ఏకాక్షర నిఘంటువులో వెతికితే బహుశ మొగాడు అని ఉంటుందేమో ఆడది పతివ్రతగా ఉండడానికి మొగాడి ప్రసక్తిలేదు. కాని పతిత అవడానికి మాత్రం మొగాడే కారణం. (అ) న్యాయశాస్త్రం.

**శ్రీముళ్ళపూడి వెంకటరమణ: గిరీశం లెక్చర్లు:**

శ్రీరమణగారన్నట్లు ముళ్ళపూడి వ్యంగ్యటరమణగారు ఏ ప్రక్రియలో వ్రాసినా హాస్యమూ చమత్కారం అధిక్షేపం లేకుండా ఉండవు. గిరీశం లెక్చర్లు రాజకీయ భేతాళ పంచ వింశతిక మొదటి వాటిల్లో మన తెలుగువాళ్ళ మనస్తత్వాలని అంటే మనమీదే ఇలా బాణాలేసి నవ్విస్తారు.

"మన దేశంలో ఇండస్ట్రీస్ పెరగలేదంటే ప్రాజెక్టులు రాలేదంటే అందుక్కారణమేమిటి? ఇదే అక్షరాలా ఇదే. ఈ పుస్తకాలు కొనడమనే జబ్బే. ప్రతివాడూ పుస్తకాలు కొనడమే. ఊరికోడు కొంటే సరిపోదు. అదే నలుగురం ఎరువడిగి తెచ్చుకుంటాం. లేదా దొంగలిస్తాం. క్రైమ్స్ అనగా నేరాలు నెలకి రెండు వర్షాల్లాగ జరుగుతాయి. నాలుగు డబ్బులు తిరుగుతాయి. కోర్టులు వర్ధిల్లుతాయి. సివిలిజేషన్ ముందుకి నడుస్తుంది. ప్రతివాడూ పుస్తకాలు కొనేస్తే, ఇదంతా స్తంభించి పోదూ. కోర్టులు బందిఖానాలు సిగార్సు వగైరా వర్తక వ్యాపారాలన్నీ ఆగిపోతాయి. ఆ తరువాత పుస్తకం వ్రాసుకుందుకి మాత్రం మెటీరియలేం దొరుకుతుంది? నేరాలు జరక్కపోతే వేటి గురించి వ్రాస్తాం".

అంటూ పుస్తకాలు కొని చదవని వారిని ఇలా ఘాటుగా అధిక్షేపించాడు. కాని ముందు జాగ్రత్తగా "నా పుస్తకాలు మాత్రం తప్పక కొనండి ప్రతి శాస్త్ర నియమాలకూ అపవాదాలు ఉంటాయి కదా" అంటాడు.

**ముళ్ళపూడి స్వయంగా రావికొండరావు: కొడవటిగంటి కుటుంబరావుతో కలిసి వ్రాసిన వ్యాసం:**

"ఒకసారి సశేష అని దేశభాషలో వ్రాసి ఒక బెంగాలీ మిత్రుడిని చదవమన్నారు. అతగాడు "షోషేష్" అని అవలీలగా చదివేశాడు. ఒక బెంగాలీ ఏమిటి హిందీ ఏమిటి అన్ని భాషల వాళ్ళు వ్రాసినట్లు ఉచ్చరించకూడదని శపథాలు చేసుకున్నావారే. తమిళ సోదరులు టైప్‌రైటర్ రాబోతోందని వాళ్ళ 'సంగం' కాలం నుండే పసిగట్టేసి చాలా అక్షరాలు అవతల పారేసి అక్షరాలకి ఒకటి చొప్పున మిగుల్చుకున్నారు. ఆ తరువాత నుండి రెడ్డి బుడ్డి బుద్ధి అనే మాటలను తమిళంలో స్థానం లేదు. ఇంగ్లీష్ అయినా నిర్దుష్టంగా పలుకుతారు కాని రెడ్డి రెట్టి అవకుండా ఉండదు. బుడ్డి మరీ అన్యాయం ప్రొహిబిషన్ ప్రమేయం లేకపోయినా దాన్ని పుట్టి అని తప్ప వారు అనరు. మళయాళీలు ఏ భాష మాట్లాడినా మళయాళం లానే ఉంటుంది. తెలుగువాళ్ళు తక్కువా సత్యనారాయణని సచ్చాణ అనే అంటాము. సూర్య నారాయణని సూన్నాణ (ముళ్ళపూడి వ్యాసరమణీయం).

మనందరి ఉచ్చారణ సౌందర్యం ఇంత అందంగా ఉందని ఈ ముగ్గురూ ఏకకాలంలో నిజం చెప్పారు ఇది మనకు జోకులా వినబడుతున్నది. పాలగుమ్మి పద్మరాజు గారు కూడ హరి సత్యనారాయణ కొడుకు అనే మాట నాలిక మడతల్లో అరిచ్చచ్చి నాయన కొడుకు అయింది. అయినా మనలో మన ఇష్టం. మన వాక్కుకి రాజ్యాంగం స్వాతంత్ర్యం ఇవ్వలేదూ.

## కాలమ్స్‌లో హాస్యం:

కాలమ్స్ రచయితలకి రసజ్ఞతతో బాటు లోకజ్ఞత, విశ్వవ్యాప్తంగా వస్తున్న మార్పులు పరిణామాలు కుటుంబ కలహాల నుండి రాజకీయ హత్యాకాండల దాకా, క్రీడల నుండి సమస్త వ్యవహారాల పైన పరిజ్ఞానం ఉంటున్నది. సకల జనుల మనస్తత్వ విశ్లేషణల ద్వారా అన్నింటి మీద ఒక అవగాహనతో సునిశితమైన హాస్యంతో చేసే విశ్లేషణ దీనిలో కనిపిస్తుంది.

**బీనాదేవి:**

లోకంలో సమస్యల పరిష్కారానికి ప్రజలు అనేక పరిష్కార మార్గాలు వెతుక్కుంటారు. వీరి జీవిత తత్వాల్ని బీనాదేవి ఇలా ఎత్తి చూపించారు.

శ్రీశ్రీ చెప్పినట్లు డబ్బు డబ్బుని ప్రేమిస్తుంది. ఇంతకీ వాళ్ళ భక్తి కేవలం డబ్బు మీదే. దేవుడు నిమిత్తమాత్రుడు. మరో రకం భక్తులున్నారు. వాళ్ళు కేవలం దేవుడ్నే నమ్ముకుంటారు. డాక్టరుకైతే వేలకు వేలు పోయాలి. దేవుడు పాపం ఫలం, పుష్పం పత్రం తోయంతో సరిపెట్టుకుంటాడు. ఇంకా ఇవ్వలేదేమని అడగడు. వాళు ్ళ హార్మ్‌లెస్. భక్తి వలన మోక్షం వస్తుందో లేదో తెలియదు కాని నాలాంటి బుర్ర పిచ్చెక్కడం ఉండదు. నాస్తికులకే దేవుడు దగ్గరవుతాడని అన్నారెవరో బావుంది కదూ. అస్తినాస్తి విచికిత్సలో డబ్బు సంపాదించడానికి దేవుడు కూడా ఒక మార్గమనే ఎత్తిపొడుపు ఇందులో కనిపిస్తుంది. (ఆంధ్రప్రభ 1-8-2003 బీనాదేవి సమగ్ర రచనలు)

**పురాణం సీత: ఇల్లాలి ముచ్చట్లు:**

జర్నలిజంలో సరిక్రొత్త ప్రయోగంతో తెలుగు సాహిత్యంలో కాలమ్స్‌కి సాహితీ ప్రక్రియా స్థానం కలిగింది. సమస్త ప్రపంచం ఇల్లాలి పరిధిలోకే వస్తుంది కాబట్టి పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు రచించిన ఇల్లాలి ముచ్చట్లలోఈ ముచ్చట్లలో స్పృశించదని అంశమే లేదు. జీవితంలోని కష్టాలు, బాధలు విషాదాలన్నింటినీ ఆశల సంతోషాలు అశయాలు ఆదర్శాల పరిధిలోకి తెచ్చి కుటుంబ సామాజిక జీవితాన్నంతటినీ ఇల్లాలి ముచ్చట్లలో చూపిస్తారు. ఎక్కువగా వేదన కనిపిస్తుందని అనుకునేచోట కూడా హాస్యం వ్యాఖ్య వినిపించడం ఓ ప్రత్యేకత.

"మన సొసైటీలో అత్తగారూ సవిత్తల్లి ట్రెడిషనల్ సింబల్స్. అత్తగార్లను దుష్టశక్తులుగా చిత్రించడం సర్వే సర్వత్రా రివాజయింది. కాంగ్రెస్‌లో అతివాదులు మితవాదులు ఉన్నట్లు కమ్యూనిస్టుల్లో ఉగ్రవాదులు అత్యుగ్రవాదులు ఉన్నట్లు అత్తగార్లలో కూరగాయ వాదులు, ఊరగాయ వాదులు అని ఉన్నారు. చితికి పోయిన

భూస్వామ్య వ్యవస్థకు కొసమెరుపులాంటి గురుతు అత్తగారైతే, కోడలు సుత్తీ కొడుకు కొడవలి, కార్మికులకూ యజమానులకు మధ్య సంఘర్షణ తప్పదన్నట్లు కోడళ్ళకు అత్తలకు మధ్య వర్గ పోరాటం తాలూకు స్వభావం తప్పదు". సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్లు వర్గపోరటానికి గృహం కూడా అపవాదం కాదనేది పురాణం ఎత్తి చూపుతున్నారు. దాంపత్య రహస్యాలు ఇలా బోధిస్తారు. డోంట్ క్రిట్‌సైజ్ యువర్ వైఫ్‌స్ జడ్జిమెంట్ – లుక్ హూమ్ షి మారీడ్. ఆఫ్టరాల్ నిన్నే కదా ఆవిడ పెళ్ళాడింది. నవ్వు ఆవిడని చవట అనుకుంటే ఆవిడ చవటకాబట్టే నిన్ను పెళ్ళాడింది అని అర్థం వస్తుంది. కొంచెం డెంజర్. అలా కాకుండా మీ ఆవిడ చాలా తెలివైనది అనుకుంటే అంత అఖండమైన తెలివైన ఆవిడ నిన్ను పెళ్ళాడిందంటే నువ్వు చాలా గొప్పవాడివో, అదృష్టవంతుడివో, తెలివైన పురుషుడివో అయి వుండాలి. ఇలా అనుకోవడాన్ని బట్టే గదా లోకం నడుస్తోంది. అంచేత ఓరి వెర్రి వెధవాయా 'పెళ్ళాన్ని బయట పడేసుకోకు. ఆవిడ విషయంలో చాల జాగ్రత్తగా మెసులుకో, నిస్సందేహంగా ఆవిడ తెలివైనదే. . .. నిన్ను పెళ్ళాడిన స్త్రీని నువ్వు లోకువ చేసుకోకు. ఆవిడ జడ్జిమెంటు తప్పని నువ్వు రుజువు చేయడానికి ప్రయత్నిస్తే నీ కొంప మునుగుతుంది. మొగుడూ పెళ్ళాల 'యవ్వారం' ఎంత సున్నితమైనదో గ్రహించి ఆ ప్రకారం జాగ్రత్తగా మెసులుకో' అని దీని తాత్పర్యం. ఇవీ ఇల్లాలి ముచ్చట్లు ప్రపంచాన్ని చూపే ముచ్చట్లు.

**శ్రీరమణ ఛానెల్:**

ప్రతి పదంలోనూ చమత్కారమో అలంకారమో చెబుతానన్నాడు చేమకూర వెంకటకవి. ఈ కోవకి చెందినవాడే శ్రీరమణ. ఈయన ఏ ప్రక్రియలో వ్రాసినా హాస్యం వ్యంగ్యం చమత్కారం తొంగిచూస్తూనే ఉంటాయి. జీవితంలో అతి ముఖ్యమైన పనులన్నీ మగవాళ్ళు నిర్వహిస్తుంటే ఆడవాళ్ళు పెద్దగా పట్టించుకోదగని అప్రధానమైన పనులు చేస్తుంటారని వ్యంగ్యంగా సంసార మగాహంకార స్వరూపం శ్రీరమణ ఇలా చూపారు.

**పొదుపు లక్ష్మి:**

వేగంగా రాని వార్తాహరుడు. వెలగని దీపం, వేళకి రాని అతిథి. . . చిరాకు కలిగించేవని ప్రాచీన ఐరిష్ తత్వవేత్తలు ప్రవచించారు. ఇలాంటి సత్యాలు సర్వకాలీనం మరియు విశ్వజనీనం. ఎప్పుడైనా ఎవరికైనా వర్తిస్తాయి. మా నడిమింట్లో రెండు ట్యూబ్‌లైట్స్ రెండు నెలలుగా మిణుకు మిణుకుమంటూంది గానీ వెలగదు. అట్లాగని అస్సలు వెలగకుండా వుండదు. నేను సగటు మధ్యతరగతి ఇంటియాజమానిలాగే సోమాలియా, ఆర్టికల్ 386, ఐటిబిటి లాంటి మానవజాతికి సంబంధించిన సమస్యల మీద తలబద్దలు కొట్టుకుంటూ వుంటాను. మిగతా ఇంటి విషయాలు, వ్యవహారాలు, మా ఆవిడ చూసుకుటుంది. పత్రికల వాళ్ళ కథల పోటీల క్లాజుల్లాగా ఇంటి విషయాల్లో తుది నిర్ణయం ఆవిడదే ! నాకు వీటో పవర్ కూడా లేదు.

కానీ ట్యూబులైటు విషయంలో పట్టించుకోకుండా వదిలేస్తే కళ్ళు పోతాయని "పోనీ ట్యూబులైటు కొత్తది కొనకూడదా?" అని సూచన ప్రాయంగా అన్నాను. "కొత్తదంటే మళ్ళీ వంద రూపాయలు, మొన్ననేగా కొత్త రోలర్ వేయించాం. . .? "అనే, సమస్యని పక్కన పెట్టే ప్రయత్నం చేసిందావిడ, మొన్న అంటే ఆవిడ కాలమానంలో ఏడాది. పెళ్ళయ్యాక భార్య కాలమానంలోనే భర్త జీవిస్తాడు, మళ్ళీ కొన్నాళ్ళ తర్వాత ట్యూబులైటు వ్యవహారం ఆవిడ దృష్టికి తీసుకెళ్ళాను. "అది లోవోల్టేజి వల్ల. . . లైటు బాగానే వుంది" అని జవాబు వచ్చింది. ఇంకా కొన్నాళ్ళ తర్వాత "బాగుందోయ్ ! సరదాగానూ. . . ఆ లైటు టపటపా మెరుస్తుంటేనూ. . . అందమైన ఆడపిల్ల కన్ను కొట్టినట్టు ముచ్చటగా వుంది" అన్నాను.

బుర్రలు తినే నరమాంస భక్షకులు మనకి నిత్య జీవితంలో తారసపడతారు. వీళ్ళని తప్పించుకోవడానికి చాలా లాఘవం అవసరం. సమయాన్ని బుర్రనీ ఏకకాలంలో వీరు ఖాళీ చేయగలరు. వినే వారికి హాస్యం చూసేవారికి 'చిత్ర' హింస ఇదీ శ్రీరమణ జీవిత హాస్య ఝరి.

**సుధామ సం.సా.రాలు.**

సంస్కృతి సాహిత్యం రాజకీయాలు ఇవన్నీ మన చుట్టూ ఉన్న వారందరితోనూ పంచుకోకుండా క్షణమన్నా జీవించగలమా? సహృదయులైన వారందరితో హృదయంపై ముద్ర వేసేవాటన్నింటినీ పంచుకుంటేనే రసజ్ఞత, జీవితానికి సార్థకత బహుశ అప్పుడే. మనం మన పనులన్నీ హృదయం తేలికపడటంతో ఇంకా బాగా చేయగలమేమో. పొగడ్తలు అంటే అబద్ధాలని తెలిసినా ఏవిటో పెదవుల్లో నుండి నవ్వులు పూసి అది నిజమేనని నమ్మబుద్ధేస్తుంది. దీని గురించి సుధామ ఇలా అంటారు.

"నాకు ముళ్ళపూడి పొగడ్త గురించి అన్న విషయం స్ఫురణకు వచ్చింది. అహంకార మమకారాలను ఆత్మవంచనలో రంగరించి ఉడకేసి ఆహా ఓహోలు పోపు వేస్తే హుషారైన పొగడ్త తయారవుతుందట. అక్కడ నుంచి ఆయా వ్యక్తుల రుచులను బట్టి పరనింద పరవంచన, ద్వేషం, హేళన, ఆనందం, ఆహ్లాదం, దిగులు, అసూయ స్పర్థ వగైరాలను పాళ్ళ ప్రకారం కలిపితే మసాలా గుమాయిస్తుంది. చెప్పిన ముడి సరుకులను బట్టి విషం అనుకోకూడదు. అదే అమృతం అని అంతా పుచ్చుకోకమానరు. ఎందుకంటే ఇచ్చే వాడి హృదయాన్ని బట్టి, పుచ్చుకునే వాడి బుద్ధిని బట్టి దీని రంగు, రుచి, ప్రభావం, ఫలితం మారతాయి. పొగడ్త అగ్నిక్షిపణి లాంటిది. పోఖ్రాన్ అణుశక్తిలాంటిది కూడాను. రాజకీయంలో స్తుతులు చేసే అనుచరగణమే అధినాయకుడి వరాలు, వివరాలు సొంత చేసుకోగలరు. నాయకుడి స్తుతులు భరించగలవారే పొత్తులు, సొత్తులు సంపాయించగలరు. నిప్పు రేణువయినా కామ్‌గానూ, గ్రేస్ గానూ మారిపోడానికి పొగడ్తే పని చేస్తుంది.

**మృణాళిని తాంబూలం:**

రసజ్ఞత లోకజ్ఞత ఔచిత్యం సరస సంభాషణగా సామర్థ్యాన్ని కలిస్తే మృణాళిని అవుతుంది. నిత్యజీవితంలో అత్యంత అప్రధాన విషయమని మనం అనుకున్నవి, నిజానికి సామాజిక జీవితంలో ఎంత ప్రధానమైనవో గుర్తింపజేసే లక్షణం మృణాళిని

కాలమ్ సాహిత్యానికి ఉన్నది. విషయవివరణలో వ్యాఖ్యానంలో ఎంత హాస్యం ఉన్నదో. ఏ ఒక్క వ్యాఖ్య లేకుండా కూడా పాఠకుల రసజ్ఞతకి మేధాశక్తికి పదును పెట్టే సంభాషణలు వ్రాయడంలో కూడా హాస్యం ఒలికించడంలో మృణాళిని దిట్ట. తన గురించి తానే ఆవిడ రచనల్లో చెప్పుకున్నట్లు ఎగతాళి వెక్కిరింత గిలిగింతలు పెట్టే హాస్యం కనిపిస్తుంది. అవమానం వంచన ప్రకాశితం చేయరాదనే పంచతంత్ర కారుడి మాటలను మృణాళిని పట్టించుకోదు. జర్నలిజానికి భక్తుడికి ఉండవలసిన ప్రధమ లక్ష్యం భయరహిత్యమే (గీతావాక్యం) ఇది మృణాళినిలో స్పష్టంగా కనిపిస్తుంది. ఎక్కడా మొహమాటం ఎవరేమైనా అనుకుంటారేమో నన్న భయం మృణాళినిలో ఆవగింజంతయినా కనిపించవు. తెలుగు వారి తెలుగు గురించి ఆవిడ వాఖ్య.

'క్రేజీ హీరో చిరంజీవి' అంటే చిరంజీవి పిచ్చివాడా, మనం పిచ్చివాళ్ళమా అని అర్థంకాక, బ్రిటిష్ వాడు హడలిపోతాడు. ఇన్నేళ్ళ పరిపాలనలో ఇంతే నేర్పించగలిగానని క్రుంగి పోతాడు. ఇంగ్లీషు మీడియ, తెలుగుయువత 'ఎంతూ', 'సెంటీ' లాంటి కొత్త పదాలు. ప్రయోగాలు కనిపెడుతుంటే అమెరికన్ కూడా హతాశుడైపోతాడు. (వాటి అర్థాలు ఎంతూ సియాజమ్, సెంటిమెంటల్) ఇలా ఆంగ్ల భాషలో విశేష ప్రయోగాలు ప్రోత్సహించాలి గానీ, 'తెలుగు వాళ్ళు తెలుగులోనే మాట్లాడండి' అని నినాదాలు చేయడం సృజనాత్మకతని తొక్కేయడం కాదూ ? అందువల్ల ఎవరికీ పనికిరాని ఉద్యమాలు మానేసి, భాషా దినోత్సవాలు మానేసి, తెలుగు గురించి 'డోన్ట్ వర్రీ, బీహాపీ'.

కృష్ణతత్వానికి ఆధునిక యుగంలో రకరకాల భాష్యాలు చెప్పుకుంటున్నారు. దృష్టిని బట్టి దర్శనం కదా. అసలు భగవంతుడనే వాడు ఎవరు ఎలా కోరుకుంటే అలాగే కనిపిస్తాడు అని యావన్మందీ నమ్ముతున్నారు. కాబట్టి కృష్ణుడిని ఇలా కూడా అనుకునే వారున్నారు. ఇలా కూడా జరగచ్చు అంటుంది మృణాళిని. ఒక్కొక్క సుగుణానీ, చూద్దాం. దాన్ని బట్టి కలియుగంలో దైవంగా ఉండడానికి అతనికి అర్హత ఉందో లేదో తేల్చేద్దాం అంటుంది.

1. తన అసలు రంగు బయటపడకుండా ఉండడానికి నీలం పూసుకున్నాడు.
2. దొంగతనం చేసి ఛాతీ విరుచుకు తిరిగే అసాధారణ ప్రతిభ కలవాడు (చూడుడు... కృష్ణుడి వెన్నదొంగ కథలు)
3. పరాయి ఆడపిల్ల మీద కన్నేయడం తన జన్మహక్కని అనుకున్నాడు.
4. ఎవరి మీద కోపం వస్తే వాళ్ళని చంపేశాడు (చూడుడు... పూతన కంసుడి పర్వాలు).
5. ప్రేమించిన అమ్మాయిని అపహరించి, వాళ్ళ అన్నయ్య అనగా తన బావమరిదిని చావబాదాడు (కృష్ణుడు తెలుగు సినిమాలు బాగా చూసి ఉంటాడు).
6. శత్రువులతో ఒకటి చెప్తానని మరొకటి చెప్పి యుద్ధం ఖాయం చేసుకు వచ్చాడు. (కృష్ణుడు ఏక్తాకపూర్ సీరియళ్ళు బాగా చూసి ఉంటాడు.)

ఇలాంటి కృష్ణుడు కలియుగానికి అర్హుడే. కానీ ఆయన గనక ఇప్పుడు ప్రత్యక్షమైతే 'నెమలి పింఛం' పెట్టుకున్నందుకు వన్యప్రాణి సంరక్షణ చట్టం కిందా, వేణువులో ఎవరికీ అర్థంకాని అనురాగాన్ని వినిపించినందుకు గూఢచర్యం చేస్తున్నాడన్న కుట్ర కేసు కిందా, భగవద్గీత వినిపిస్తే ప్రజలను రెచ్చగొడుతున్నాడని పబ్లిక్ సెక్యూరిటీ చట్టం కిందా అరెస్టవుతాడు. అప్పుడు మన పని 'గోవిందా గోవింద'.

## శంకరనారాయణ కాలమిష్టుడు:

ఈ కాలానికి ఇష్టుడు కాలమ్స్ అంటే ఇష్టపడే వారందరికీ ఇష్టుడు. హాస్య బ్రహ్మ అభినవ తెనాలి రామకృష్ణ చతుర చతురాన హాస్య సమ్రాట్ హాస్య రసవశంకర హాస్య గంగాధర ఇంకా కనీసం 108 బిరుదులున్నాడు. అసలు ఈయన రచనలు చదివిన వారందరూ ఒక్కొక్క బిరుదు ఇచ్చేస్తారు. వ్యక్తి హృదయంలో విరబూసే హాస్యం పని చేపట్టినా అందులో పరిమళిస్తుంది. హాస్యావధానంలో రసజ్ఞులందరినీ మెప్పించిన శ్రీశంకరనారాయణగారు అనేక కాలమ్స్ రచించారు, అందులో ఫన్ పరాగ్, ఫన్‌దేహాలు, పంచాయితీ పూనకం, విన్‌బిట్స్, ఫన్‌దేమాతరం, సమసారం,

ఫన్నింగ్ కామెంటరీ, మహర్దిశ, వాణిజ్య వాస్తు, వాస్తు పంచాయితీ, వాస్తు తిరగమోత అడ్డగోలు మొదలైన కాలమ్స్ సుప్రసిద్ధ హాస్య చక్రవర్తి శ్రీశంకరనారాయణ వ్రాసిన కొన్ని రాజకీయ హాస్య గుళికలు.

**స్టైలు ప్రసాద్ యాదవ్:**

"రిక్షాలో వచ్చాను రామాహరి !
నేను పేదింటివాణ్ణండీ రామాహరి !
'గడ్డి' తినలేదండి రామాహరి
నాకు గ్యాస్ స్టవ్‌లే లేవు రామాహరి"

అంటూ ఆలిండియా 'లీడర్ యాక్టర్ లాలూ ప్రసాద్ యాదవ్ నటనకు చిత్రికపట్టి పత్రికల పతాక శీర్షికలకు ఎక్కారు. ఆయన తన ఇంటి నుంచి వంద గజాల దూరంలో వున్న సి.బి.ఐ. ఆఫీసుకు రిక్షాలో వెళ్ళారు. పేదవాణ్ణి - అందుకే యిలా వచ్చానన్నారు. (గాంధి అనలేదు గానీ పేదవాళ్ళు రిక్షా ఎక్కి తిరగగలిగిన రోజే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిన రోజు, లాలూకు ఐడియా రాలేదు గానీ తానే రాక్షాను తొక్కుకుంటూ వచ్చి వుంటే లాలూ గ్లామర్ డబుల్ అయ్యేది). తానొకటి తలిస్తే దైవమొకటి తలవడం వల్ల గొప్ప యిరకాటంలో పడ్డవాళ్ళల్లో లాలూ ప్రసాద్ ఒకరు. తాను ఎప్పుడూ కృష్ణుణ్ణి అని ఆయన ఫీలవుతుంటారు. అందుకే ఆయనకు విధి కృష్ణ జన్మస్థానంలో కొంత కాలం డ్యూటీ వేసిందని అనేక మంది జోకులేశారు.

"జైలుకు వెళదాం లాలును చూద్దాం
అల్లరి చేద్దాం చలో చలో"

అని అనుకున్నారు. (మహా నాయకులు ఉన్నత పదవుల్లోనన్నా వుండాలి. జైళ్ళల్లోనన్నా వుండాలి. ఊరికే రోడ్ల మీద కనబడడం మర్యాద కాదు).

"ఎప్పటికెయ్యది ప్రస్తుతము అప్పటికాపాలసీ"తో వ్యవహరించడం లాలూజీకి అలవాటు. జనతాదళ్ చీలిపోయినప్పుడు అప్పుడు ప్రత్యేక జార్ఖండ్ కోసం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన పెద్ద మనిషి యిప్పుడు వనాంచల్ ఏర్పాటు నేను బతికి

వుండగా జరగనవ్వను" అంటున్నారు.

"ఇండియా యే ఇందిర - ఇందిరాయే ఇండియా" అని ఒకప్పుడు అనేవారు. అదే స్టయిల్లో లాలూ, బీహారేలాలూ - లాలూయే బీహార్ అంటున్నారు. దాణా స్కాంలో యిరికించడం తననూ, తన భార్యనే కాకుండా బీహార్ ప్రజల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసిన కుట్ర అని ఆయన అన్నారు.

(ఈ దేశంలో నాయకుల తప్పు ఏ మాత్రం లేదు. వాళ్ళను ఎన్నుకున్న ప్రజలదే తప్పు).

## వాస్తు భోజనం:

ఏదో ఒక శాస్త్ర ప్రకారం పనులు చేసే వాళ్ళు ఎక్కడబడితే అక్కడ తగులుతుంటారు. అటువంటి వారిలో నా మిత్రుడొకడు. ఏం చేసినా వాస్తు శాస్త్ర ప్రకారమే చేయాలంటాడు. 'వాస్తు' అను రెండక్షరములు సర్వ ప్రపంచాన్ని నడిపిస్తాయని నమ్ముతాడు. ఆ మధ్య వాళ్ళింటికి వెళితే అతడి వాస్తు నిబద్ధత చూసి నా తల తిరిగిపోయింది. నేను వెళ్ళినప్పుడు అతడు భోజనం చేస్తున్నాడు. కంచంలో సగభాగం ఖాళీ ఉంచాడు. మిగిలిన సగభాగంలోనే అన్నం కూరలు, పెట్టుకుని కలుపుకుని తింటున్నాడు. ఏం నాయనా ? సగం కంచం ఖాళీగా ఉంచావు అని అడిగాడు. తూర్పు, ఉత్తరం ఖాళీగా ఉంచాలిగదా అందుకని అలా చేశాను అన్నాడు మిత్రుడు.

అంతేగాదు నైరుతిలో బరువు ఉండాలని మంచినీళ్ళ చెంబూ, గ్లాసు కంచానికి నైరుతిలో పెట్టానన్నాడు. కంచంలో చేయి కడుకున్నప్పుడు ఆ నీళ్ళు ఈశాన్యంలోకి పారేట్టు కంచం కింది బరువు పెట్టానన్నాడు. ఆహా ! ఏమి ఈ వాస్తు మయసభ అనిపించింది. చూడగా చూడగా వాస్తు అన్నం కూడా సరిగ్గా తిననిచ్చేటట్టు లేదు.

## పెళ్ళి మేజిక్:

ఉన్నది లేనట్టుగానో లేనిది ఉన్నట్టుగానో భ్రమ కలిగించడమే మ్యాజిక్ అని మెజీషియన్లు నిర్వచిస్తుంటారు. ఈ నిర్వచనాన్ని ఒక మెజీషియన్ సభాముఖంగా చెప్పాడు. ఇది జనాన్ని ఉత్తేజపరిచింది. 'మీకు నిజంగా మేజిక్ తెలుసా?" అని ఒక కుర్రాడు అడిగాడు. తెలుసుననకపోతే ఏం చిక్కోనని తెలుసునన్నట్టు మెజీషియన్ ఫేసు పెట్టాడు. మరి లేనిది ఉన్నట్టు భ్రమ కలిగిస్తానన్నారు. నాకు పెళ్ళి కాలేదు. అయినట్టు భ్రమ కలిగించగలరా? అన్నారు. ఓ.కె. అన్నాడు మెజీషియన్ ఓ.కే. అన్న ఒక క్షణంలోనే ఆ కుర్రాడి చంప ఛెళ్ళుమనిపించాడు. దాంతో కుర్రాడు భోరుమన్నాడు. ఇదేం అన్యాయం అని నిలదీశాడు. పెళ్ళి అయితే జరిగేది ఇదే అన్నాడు. దీనిని ఎవరయినా కాదనగలరా? అని సవాల్ చేశాడు మెజీషియన్. ఆ సభలో మర్డర్లు చేయించిన మహానాయకులున్నారు. అనేక యుద్ధముల నారితేరిన మిలిటరీ అధికారులున్నారు. పెద్ద పెద్ద శాస్త్రవేత్తలున్నారు. కానీ మెజీషియన్ మాటనుకాదనే 'మగాడు' మాత్రం కనిపించలేదు. ఇదీ శంకరనారాయణగారి ప్రతిభ.

## 5. రాచకొండ విశ్వనాథశాస్త్రి

అల్పజీవి నవలలో అత్యధికమైన మానసిక విశ్లేషణ కనిపిస్తుంది. సమాజంలో తన చుట్టూ ఉన్నవాళ్ళ మీద తనమీద, సమస్త వ్యవహారాలమీద అధిక్షేపరూప హాస్యం కనబడుతుంది. ప్రతి ఒక్కరు కనబడవలసిన విధంగా కాక మరోరూపంలో కనబడటమే మనకి నవ్వు తెప్పిస్తుంది.

"డబ్బు పుచ్చుకున్న వెంకట్రావు దర్జాగానే ఉన్నాడు. పొడుం పీల్చే హెడ్ గుమాస్తా కంట్రాక్టర్ల దగ్గర డబ్బు పీల్చి ఇంకా దర్జాగా ఉన్నాడు. హార్బర్ ఇంజనీర్ సరిక్రొత్త కార్లో పంది లాంటి పాత పెళ్ళాన్ని ఊరేగిస్తున్నాడు. సావిత్రి ప్రేమ సినిమా క్కావాలు వెళ్ళింది. ప్రేమ సినిమాకి వెళ్ళనందుకు కమల వెక్కి వెక్కి యేడ్చి యేడ్చి బిక్క చచ్చి నిల్చుంది. నేను ఏడవలేక నోరు మూసుక్కూర్చున్నాను".

కొందరిలో అసమర్థత పిరికితనం అభద్రతా భావాలు ఈ లక్షణాలేవీ లేనివారికి ఉన్నవారికి ఉన్న కూడా నవ్వు తెప్పించడమే జీవితం యొక్క ప్రత్యేక లక్షణం ఇది సాహిత్యంలోనూ కనిపిస్తుంది కదా.

"ఎవరీవిడ ఎందుకు వచ్చింది ఎదురింటికి ? ఈమెకి ఇంత తెలుపు ఎక్కడి నుండి వచ్చింది ? మాటలో పడమటి యాస ఉందా లేదా ? ఎవరో ఎరగని నన్ను చూసి టైము అడగటంలో ఉద్దేశం ఏమిటి? ఎదురుగా నిలబడి పైట సర్దుకోకపోవడంలో అభిప్రాయం ఏమిటి? కొంప తీసి. . . కోతి వెధవని ఈవిడకి ముప్ఫయేళ్ళుండవచ్చు. పెళ్ళయి ఉంటుంది. కాకపోతే బావుణ్ణు. . . నాకెందుకు . . .అయినా మనిషి బాగుంది. బాగుంటే నాకేం. . . మంచి మనిషిలా అవు... పిస్తోందా? అయినా నా కెందుకు? రెప్పలు షోగ్గా రాలుస్తోంది. పైట సర్దుకుంటే. . . బావుండదేమో. . .

ఆవిడ కన్య కాని కన్య. . . నువ్వు నువ్వు కాని నువ్వు

సగటు మగవాడి ఆలోచనల నేపథ్యానికి ఇది ప్రతీక. ఈ మానసిక విశ్లేషణలో పాఠకులు తన ముఖం కూడ కనిపించి నవ్వు వస్తుంది. ఆయనెవడో గ్రేట్ మెన్ థింక్ ఎలైక్ అన్నాడు కదా.

**రత్తాలు రాంబాబు:**

జీవితంలోని వేదాంతాన్ని సామాజిక స్థితిగతుల్ని అధ్యయనం చేస్తూ ధ్వని, అధిక్షేపంగా ఎగతాళి కసితో కూడిన హాస్యం వినిపిస్తుంది రావిశాస్త్రి రచనలో లోకాన్ని కాచి వడపోసి చెబుతుంటే ఏడుపులోనూ నవ్వొస్తుంది. ఇది విశాఖ మాండలికం.

"కారు ఇప్పించేసి పార్టులన్నీ, అమ్మేసుకుని జోబీల ఆ డబ్బు ఈ డబ్బు అంతేసుకుని కలకత్తా, బొంబాయో సెక్కీసినాడు. ఆడిలాగే సెరిసిలక్కి సెరో పచ్చ కాయితం ఇసిరీసరికి సేక్ పకీరుగోడు సిత్తయిపోయి లెంబర్ వన్ సిలకల్ని సెలక్షన్స్ జేసి మరీ అడిసేతులెట్టేడు. కారేమో ఒచ్చి బెంగళూరు చావు కోరిందట. సిలకలేమో సేక్ పకీరు గోడివి. మరి డబ్బేమో డాకూ నా కోడుగ్గోరిది ! యెనకనించి ఆడు

కటకం కాణ్డించి గైరాజరు. అంచేత ఏటంటే తొత్తు కొడుకుల్ని ఒక్కో సుట్టు నమ్మలేం. అంచేత మన కాపలా మీద మనముండాలి. ఎంతకారయినా కారుకి లెంబరూ ఉంటాది. సిలకలకి పుట్టు మచ్చలూ ఉంటాయి. దాకూ గోడికి ఏలిముద్దర్లు ఉంటాయి. కాని దొరికితే గద పోల్చదానికి . వృధార్త జీవన దృశ్యంలో ఇది నిర్వేద హాస్యం.

**యర్రంశెట్టిశాయి:**

మలితరం హాస్య నవలల్లో ప్రేమ కథల ఇతివృత్తం ప్రవేశించింది. సన్నివేశ రూపకల్పనతో సంభాషణా సామర్థ్యంతో నవలా ప్రక్రియ నిర్మాణం సాగించారు యర్రంశెట్టిశాయి. కథాగమనంలో ఇతివృత్త నిర్వహణలో ఆయన నవల చదువుతుంటే ఒక సినిమా చూస్తున్న అనుభూతి మనకి కలుగుతుంది. లవ్‌ఎట్ సెకండ్ సైట్, ప్రేమకి ఫుల్‌స్టాప్ ఉందా అనే నవలల్లోనూ ఇంకా ఇతర రచనల్లో ఆయన పాత్రల మనోభావాలకి వివరణకీ, వారి వ్యక్తిత్వ నిరూపణకీ, కొంత కధా గమనానికి కూడా సంభాషణల పదునునే ఉపయోగించారు. వీరి రచనలన్నీ ప్రధానంగా దృశ్య ప్రధానాలంటే అతిశయోక్తి కాదు. ప్రేమకథల్లో ప్రతి సమస్య దాని పరిష్కారం పరిణామం అన్నింట్లోనూ హాస్యమే ఒక సంఘటన.

"గుడ్ రేపు సాయంత్రం ఆఫీసు నుంచి ఎక్కడి కెళ్తావ్ అన్నది రాధారాణి"

"ఇంటి కొస్తాను. . ." అన్నాడు చిరంజీవి.

"రావద్దు".

"రావద్దా". . .

"ఏ పరిస్థితుల్లోనూ"

"ఎందుకని "రైల్వేస్టేషన్" కెళ్ళు

అక్కడ ఉండనిస్తారా రాత్రంతా

"నువ్వెళ్ళేది అక్కడ ఉండటానికి కాదు."

ఓహో

పదిన్నరకి హౌరా ఎక్స్‌ప్రెస్ ఉంది అందులో రాంబాయి వస్తుంది.

"రాంబాయి. . ."

"అవును"

"అంటే ఏమిటది"

తిక్కవాగుడు వాగకు. వైజాగ్ లోటస్ లేడీస్ కమిటీ వైస్ ప్రెసిడెంటు.

సన్నివేశ సంభాషణలతో బాటు వ్యాఖ్యానం కథాగమన నిర్వహణలోను యర్రంశెట్టిశాయి దిట్ట. పాత్రల మాటతీరులు ఎంత నవ్విస్తాయో వారి మనస్తత్వ నిరూపణ కూడా అంత నవ్విస్తుంది.

రెండ్రోజులు పోయిన తరువాత ఆ నాటకం కంటె అందులోని హీరోయిన్ అరుణారావుకి అందంగా కనబడింది. నాలుగు రోజులు వెంబడిపడి అయిదో రోజు నువ్వే నా రాణివి. నువ్వులేందే నా జీవితం లేదెన్జప్పేసి అక్కడే కాపరం పెట్టేశాడు. నాటకాలేయడం వరకు బాగానే ఉంది కాని అందులో హీరోయిన్ని పట్టుకుని నువ్వు లేందే నా జీవితం లేదనడం ఆ ప్రాంతంలో చాలా మందికి నచ్చలేదు. వెంటనే ఓ కమిటీ వేసి కమిటీని వాళ్ళ నాన్నతో వాళ్ళబ్బాయి చాలా వెధవ పన్లు చేస్తున్నాడని నచ్చచెప్పడానికి పంపించారు. మీడియాలో పోరాటాలు భిన్న ఛానెళ్ళు ప్ర్యాయర్ షిప్ కోసం వేసే వెర్రి చేష్టలూ. అస్తిత్వం కోసం బ్లాక్ మెయిళ్ళలో సాగే అద్భుత హాస్య ప్రేమ కథా నవల లవ్ ఎట్ సెకండ్ సైట్ సమాజం మీద ఛానెళ్ళ రిపోర్టర్ల పైన అధిక్షేప నవల ఇది.

## కె.ఎన్.వై. పతంజలి:

విషసర్ప సంహారార్థం రచనా యాగం చేసినవాడు అపసవ్యతలపై కలం దూసినవాడు పదానికి పాంచభౌతిక శక్తులు ప్రసాదించినవాడు. సత్యమేవజయతే అని పదే పదే అదేపనిగా పతంజలి అని అతడిని పండితులు ప్రశంసిస్తున్నారు. అధిక్షేపం ఆయుధంగా ఆయన ఎన్నో శరీరాలను సంధించాడు. వీరబొబ్బిలి, పిలక తిరుగుడు పువ్వు ఖాకీ వనం – గోపాత్రుడు ఒక దెయ్యం ఆత్మకథ నువ్వు నేను అప్పన్న సర్దార్ మొదలైనవి ఈయన ప్రముఖ రచనవు.

# 6

# కథానికల్లో హాస్యం

## శ్రీమునిమాణిక్యం నరసింహరావు:

దాంపత్యజీవితంలో అత్యంతమధురమైన ఇల్లాలి స్వరూపాన్ని సృష్టించారు. అమాయకత్వం, సాధింపు, అనురాగం, చాదస్తం కలబోసిన పాత్ర కాంతం వీరి సృష్టి.

అత్యంత లలితమైనహాస్యం అందించినవారిలో మునిమాణిక్యం నరసింహారావుగారు ఒకరు. మునిమాణిక్యంగారి 'కాంతం' పాత్ర తెలుగువారి హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటుంది. ఎంతో అమాయకంగా తన అభిప్రాయాలని సూటిగా స్పష్టంగా అడిగేస్తూ చెప్పేస్తూ, ఎంతో బోళాగా కనిపిస్తు నవ్వించే పాత్ర 'కాంతం'. అవి రెండో ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులు. యుద్ధ సహాయనిధికి పావలా అర్థరూపాయి స్టాంపులు అమ్మే వాళ్ళొచ్చారు. కాంతం అడిగింది. ఏవండీ ఏవిటో అమ్ముతున్నారు.

"స్టాంపులు అమ్ముతున్నారు రెండు తీసుకుని రెండు పావలాలు ఇవ్వు."

"ఏవన్నా కవర్లు పోస్టు చేస్తారా"

"ఇవి ఆ స్టాంపులు కావు యుద్ధం సహాయ నిధి స్టాంపులు"

"అంటే మనం ఇవి కొంటేనే వాళ్ళు యుద్ధం చేస్తారా."

"రామచంద్ర ! యుద్ధంలో గాయపడ్డ వారి సహాయం కోసం మనం ఇచ్చే డబ్బు ఉపయోగపడుతుంది. మనం ఇచ్చే ఈ పావలా అర్థ రూపాయి !

"అసలు నాకర్థం కాక అడుగుతాను పావలా అర్థా కూడా లేకుండా అసలు యుద్ధం ఎలా మొదలు పెట్టారండీ వీళ్ళెంత అమాయకులు లోకజ్ఞానం లేనివాళ్ళు"

అని ప్రపంచ యుద్ధం చేసే వాళ్ళ మీద జాలి పడుతుంది కాంతం. ఎవరి మీద జాలి పడతారో మీ ఇష్టం.

మరో సందర్భంలో కాంతం కాస్త గడుసుగా కూడా ఉంటుంది. సాధారణంగా భర్తతో ఏ అమ్మాయి నవ్వుతూ మాట్లాడటాన్ని ఏ వీర వనిత పెద్దగా ఇష్టపడదు.

కాంతం భర్తతో మాట్లాడుతుంటుంది.

"చాలా సేపటి నుండి మాట్లాడుతున్నట్లున్నారు." ఆహా. . . అంత పగలబడి నవ్వొచ్చే విషయాల్నేమున్నాయబ్బా. . .

"అ. . . అ. . . అంటే. . . సందర్భం అలాంటిది. . ."

"ఇంతకీ ఎవరావిడ."

"అబ్బే ఉట్టి స్నేహితురాలు."

"ఎప్పటి నుండో. . ."

"అదే లేవే. . . ఎదో వృత్తిపరంగా ఉంటాయి."

"తెలుస్తూనే ఉంది లెండి. . . ఇంతకీ అది మీ వృత్తా. . .? ఆవిడ వృత్తా." తలపట్టుకుంటాడు కాంతం భర్త. . . ఇలాంటి సంఘటనలు జీవితంలో ఒక్కసారైనా ఎదుర్కోని భర్తలుంటారంటే మీరు నమ్ముతారా ? మునిమాణిక్యం గారు కొన్నింటికి కొన్ని హాస్యనిర్వచనాలు ఇచ్చారు.

గ్రంథకర్త: సమకాలికులను స్నేహితులను విసిగించడంతో తృప్తి పడక ముందు తరాల వారిని ఏడిపించడానికి ప్రయత్నంచేవాడు.

బ్రహ్మచారి: అందరికీ తెలిసిన భార్య లేనివాడు. పక్క నుండి నిద్రలేచేటప్పుడు ఏవైపు నుండి అయినా దిగడానికి అవకాశం ఉన్నవాడు.

విసుగు పుట్టించే సంభాషణ: నీవు నిన్ను గురించి మాట్లాడాలని అనుకుంటుంటే అవతలి వాడు తన గురించి అపకుండా మాట్లాడటం.

ఇంక అసలు భార్యాభర్తల మధ్య సరసాలకి మునిమాణిక్యం సంభాషణలు ప్రతీకలుగా ఉంటాయి. అసలు సాధింపు అనేది స్త్రీలకు పుట్టుకతో వచ్చిన కళ కదా. పెళ్ళికాగానే అబ్బే ప్రథమ విద్య అది సంగీతశాస్త్రంలో మంద్ర స్వరం ఎలాంటిదో

కలహశాస్త్రంలోసాధింపు అలాంటిది. కలహశక్తి లేత రంగులో ప్రకాశిస్తుంది. ఇలా భర్తను సాధించే ప్రక్రియకి గొప్పగా నిర్వచనాన్నిచ్చారు. భర్త చేసే ఒక చిన్న పొరబాటును గోరంతలు కొండంతలుగా చూసి దాని ఫలితంగా జనించబోయే ఎన్నో సమస్యలను ఊహించుకుంటూ వాటన్నింటికీ భర్త ప్రజ్ఞే కారణమనుకుంటూ బాధపడుతూ ఉంటారు. భర్తని మరీ గట్టిగా నిందించడంలో చమత్కారం ఇక్కడే ఉంది. సంగీతంలో శృతి పెరగదు. తగ్గదు కాంతం అంతే. అదే శృతిలో ఆయన్ని మెత్తగా తిడుతూ విసిగించడాన్ని సాధింపు అంటారు. మునిమాణిక్యం దీనికి స్త్రీ విద్య అని పేరు పెట్టి ఈ శక్తి సమస్త సృష్టిలో కేవలం ఒక్క స్త్రీకి మాత్రమే ఉన్నదన్నారు.

"ఏమండీ నిచ్చెనెక్కి ఆవకాయ తీయగలరా? "

"చిత్తం మహరాణీ గలను"

"అంటే జాగ్రత్తగా తీయాలి"

అంతే "ఆ మాత్రం చేత కాదా"

"ఆ మరదే తెలివి తేటలుండాలండీ"

"దీన్లో తెలివి తేటలుండాలా ఏవిటి ?"

ఏం లేదు జాడీ ముట్టుకోకుండా అవకాయ తీయాలి.

జాడీ ముట్టుకోకుండా ఆవకాయ తీయాలా ?

"ఎందుకో"

జాడీ మైలదీ అందులో ఆవకాయ మడిదీ

"జాడి మైలదీ ? అందులో ఆవకాయ మడిదీనా ? ఇదొక శాస్త్రమా?

అచారమంటే ఇదే అందుకే తెలివి తెటలుండాలి. శాస్త్రబద్ధంగా నియమాలలో సరస శృంగార సంభాషణలతో భార్యభర్తల అనురాగ దాంపత్యానికి అద్దం పడుతుంది. మునిమాణిక్యం కాంతం.

## శ్రీకొడవటిగంటి కుటుంబరావు :

శ్రీకుటుంబరావుగారు సామాజిక తత్త్వవేత్త. సమాజాన్ని మథించి సాహిత్యాన్ని సృష్టించిన మనస్తత్వ శాస్త్రజ్ఞుడు. ప్రజలు తమ జీవితాలని చూసే రీతికి ఆయన కథల్లో చేసిన వ్యాఖ్యానం భాష్యం మనకి వ్యంగ్య హాస్య ధ్వనులను వినిపిస్తుంది. దిబ్బరిపోర్టు.

''అప్పుడేమయిందనుకున్నారు ? పాత పురాణాలన్ని దిగాయి. రామాయణాన్ని నే నిన్నాళ్ళు గుర్తించలేదు. రాముడెంత హింసా పరుడండీ ! సీత హింస మానమంటే చివాట్లేశాడు. వాలిని అలా చంపడం పచ్చి గొరిల్లా పద్ధతి ! భగవద్గీత ! దానిలోనూ హింసే. విష్ణుమూర్తి, ఇంద్రుడూ, పాండవులూ, కృష్ణుడూ వధలు చెయ్యటంలో ఎవరు తీసిపోరు. శైవ గ్రంథాల నిండా హింసే. నేను పురాణాలు చదవకపోక పోవటం పొరపాటయింది. ఇద్దరు బియ్యేలకు ఒక నెల జీతం ఇచ్చుకోవటమే గాక రెండు వందలు బహుమానం కింద ఇవ్వవలిసోచ్చింది. ఆ డబ్బు పోనివ్వనులెండి మన పురాణాలన్నీ అహింసకు అనుకూలంగా తిరగరాయించి పదేసి వేల కాపీలు అచ్చు వేయించి దేశంలో ఉన్న లైబ్రరీలన్నింటికీ అమ్మిస్తాను. ఎకాడమీ ఎవార్డులూ, అదేదో లక్ష రూపాయల బహుమతి ఉంటే అవి కొట్టెయ్యాలి.

దేశభక్తుల తపస్సు వారి దేశభక్తి మీద ఒక వ్యంగ్యం చురక

దేశభక్తుడు దేశం కోసం తపస్సు చేయ్యసాగాడు. అతని తపస్సు ఫలించి దేశమాత ప్రత్యక్షమయ్యింది.

"ఎందుకు నాయనా, ఇంత దీక్షగా తపస్సు చేస్తున్నావు?" అన్నది దేశమాత.

"నా దేశం యొక్క క్షేమం కోసం ! అభ్యుదయం కోసం !" అన్నాడు దేశభక్తుడు.

"నీ దేశానికిప్పుడేం ముప్పు వచ్చిందీ?"

"నా దేశం దాస్యంలో పడి ఉన్నది. దేశమాతకు విమోచనం కావాలి"

"నీ దేశమాత నెప్పుడున్నా చూశావా?" అవిడకు విమోచనం కావాలని

నీకెట్లా తెలుసు.

అందరూ అంటూంటే విన్నాను. నేనైతే దేశమాతను చూడలేదు. కనీసం నా దేశ వాసులకు విమోచనం కావాలి" అన్నాడు దేశభక్తుడు.

"వాళ్ళిప్పుడే విధమైన నిర్బంధంలో ఉన్నారు. అన్నది దేశమాత.

"పాశ్చాత్యుల నిర్భంధంలో"

"పాశ్చాత్యులు నీ దేశ వాసులు చేతులూ కాళ్లూ కట్టేశారా ?

"లేదు ఈ పాశ్చాత్యుల మూలంగానే నా దేశ ప్రజలు దారిద్ర్యంలో ఉన్నారు".

"అంతకు పూర్వం " !

"అంతకు పూర్వం ఇంత దారిద్ర్యం లేదు. ఇంత దోపిడీ లేదు".

"అంతకు పూర్వం నీదేశంలో దరిద్రులు లేరా ? అందరూ డబ్బు న్యాయంగానే సంపాదించారా?"

"కొద్దిమంది దుర్మార్గులు సంఘంలో ఎప్పుడూ ఉంటారు. వాళ్ళు మిగిలిన వాళ్ళను దోచి ధనికులవుతారు!"

"వారి తరుపునే కదా నువ్వు తపస్సు చేస్తున్నది?" అన్నది దేశమాత.

"కాదు కాదు ! నిజంగా దారిద్ర్యం అనుభవిస్తున్న కోట్ల కొద్దీ ప్రజల కోసం!" అన్నాడు దేశభక్తుడు.

"నువ్వు కోరే దేశవిముక్తి ఏ విధంగా వాళ్ళ దారిద్ర్యం తొలగిస్తుంది"?

"ఆలోచిస్తాను!" అన్నాడు దేశభక్తుడు.

"ఆలోచించుకో !" అని దేశమాత అంతర్ధానమయింది.

"ఎవరమ్మానీవు ?" అన్నాడు దేశభక్తుడు. సమాధానం రాలేదు. దేశభక్తుడు మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

## శ్రీసురవరం ప్రతాపరెడ్డి:

సురవరం ప్రతాపరెడ్డిగారు సంపూర్ణమైన హాస్య రచయిత కాకపోయినప్పటికీ నిజాం పరిపాలనని ధిక్కరిస్తూ అధిక్షేపిస్తూ పదకొండు కథలు హాస్య రసపూరితంగా రచించాడు. ఇందులో గ్యారా కద్దూ బారా కొత్వాల్ అనే కథ చాలా హాస్యకథ. సొరకాయలు పండించే ఒక రైతు 12 మంది ఆయగాండ్ల అధికార దర్పంతో జీవితపు పోకడ నేర్చుకుని తెలివి మీరి మ(క్రిమాన్ పరిగణా సంపాదించుకుంటాడు. నవాబులకు నజరానా ఇస్తే ఎన్ని అక్రమాలయినా చెయ్యవచ్చని ఈ కథ నిరూపిస్తుంది. ఇంకా బేఖూఫ్ మదారుసాబ్, బంగారు గాడిద, గోమాజీ, గణేశ్, పీతల్ దర్వాజా బీబీజాన్ కిచిడీ జాగీరు కథలు సుప్రసిద్ధాలు.

## శ్రీభమిడిపాటి కామేశ్వరరావు:

నవ్వులను విశ్లేషించి చెప్పినవాడు భమిటిపాటి కామేశ్వరరావు. చిన్న నవ్వు సకిలింపు, ఇకిలింపు కలసి ముసినవ్వు, గుడ్డినవ్వు వికవిక అట్టహాసం లయతోటి మధ్య తాళ్ళు వెయ్యడానికి వీలుగా ఉంటూ మాట తెమలకుండా సగం నవ్వు. సగంమాట ఏదీ తెమలదు. దగ్గునవ్వు గూడ్సుబండి నవ్వు, ఈయన రచనల్లో వాక్చమత్కృతి వేళాకోళం వెక్కిరింత, వెటకారం ప్రధానంగా కనిపిస్తాయి. చుట్టా, బీడీ పొగాకు త్రిమూర్తుంటాడు. భ.కా.రా. అది ఆది విరాట్ స్వరూపమైన పొగాకు. ఈ పొగాకు అనేకమైన ఇతర ఆకారాల్లో భూమి మీద కర్మ వశంగా అవతరాలు ఎత్తింది. తను నాశనం అయిపోయి ప్రపంచాన్ని నడిపిస్తోంది. పొగాకు ఇతరుల నిమిత్తం ముక్కు పొడుం అవుతున్నది. పొగాకు ఇతరుల కోసం ఎంతో తడిసి అడ్డమైన నూనె సరుకుతో కలిసి ముక్కలైపోతున్నది. శిబిచక్రవర్తిలా శరీరాన్ని చీల్చి మరీ ఇస్తున్నది. ఋషి సంతతిలో మీ వంశంలో ఋషులు ఎవరు అని అడుగుతారు అందులో ధూమం బాగా తెచ్చినవాడు. ధౌమ్యుడు అయ్యాడు. తాళపత్రాలు కూడా ఉన్నాయట.

ఆయన కవిత

దిస్కై ఈజ్ మబ్బీ. . . దిరోడ్ ఈజ్ దుమ్మీ
మైహెడ్ ఈజ్ దిమ్మీ

"ఒకాయన ఉపన్యాస ధోరణి ఈయనకు నచ్చలేదు. ఇలా వ్యంగ్యంగా చెప్పాడు" అంతా సంగీత సాహిత్యాలలో ముచ్చటించాడు. తెలుగు సంస్కృతాలను మేళగించాడు. గ్రాంధిక వ్యావహరికాలని సిమెంటు చూశాడు. సగుణ నిర్గుణత్వాలని సమపానం చేశాడు. వైష్ణవ శైవాలని పడుగు పేకా చేశాడు. లౌకిక వైదికాలకి పట్టం కట్టాడు. భూత వర్తమానాల్ని రంగరించాడు. పురాణ ప్రత్యక్షాలని ఏకం పాకం చేశాడు. అద్వైత ఆరాధ్యాలని ఉద్ఘాటించారు.

## రాచకొండ విశ్వనాథశాస్త్రి:

రావిశాస్త్రిగారు కథల్లో జీవితంలోని కోణాలను ఎన్ని విధాలుగా చూడవచ్చో అన్ని విధాలుగాను చూపించారు. విశ్లేషించారు. వాస్తవికత అధివాస్తవికత కొందరి కళ్ళల్లో కనిపిస్తే మరి కొందరికి అది హాస్యం లా వినిపిస్తుంది. కొందరి జీవితాల్లోని అపశృతులకు వారు జీవితానికి భాష్యం చెప్పుతారు. వ్యవస్థలో సాగుతున్న చిత్ర విచిత్రమైన దోపిడీలపై వ్యంగ్యం అధిక్షేపం వెటకారం ఎగతాళితో ఆయన కథలను రచించి మనకు సమకాలీన సమాజ దర్శనం కావించారు.

ఫ్రీ ఎన్టర్ ప్రయిజ్ అంటే మీకు తెలుసా ? మరేం లేదు. శ్రమంతా ప్రజల్ది సిరి అంతా ఎన్టర్ ప్రయిజుగాళ్ళది. అదీ దానర్థం ప్రజల కోసం అంటూ ఎన్టర్ ప్రయిజుండదనీ, ఎన్టర్ ప్రయిజుకోసం ప్రజలున్నారనీ వాళ్ళ అభిప్రాయం. అయితే ప్రజలంటే ఎవరు? ఎవరో చెప్పండి. ప్రజలంటే బోడ్రావుడు. గెడ్డం సన్యాసీను. అంటే మీరు నేనూ అన్నమాట. మరోలా చెప్పాలంటే జేబులో డబ్బులేసుకు వెళ్ళే వాళ్ళే ప్రజలు ! అని కొట్టేసి బ్యాంకుల్లో దొచుకునే వాళ్ళు ఎన్టర్ ప్రయిజుగాళ్ళు.

ప్రజలకు జ్యోతిష్యమంటే చాలా ఇష్టం తాను కోరుకున్నవన్నీ ఎలా లభిస్తాయో ఎప్పుడు లభిస్తాయో జ్యోతిష్యుడు చెప్పాలని ఆశ. అలా చెప్పేవాడి దగ్గరికే ఎక్కువగా వెళతారు. దీన్ని రావిశాస్త్రి గారు ఇలా వ్యాఖ్యానించారు.

'రవి గవర్నమెంటు గ్రహం. అంటే మంచి మంచి అధికారాలిస్తాడట. మంచి హెూదా ఇస్తాట్ట. శుక్రుడు మంచి మంచి సౌఖ్యాలూ సరదాలూ ఇస్తాట్ట. డబ్బులేని సరదా అదేం సరదా అవి అడిగేన్నేను. అంటే జ్యోతిష్యుడు చెప్పేడు. రెడ్డిగారికి లక్షరూపాయల ఉద్యోగం రావచ్చు. మీకు లక్ష రూపాయలు గల స్త్రీతో

సౌఖ్యం మాత్రం రావచ్చు. తేడా తెలిసిందా. . . తేడా తెలిసింది నాకు. కాని జాతకులందరికీ ఆ సౌఖ్యమే కాకుండా ఆ లక్షరూపాయాలు కూడా కావాలని ఉ ంటుంది. స్త్రీ సౌఖ్యం స్త్రీ సౌఖ్యమే. లక్షరూపాయల సౌఖ్యం లక్షరూపాయలు సౌఖ్యమే.

## బీనాదేవి:

బీనాదేవిని రావిశాస్త్రి గారికి కార్బన్ కాపీ అవి వెక్కిరించిన వాళ్ళున్నారు కానీ ఎవరి శైలిదృక్పథం భావవ్యక్తీకరణ వారిదే. బీనాదేవి కథలో అధిక్షేపం వ్యంగ్యంతో పాటు పరిపూర్ణమైన హాస్యం చిందులాడే కథలు కూడా ఉన్నాయి. వాహనయోగం అనే కథ సంపూర్ణ హాస్య గుళిక. కుటుంబంలో జ్యోతిష్య ప్రాధాన్యం అదంటే పిచ్చి ఉన్నవారి కథ. చెప్పినట్టు జరగకపోతే దానికి కారణాలు విశ్లేషించి తరువాత భవిష్యత్తులో జరుగుతాయని నమ్మే మనందరి కథ. జ్యోతిష్యశాస్త్రజ్ఞుల విశ్లేషణలు కూడా చాలా గమ్మత్తుగా ఉంటాయి.

మా నాన్నకి జాతకాలు జ్యోతిష్కులు అంటే తిండి ఉద్యోగం పెళ్ళాం పిల్లలు ఇవేవీ అక్కర్లేదు. ఆయన నాడీ గ్రంథం నుండి పేవ్‌మెంట్ మీద వరకు అన్నీ నమ్ముతారు. జాతకాన్నీ జీవితాన్ని వెరిఫై చేస్తూ జీవిస్తారు. ఈ గ్రహాల కొక జబ్బుంది. అవి స్థిరంగా ఒక చోట ఉండవు. ప్రతి వాడికి స్వంత ఇల్లున్నా సరే ఎవడింట్లో వాడుండడు. ఒకరినొకరు కోపంగా రకరకాలుగా చూసుకుంటారు.

కారుకొనడం కొరకు జ్యోతిష్యుడిని సంప్రదించారు. అతను కారు కదూ. వూ. . .చతుర్థంలో నీచుడు కోశాధిపతి నీచుడితో కలిసేడు. గొణిగి వాహన యోగం లేదు అన్నాడు. మా వారి మొహంలో రంగులు మారాయి. ఇంకా చిత్ర విచిత్ర జ్యోతిష్య ఫలితాలు చెబుతాడేమోనని మా వారు నీరస పడిపోయారు. ఇలా వ్యంగ్యహాస్యం అధిక్షేపాలతో నిండాయి బీనాదేవి కథలు.

## శ్రీముళ్ళపూడి వెంకటరమణ:

నవ్వొచ్చినప్పుడు ఎవడైనా నవ్వగలడు. ఏడుపొచ్చినప్పుడు కూడా నవ్వగలిగేవాడే మగాడు. అసలదే నవ్వు అని నవ్వుకు నిర్వచనం చెప్పినవాడు ముళ్ళపూడి వెంకటరమణ. తెలుగు వారి అందమైన ద్వంద్వ సమాసం బాపురమణలు,

వీరి సాహిత్యం కృష్ణుడు చెప్పిన గీతలా, లోకాన్ని సమ్మోహనం చేసింది. ధనుస్సు నుండి వెలువడ్డ శరంలా ప్రపంచంలో వీర విహారం చేసింది. విజయలక్ష్మిని కట్టబెట్టింది. నిజమే సుమా. .. ఆ విషయం తెలిసే ముళ్ళపూడి 1950ల్లో విజయలక్ష్మి అనే కలం పేరుతో రచనలు చేశాడు కాబోలు.

ఆంధ్రులకి ఆరు దశాబ్దాలుగా ముళ్ళపూడి ఆనందాన్నందిస్తూనే ఉన్నాడు. లోకంలోఉన్న నవ్వుల రకాలన్నీ ముళ్ళపూడి రచనల్లో ఉన్నాయి. ఖరీదైన జరీకండువా గుబురు మీసాల నవ్వులు, అందమైన రాధమ్మ సిగ్గు దొంతరల మల్లెపువ్వుల పరిమళాల నవ్వులు ఒకవైపు కనిపిస్తే, తన ఆకలి. చాతకాని తనం మీద తనే జోకులు వేసుకుని నవ్వే అసమర్థపు నవ్వులు. జేబులో ఒకే ఒక్క రూపాయి తనని చూసి నవ్వుతుంటే దాన్ని నోరు మూయించి, కొడుక్కి మూడు చక్రాల సైకిలు బేరమాడి ఖరీదుగా కనిపించాలని షావుకారుతో నవ్వే మధ్యతరగతి తండ్రి నవ్వుల దాకా ముళ్ళపూడి రచనల్లో కనిపిస్తాయి.

గ్రాంధికం పట్టు ఇంకా పూర్తిగా సడలని 1950ల్లోనే ముళ్ళపూడి అందమైన లలితమైన తెలుగు పదాలతో తెలుగుకథ సృష్టించాడు. వీధికో లవ్వు, పూటకో మాటకో లవ్వు ఈ రోజుల్లోనే కనిపించిందని ఆధునికులు అనుకుంటుంటారు. కాని ఈ పట్టువదలని విక్రమార్కుల లవ్వు కథలు. ఇద్దరమ్మాయిల ముగ్గురబ్బాయిల కథలు 1955లోనే ముళ్ళపూడి వ్రాశాడంటే "హన్నా" అన్ని ముళ్ళపూడి స్టైల్లోనే పాఠకులు హాచ్చెర్య పడిపోతారు. ఒకే అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకోగలిగిన గోపాలం లాంటి ఏకలవ్వుల నుండి ఓ ప్రభావతికి బీటేసే మూడవ నంబరు ప్రద్యుముడి వరకు ఎందరో లవ్వు కుమారులు భగ్నవీణలు భాష్పకణాలు మొదలైన కథల్లో కనిపిస్తాయి.

బ్రహ్మదేవుడు ఓ అందమైన ముక్కును సృష్టించి దరిమిలా ఆ ముక్కుకోసం ఓ అందమైన అమ్మాయిని సృష్టించాడట. ఆ ముక్కుకి ఆ పిల్లకి, భూలోక నామం రాధమ్మ. ఆ రాధమ్మని ప్రేమించడం కోసమే గోపాలం పుట్టాడు.

రాధాగోపాలం కథలో తన గోపాలం చెలికాడితో సహా తోటల వెంబడి, బస్సుల్లో పెళ్ళిళ్ళు, గాఢంగా గాఠిగా రాధమ్మని ప్రేమించేసి చివరికి దిగ్విజయంగా పెళ్ళాడేస్తాడు. ఓ శుభోదయాన అందమైన కళ్ళతోనే అందంగా ముగ్గులు పెట్టేసిన

రాధమ్మని మురిపెంగా చూసుకుంటు కాస్త బెట్టుగా ఇలా అంటాడు గోపాలం. "నాకు బోల్డు బాకీ ఉన్నావు పిల్లా" అని బాకీ ఏం బాకీ. . . అని కళ్ళతోనే ప్రశ్నించి అందంగా సిగ్గుపడి నవ్వింది రాధమ్మ. అదుగో ఆ నవ్వే నా కొంపముంచింది. మీ నాన్నని అర్జెంటుగా బాకీ డబ్బులు పంపమని చెప్పు. వైకేరియస్ లయాబిలిటీ తెలుసా. అంటే ఏవిటో. . . మూతి ముడిచింది. రాధమ్మ. . . ఏవిటేవిటి పెళ్ళిగాక ముందు ఎన్నిసార్లు నీకోసం బీటేసి ఫ్రెండ్స్‌తో సహా టీలు త్రాగానో. . . నువ్వు నవ్వితే నా ఫ్రెండ్స్‌కి పార్టీలిచ్చాను. నేనడిగిన చీర. . . లేదా ఓణీ నువ్వేసుకుంటే నా టీముకి సినిమాలు చూపించాను. ఇంకా ఎన్నెన్ని ఎస్టాబ్లిష్‌మెంట్ ఛార్జీలు అయ్యాయో తెలుసా దీన్నేవైకేరియస్ లయాబిలిటీ అంటారు. కట్టు. నువ్వు మీ నాన్న కలిసి అంటాడు గోపాలం. "బావుంది మీరు చెప్పింది. అవన్నీ నేన్నిమ్మన్నానా. . . నా మొహంలా ఉంది మీ. . . లా. . . మీ తెలివి. . . మీ పనులు అంది రాధమ్మ. . . ఏదో నీ అభిమానం కొద్దీ అలా మెచ్చుకుంటావు. . . మరీ అంత అందంగా గొప్పగా ఉందంటావా అని వినయం నటిస్తాడు గోపాలం. . "మీకేనేంటి పెద్ద గొప్ప. . . ఖర్చులు మీ కోసం పట్టు పావడలు, జుంకీలు, మీరడిగిన చీరలు, ఓణీలు వీటికెంత ఖర్చయిందో తెలుసా. . . అయినా మా ఫ్రెండ్ పెళ్ళిలో మీ కోసం కష్టపడి నే తయారయి వస్తే ఎటో మాయమయి ఇంత మందం పౌడరు కొట్టుకుని ప్రత్యక్షమయ్యారు. అయినా. . . మీ బాకీలు పోను ఇంకా మీరే నాకు బోల్డు బాకీ. . ." కూర తరుగుతూ బాకీ లెక్కలు చెబుతుంది. రాధాగోపాలంలో రాధమ్మ.

అప్పడగటం కన్నా బాధ కలిగించే విషయం మరొకటి లేదు. కాని దీన్ని జీవనధర్మం. సృష్టి ధర్మం అంటాడు ముళ్ళపూడి. రోజూ అఋణకిరుణుడు సరస్సులు, సముద్రాల దగ్గర నుండి అప్పు అప్ (నీరు) తీసేసుకుని మేఘాల ద్వారా తిరిగి అప్పు తీర్చేస్తాట్ట. హలో అంటే 5 రు.లు. హలో కులాసా అంటే 10 రు.లు. ముళ్ళపూడి ఋణానందలహరి అనే అప్పు కవీయం వ్రాశాడు. యువరాజు మహరాజు, ఆకలి అనందరావు కథల్లో ఋణగౌణధ్వని వినిపిస్తుంది. అప్పు వేటాడబోయే పులి తననే ఎరగా మార్చి మరొకరు వేటాడబోతున్న వైనం తెలుసుకోలేదు. అప్పు వేటలో హేఋణవాన్ ఏది ఎర, ఏది పులి, ఏది బలి అంటాడు స్వామి ఋణానంద.

తెలుగువారి అల్లరి పిడుగు బుడుగు. సీగాన పెసూనాంబ బుడుగు ఫ్రెండు. వాడికింద ఎంత మంది మాష్టర్లు పనిచేశారో తెలియదు. అస్సలు ఇష్టం ఉండదు. గుండు మీద గారిగా ప్రైవేటు చెప్పేయగలడు. కాణీయొప్పుదణాలో ఇచ్చి బుడుగును అప్పుడప్పుడు సంతోషపెట్టవచ్చును. బుడుగంటే పిల్లలకీ, పెద్దలకీ కూడా ఇష్టమే.

ముళ్ళపూడి సాహిత్యం ఒక వినోదం, ఒక లోకజ్ఞానం. జీవితసాగరంలోని సమస్తమైన సుఖదు:ఖాలను హాస్యంలో రంగరించి ఆవిష్కరింపజేసిన అమృతగుళిక రసానందాన్ని ఆబాలగోపాలానికి ప్రసాదించే రమణీయ రసానందలహరి ముళ్ళపూడి సాహిత్యలహరి.

## శ్రీయర్రంశెట్టిశాయి:

ప్రస్తుతం సమాజంలో కనిపిస్తున్న ప్రతి యదార్థ సంఘటననీ ఈ సామాజిక వ్యవస్థని హాస్యంతో ప్రతిఫలించేలా చూపిస్తున్నరచయిత శ్రీ యర్రంశెట్టిశాయి. ఈయన హాస్యంతో సంధించే బాణాలు వ్యవస్థలో అందరికీ తగులుతాయి. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు తప్పులు చేసే వాళ్ళ తప్పులు బయట పెట్టి నవ్వించడమే హాస్యం అన్నారో సందర్భంలో పొడిచేసిన వాడిది తప్పు కాదు పొడిపిపంచుకునే వాడిదే తప్పు అని అంటే ఎవరికైనా నవ్వొస్తుంది. కాని కాని ఇలా పొడిచిన వాళ్ళదే తప్పు అని ఎవరన్నారో చెప్పడానికి భయపడి ఎక్కడ ఉద్యమాలు వస్తాయో అని నోరుమూసుకున్న వ్యవస్థని యర్రంశెట్టిశాయి ఘాటుగానే విమర్శించాడు. మన ఇంట్లోను బయట జరుగుతున్న ప్రతి సంఘటనని మన కళ్ళు ముందు ఉంచుతున్నాడు. దీనిని చాలా ధైర్యంగా యర్రంశెట్టిశాయి వ్యవస్థ ముందు ఉంచుతూ తన హ్యూమరాలజీ కథలకు పీఠికగా ఇలా అంటాడు. ఈ కథలు పచ్చి నిజాలు. ఇందులో పాత్రలు సంఘటనలు ఏవీ కల్పితాలు కావు. ఒకవేళ హ్యూమరాలజీలో ఏ పాత్రయినా మనలో కానీ మనకు తెల్లారి లేస్తే కనిపించే వాళ్ళల్లో కానీ ఎవరికీ పోలిక లేకపోయినట్లైతే అది మనకు కాకతాళీయం. అందుకు రచయిత బాధ్యత లేదు అంటాడు. సామాన్యంగా రచయితలు దీనికి విరుద్ధమైన ప్రకటనలు పీఠికలో ఇస్తుంటారు.

ఈ హ్యూమరాలజీ చదివి. క్రికెట్ క్రికెట్ కథ మనలో చాలా మందికి ఉన్న

క్రికెట్ పిచ్చిని ఎత్తి చూపించి నవ్విస్తుంది. క్రికెట్ ఆట తెలియని వాళ్ళని పాత రాతి యుగానికి చెందిన వాళ్ళుగా చూసేవారు ఉన్నారు. క్రికెట్ పరిజ్ఞానాన్ని బాగా ఒంటబట్టించుకుని ఆ క్రికెట్ పిచ్చి ఉన్న వాళ్ళ దగ్గర నాలుగు క్రికెట్ కబుర్లు చెప్పి పబ్బం, గడుపుకుని ప్రమోషన్లు కొట్టేసే క్రికెట్ వీరులూ ఉన్నారు.

క్రికెట్ ! క్రికెట్ !

"సార్ ! ఆఫీస్‌రు గారు పిలుస్తున్నారు" ఫ్యూన్ తాపీగా వచ్చి చెప్పాడు. వెంటనే ఆయన రూమ్‌లోకి పరిగెత్తాను. ఆయన న్యూస్ పేపర్లో స్పోర్ట్స్ కాలమ్ చదువుతున్నాడు.

"రాక్షస్ అండ్ రాక్షస్ కంపెనీ ఫైలు రెడీ అయిందా ?"

"ఇంకా లేదండీ నోట్ రాస్తున్నాను"

"త్వరగా కానీ అరె ! వెస్టిండీస్ వస్తున్నారే" హుషారుగా అన్నాడతను. నేను వెనక్కు తిరిగి చూచాను. ఎవరొస్తున్నారా అని

"ఎవరూ లేరు కదండి"

ఆయన చిరాకుగా నా వైపు చూశాడు.

"ఏమిటెవరూ లేరు?"

"అదే ! ఎవరో వస్తున్నారని అంటున్నారు కదా"

"నేననేది వెస్టిండీస్ సంగతయ్యా ! ఇదే వచ్చేవారం నుంచే టెస్ట్ మొదలవుతుంది. నాకింకా అయోమయం అయిపోయింది. అయన మాటలే మాత్రం అర్థం కావడం లేదు. అయినా నాకు ఇంకా తెలీనట్లు మాట్లాడితే బావుండదని

"ఓహో ! మీరనేది వెస్టిండీస్ సంగతా ! అవునండీ ! అవును" అన్నాను తడబడుతూ

"లాయిడ్ స్టేట్‌మెంట్ చూశావా ?"

నాకు మళ్ళీ అర్థం కాలేదు. మా ఆఫీస్‌కి సంబంధించిన మాన్యువల్ స్టేట్‌మెంట్ మాత్రం నేను తయారు చేస్తుంటాను. కానీ మరి ఈ లాయిడ్ స్టేట్‌మెంటేమిటో.. . . "స్టేట్‌మెంట్ మొన్నే హెడ్డాఫీసుకి పంపించాంకదండి?"

"నేననేది లాయిడ్ స్టేట్‌మెంటయ్యా ! లాయిడ్ స్టేట్‌మెంటిచ్చాడు".

"ఏమోసార్ ! నాకు మాత్రం ఇవ్వలేదు. ఒకవేళ హెడ్‌క్లర్క్ గారికిచ్చాడేమో కనుక్కుంటాను" ఆయన నన్నో పురుగుని చూపినట్లు చూశాడు.

"యూకెన్‌గో ! నీకు క్రికెట్ గురించి ఏమీ తెలిపినట్లు లేదు"! అన్నాడాయన చూపు మార్చి నన్నో వింత జంతువుని చూసినట్లు చూస్తూ నా గుండెల్లో రాయి పడింది.

పాపం అతగాడు క్రికెట్ నాలెడ్జి కోసం ఓ ట్రాన్సిస్టర్ కొనుక్కొని కొంత పరిజ్ఞానం వంట పట్టించుకున్నా పార్వతీశంలా నవ్వుల పాలవుతునే ఉంటాడు. స్కోరెంత అంటే 36 అంటాడు. వికెట్లెన్ని అంటే 14 అంటాడు. ఆటలో పది ఉంటాయి తెలియని హీరో. ఆఫీసర్ కపిల్‌దేవ్ ఎన్ని ఓవర్లు వేశాడంటే 12 అని చెప్పి మెయిడెన్స్ ఎన్ని అంటే 23 అంటాడు. వెంటనే ఆఫీసర్ యూకెన్‌గో అంటాడు. ఆఫీసర్‌కి అంత కోపం ఎందుకొచ్చిందో హీరోకి అస్సలు అర్థం కాదు. చివరకి అతగాడి క్రికెట్ పరిజ్ఞానం మరీ ఎక్కువ అయిపోయి అసందర్భంగా వాగి ప్రమోషన్ పోగొట్టుకుంటాడు.

దొంగలొస్తున్నారు స్వాగతం చెప్పండి కథలో నిర్భయ్‌నగర కాలనీ వాసులు దొంగల భయంతో వేగలేక చివరికి దొంగలతోనే ఓ ఒప్పందానికి వస్తారు. కాలనీలో దొంగగా రిజిస్టరయిన వారందరికీ నెలకు అయిదువేలు జీతం ( కన్సాలిడెటెడ్) ఇవ్వబడుతుంది. సంవత్సరానికి ఒకసారి దీపావళి పండుగ ముందు వేతనానికి సమానమైన బోనస్ కూడా ఇవ్వబడుతుంది. దీనికి ప్రతిఫలంగా ఆ దొంగలు నిర్భయ్ నగర్‌లో దొంగతనాలు చేయరు. ఇంకొకరిని చేయనీయరు.

బడ్జెట్ వస్తే ధరలు పెరుగుతాయని ముందు జాగ్రత్త చర్యగా మధ్యతరగతి మేధావులు నిర్భయ్‌నగర్ కాలనీలో ఓ లిస్టు తయారు చేసి ఒకళ్ళు టూత్ పేస్టులు మరొకళ్ళు న్యూస్‌పేపర్, సబ్బులు, వనస్పతి ఆఖరికి వంకాయలతో సహా కొనేశారు. ఆ తరువాత ఎక్కువ ధరకి అమ్మవచ్చని తీరా బడ్జెట్ కొంపముంచింది. ఆ వస్తువుల ధర, షేర్లు పెరగలేదు.

## భమిడిపాటి రామగోపాలం:

భమిడిపాటి రామగోపాలం చాలా అందమైన లలితమైన హాస్యం అందించిన హాస్య రచయితల్లో ఒకరు. ఆధునిక మధ్యతరగతి మనస్తత్వాలు స్వగతాలూ చాలా హాస్యం రూపంలో కనిపిస్తాయి. ఆయన ఇలా అంటాడు.

మధ్యతరగతి మనుషులకి ఒకే ఒక ఆనందం ఏమిటంటే తమని చూసి తామే నవ్వుకోగలగడం. ఎవరి మీదో జోగు వేసినప్పటికంటే తమ మీద జోకు వేసుకున్నప్పుడు ఎక్కువగా ఆనందించగలిగే నిరాటంకమైన అవకాశం అంటాడు. తన అసమర్థత మీద కూడా ఓ జోకేసుకుంటాడు. ఓసారి హైదరాబాదు నుంచి విశాఖపట్నం రావడానికి నాకు విమాన ప్రయాణయోగం కలిగింది. టికెట్ ఎవరో ఎరేంజి చేసారని వేరే చెప్పక్కర్లేదు కదా. . . అడుగడుగున గుడి ఉంది అనే కథలో పురాణ పాత్రలని గుర్తు పెట్టుకోవలసిన ఆర్థిక సామాజిక అవసరం ఎలా ఉంటుందో చెబితే మనకు నవ్వొస్తుంది.

ఓసారి సాయిబాబా అనే పేరుగల నా మిత్రుడొకడు నా దగ్గర వందరూపాయలు అప్పు పట్టుకెళ్ళి రెండు నెలలయిపోయినా తిరిగి ఇచ్చేడు కాదని, అతని మీద ఒక పాత జోకు ప్రయోగించాను.

'నిన్ను చూసినప్పుడల్లా నాకు రాఘవేంద్రస్వామి జ్ఞాపకం వస్తాడు" అన్నాను.

మాకిద్దరికీ పోలికలు లేవే అని సాయిబాబా ఓ క్షణం ఆలోచించి "మన క్లాసుమెంటు రాఘవేంద్రస్వామి సంగతే కదూ నువ్వు చెబుతున్నావు. ఓహో తెలిసింది. . . నా పేరు డైరెక్టుగా దేవుడి పేరే అయినట్లు అతనిది కూడా దేవుడి పేరే అందుకేనా?" అన్నాడు.

అందుక్కాదు అతను కూడా నీలాగే నాకు వంద రూపాయలు బాకీ ఉన్నాడు అన్నాను. చెప్పా పెట్టకుండా వచ్చే గెస్టులని అభ్యాగతికి స్వయం పిడుగు అంటాడు. ఛలో ఆ భార్యాభర్తల ముందు మీ ఇంటిని గుర్తుకు తీసుకురాకపోతే జోకు మీదే ఒట్టేయవచ్చు. నేను గెస్టులను ముందు గదిలో కూర్చోబెట్టి మా ఆవిడతో మంతకాలాడాను.

"వీళ్ళ వరస చూస్తే భోజనానికి ఇక్కడే తిష్ఠ వేసేట్లుంది".

"ష్ష ! మెల్లిగా మాట్లాడండి ! వాళ్ళకి వినిపిస్తుందో ఏమో !"

'మా ఇంట్లో భోజనం మాత్రం వీలుకాదు అని చెప్పేదునా కన్యాశుల్కంలో అగ్నిహోత్రావధానుల్లా'

'అవ్వ ! మీ ఆలోచన. . .?'

నేను ఎలాగో అలా ఇంత ఉడికేస్తాను. . . మీరు వాళ్ళకి సంతకెళ్ళినట్టే ఉంది. పుస్తకాలు ఇవ్వండి. టైమ్ ప్రకారం. నేను దుర్గాభినవ్‌కి వెళ్ళి సాంబారు కూరలు పెరుగు తెస్తాను. తెస్తే తెచ్చారు కానీ ఆ నాలుగు గిన్నెల నా క్యారేజి వాళ్ళ మొహం మీద ఆడించుకుంటూ రాకండి. అప్పటికప్పుడు పక్క ప్రహరీగోడ మీద నుండి ఏర్పాట్లు పూర్తయినాయి. హొటలు దగ్గర ఆస్థానముష్టివాడు చాలా రసజ్ఞుడు. సాంబారు మాత్రం వేయించుకోకండి బాబయ్యా అని సలహా చెబుతాడు.

ఇలా ఏ పాత్ర సన్నివేశం దొరికినా అందులో హాస్యాన్ని తొణికించేవాడు.

## శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి కథలు

శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి కథల్లో మన ఇంట్లో జరిగే ప్రతి సంఘటన హాస్యరూపంలో ధ్వనిస్తుంది. ఆవిడ చంద్రహారం, మా ఇంటి రామాయణం, ఆనందమే అందం హాస్య సంపుటాలు. చిరాకు తెప్పించే వాళ్ళు. అమాయకులు మూర్ఖులు భక్తి చాదస్తం కలిగినవారు సర్వవిధ మనస్తత్వాలతో కనిపిస్తారు. ఓ ఇల్లాలి భక్తి పారవశ్యం భర్త ప్రార్థన ఇలా ఉంది ప్రార్థన ఇలా వినిపిస్తుంది.ఒక పాతగుడ్డ తీసుకుని కిటికీతుడవడం ప్రారంభిస్తుంది. పని చేసే సమయంలో భక్తిపాటలు పాడుకోవటం ఆవిడకి అలవాటు.

"ఇక్ష్వాకుల తిలకా ఇకనైనా పలుకవా రామచంద్రా"! అంటూ కిటికి తుడుచుకుంటూ తాదాత్మ్యం చెందుతుంది. 'ఏ తీరుగ నను దయచూసెదవో' అంటూ పాడుతూ ఉంటే అడ్డు వస్తారు తాతయ్య.

"నువ్వు కాదు ఆ పాట పాడుకోవాల్సింది నేను.పన్నెండు రామదాసు కీర్తనలు అయిపోయినా మొదటి కిటికి దగ్గరే ఉన్నావు. ఈ లెక్కన ఇరవైరెండు కిటికీలూ, పదిహేను ద్వారబంధాలూ తుడిచేది ఎప్పుడు ? మడికట్టుకునేది ఎప్పుడు? వంట చేసి నాకింత ముద్ద పెట్టేది ఎప్పుడు?"

"ఇదిగో అయిపోయింది" అంది అమ్మమ్మ.

"ఇట్లా కాదుగానీ నా మాట విని ఒక్కోకిటికీకి ఒక్కో కీర్తన అని నియమం పెట్టుకో కిటికీలకు రామదాసు కీర్తనలూ, తలుపులకు త్యాగరాజస్వామి కీర్తనలూ అని అనుకో, సింహద్వారానికి కావాలంటే ఓ పంచరత్న కీర్తన పాడుకో ఇట్లా నియమానుసారంగా పాడుకుంటే నీకు సుఖం నాకు సుఖం" అంటూ సలహా చెప్పారు.

**మల్లిక్: మల్లిక్ అంటే నవ్వుల కితకితలు:**

పరుగో పరుగు బట్టి వందలవేల జోకుల హిహి. . . హి. . హ హ కారాలు నవ్వించడం మొదలు పెట్టి- ఫుల్‌స్టాపులు, కామాలూ ఏవీ ఉండవు అంతా అనంతమైన హాస్య లాస్య జలపాత ప్రవంతి

మన జీవితాల్లో కనిపించే ఒక పద్యాన్ని ఇలా చూపిస్తాడు.

పిన్నిగారూ ! మీరు ఆవకాయ్ పెట్టారా ? సీతారత్నం ఇంటికి పక్కింటి రాధాబాయ్ వచ్చింది. కాస్సేపయ్యాక సీతారత్నంని రాధాబాయ్ అడిగింది.

"మీరు ఆవకాయ్ పెట్టారా వదినా"? ఆ ప్రశ్న వింటూనే సీతారత్నం మొహం వివర్ణమైంది.

"లేదు. . ." అంది రాధాబాయ్ ఏమంటుందోనని భయపడ్తునే సీతారత్నం భయపడ్డ విధంగానే జరిగింది.

"హయ్యో !. . .ఇంకా ఆవకాయ్ పెట్టలేదా ?. . . ఇదేం చోద్యమమ్మా !. . . అంది రాధాబాయ్ బుగ్గలు నొక్కుకుంటూ. రాధాబాయ్ అలా అనేసరికి సీతారత్నం సిగ్గుతో చితికిపోయింది.

"అంటే. . . అదే. . . పెడ్దామని అనుకుంటే. . . టైము లేక. . . అదేలే. . . ఓపికా. . . హిహి" నవ్వు తెచ్చి పెట్టుకుంటూ గొణుగుతూ అంది.

"అయినా ఆవకాయ్ పెట్టడానికి ధైర్యం కూడా కావాల్లే వదినా. . . బోల్డంత ఖర్చు అవుతుందిగా. . . మా ఆయన డబ్బుని అస్సలు ఖాతరు చేయరు. . . నేనైనా అంతే ఏదైనా కావాలంటే చేసెయ్యడమేగానీ ఇంత డబ్బు ఔతుందని అంత డబ్బు ఔతుందని ఆలోచించ". గర్వంగా అంది రాధాబాయ్.

వాళ్ళిద్దరూ మామిడికాయలు అమ్మే దగ్గరికి వెళ్ళారు. అక్కడ మామిడికాయల్ని గుట్టలుగా పోసి అమ్ముతున్నారు. ఆ పక్కనే ఒకడు ఇనపకడ్డీని నిప్పుల్లో కాలుస్తున్నాడు.

"దాన్నేందుకు అట్టా కాలుస్తున్నాడు?" కుతూహలంగా అడిగింది సీతారత్నం.

"మామిడికాయలు బేరమాడింతర్వాత వాడే కాయలు తీసిస్తాడమ్మా. . . మీరు ఎంచుకోడానికి వీల్లేదు. . . అలా కాకుండా కాయల్ని ముట్టుకుంటే చేతిమీద వాత పెడ్తాడమ్మా. . .లేదా ఈ ఎనకాల నాంచారమ్మ అని ఉందమ్మా. . . దాన్ని పిలిపించి బండ బూతులు తిట్టిస్తాడమ్మా. . . మీకేది కావాలమ్మా ? వాతలు కావాలా, బూతులు కావాలా?" అని అడిగాడు రంగయ్య.

**వియోగి (కె. విజయప్రసాద్):**

హాస్యానందం అనే హాస్యకథాసంపుటంలో నాటకీయశైలిలో పాత్రల మనోభావాల వ్యాఖ్యానంలో వియోగి మనకి జీవిత దృశ్యాలన్నీ చూపిస్తారు. బేకారు యోగం కథలో సుబ్బారావు ఇల్లాలు కారుకొనాలనే ముచ్చటైన కోరిక తీర్చడం కోసం, కారుతో ఎన్ని కష్టాలు ఉన్నాయో అన్ని కష్టాలూ పడ్డాడు. చివరికి అందరూ కారు యోగం పట్టిందని కారు కూతలు కూశారు. కాని తమకు బేకారు యోగం పట్టిందని సులోచన సుబ్బారావులు గ్రహించారు. తెలుగుదేశంలో సగటు తెలుగు వ్యక్తి సుబ్బారావు. మనవాళ్ళ మనస్తత్వాలని సలహాల సుబ్బారావు కథలో ఇలా అంటాడు.

శ్రీమాన్ సుబ్బారావుకు ఆత్మ విశ్వాసం కొంచెం జాస్తి. చదివింది అర్థు అయినా తన గురించి తాను గొప్పగా ఉహించుకుంటూ ఉంటాడు. ఈ జబ్బు అతనికే కాదు సగటు ఆంధ్రులకు ఉందని కొందరి అనుమానం. ఈ ఆత్మ విశ్వాసం ఎందుకు స్వైన్‌ఫ్లూలా పెరిగిపోయిందంటే. అతను ఏ ఆఫీసులో పని చేసినా కొందరు కొలీగులు అతన్ని సలహాలు యిమ్మనడమే ముఖ్య కారణం. ఆపై శ్రీమతి గారు అతడు చెప్పిందానికి ఎప్పుడూ అడ్డు పడక పోవడం ఇంకో కారణం. సుబ్బారావు శోభనం కథలో అతగాడి శోభనం కష్టాలు బహుశ చాలా మందికి అనుభవైక వేద్యాలేమో.

రాత్రి పది అయిపోయింది. ఆడ పెళ్ళివారి నుంచి ఇంకా కబురు రాలేదు. ఎంత సేపని టీవి చూడగలడు. నీరజ రెండు గంటల నుండి తప్పించుకుని తిరుగుతున్నది.

'ఆ, ఊ' అంటుంది కాని మనస్ఫూర్తిగా మాట్లాడం లేదు– సుబ్బారావు గట్టిగా ఆవులించాడు.

"నిద్రోస్తున్నది" ! స్వగతంగా అన్నాడు అందరూ వినేట్లు.

"ఏం బాబు ! నిద్రొస్తున్నదా – మేడ పైన పక్కలు వేశాం పోయి పడుకో " అత్తగారు సెలవిచ్చారు.

"అది కాదండి. . ." నసిగాడు సుబ్బారావు. "ఏం కావాలి అల్లుడూ !" మామగారు ఆరా తీశారు.

"నీరజ – నీరజ కనపడ్డం లేదు – తను రాదా ?" ధైర్యం చేసి అడిగాడు.

"తను వేరే గదిలో ఉంది – రేపు కనిపిస్తుంది" చెప్పింది. అత్తగారు. ఆ విధంగా ఒకదానితో పాటు సుబ్బారావుకి ఎన్నో అవాంతరాలు వచ్చి పాపం నిరాశకి నిస్పృహకి చివరికి తట్టుకోలేక ఓదార్పు సానుభూతి పొందాడు మరణాలు, ఆషాఢమాసాలు. ప్రమోషన్‌పై ట్రెయినింగులుతో సుబ్బారావు నీరసించిపోతాడు. అందుకే వదినతో కచ్చగా అంటాడు.

"అలాగేనమ్మా ! నీరజను మీ దగ్గరే ఉంచుకోండి – పిల్లలు చక్కగా పుడతారు, పెరిగి పెద్దవుతారు ముసలి తనంలో మమ్మల్ని చూస్తారు. ఈ జన్మకు పెళ్ళయిందన్న తృప్తి చాలు ! మీ యింట్లో ఎవరన్నా పోతే వచ్చి చూసి పోతూ ఉంటాను" చెప్పాడు సుబ్బారావు భారంగా నిట్టూరుస్తూ.

ఆ తరువాత అనుకోకుండా అదృష్టం, ప్రయోగం, ప్రమాదం ఇలా ఆయన కథలన్నీ హాస్యభరితంగా ఉంటాయి.

## సింహప్రసాద్ కథలు:

నాటకంలోని దృశ్యాలు సంభాషణలు చోటు చేసుకుని ఆయన కథలు నవ్విస్తాయి. మన అందరి బలహీనతలు వారం వారం ఆంధ్రభూమిలో 6-1-2000

నుండి 1-6-2000 వరకు ప్రచురించబడిన కథలు. నిత్యజీవితంలో హాస్యం అని సింహప్రసాద్ హాస్యాన్ని వర్ణించవచ్చును. అందరికీ ఏ వస్తువు అయినా ఫ్రీ అంటే రెచ్చిపోవడం మగ ఆడ మనస్తత్వాల్లో కనిపిస్తుంది.

"హెయిరాయిల్ కొనేంత స్వేచ్ఛ కూడా మీకు మీ ఇంట్లో లేదా సర్?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది.

"అహహ ఇంట్లో నేనే కింగ్‌ని".

"మరయితే భయపడకుండా తీసుకోండి సర్"

"వద్దంటే వద్దంతే. . ."

"ఇవి కొంటేనే ఆ సెంటు సీసాలు ఉచితం సర్. . ."

"అలాగా. . . అయితే ఇవీ వద్దు" చేతిలోని బాటిల్స్ ఆమె ముందుంచాడు.

"తీసుకున్నాక ఇవ్వటం ఏం బావో లేద్సర్. ఫలానా ఇంట్లోని ఫలానా హీరో ఇలా చేశాడని మీ ఇరుగు పొరుక్కీ వాళ్ళకీ వీళ్ళకీ చెప్పేననుకోండి సర్ చాలా చీప్‌గా ఇన్సల్టింగ్‌గా వుంటుంది సర్. . . ప్లీజ్ సర్. ఈ ఒక్కసారికీ తీసుకోండి... హీరోలాంటి మీరిలా ఎదుట లేని మీ ఆవిడకి భయం పడ్డం ఏం బావోలేదు సర్"

ఆ చివరి ముక్క అతడి మీద బాగా పని చేసింది.

"ఇజ్జత్‌కి సవాల్" అన్పించింది.

రకీమని లేచి నూటయాభై ఆమె చేతిలో పెట్టాడు.

"థాంక్యూ సర్. . . నెక్స్ట్‌మంత్ వస్తాన్సర్. . ."

"వద్దొద్దు రావద్దు. . ."

"మీకు నచ్చితేనే కొందురుగాని సర్. . ."

"నాకు నచ్చదు గాని రావద్దు రావద్దు"

అదోలా చూసి వెళ్ళిపోయిందామె.

శ్రీలక్ష్మి ఎలా చెప్పడమా అని ఇదవుతోంటే చిన్న బేగ్‌తో వచ్చిందామె. హెయిరాయిల్ సీసాల్నీ సెంటు సీసాల్నీ చూసి గతుక్కుమంది.

దగ్గరికెళ్ళి పరీక్షగా చూసి "హెయిరాయిలెందుకు కొన్నారు?" అనడిగిందామె.

"అవి కొంటె సెంటు సీసాలు ఫ్రీ అని" నీళ్ళు నమిలాడు.

"సెంటు సీసాల కోసం వాటిని కొన్నారన్నమాట"

"వూహు అవి కొంటే ఇవి ఇచ్చారు"

"ఇవి ఫ్రీగా ఇస్తున్నారని అవి కొన్నారన్న మాట"

"అహ హెయిరాయిల్ కొన్నానని సెంటు సీసాలు ఫ్రీగా ఇచ్చారు"

"మనం శుభ్రమైన కొబ్బరినూనె వాడతాం కదా. అవెందుకు కొన్నారు".

"సెంటు సీసాల కోసం"

"సెంటు వాసన నాకు ఎలర్జీ కదా ఎందుక్కొన్నారు?"

"సెంటు సీసాల కొన్లేదే వూరికే ఇచ్చారు"

"ఉచితంగా ఇస్తున్నారని ఏవీ కొనకూడదని లెక్చరిస్తుంటారు"

"అప్పుడప్పుడూ కొనొచ్చు. ఇంక లెక్చర్లివ్వను. లెంపలేసుకుంటున్నాను"

"హమ్మయ్య బ్రతికించారు. ఇంకా మీరేమంటారోనని హడలి ఛస్తున్నాను".

"నేనేమైనా అనే పని చేశావా ఏవిటి ఖర్మ"

"ఇందాక మనోరమా వాళ్ళింట్లో మాట్లాడుతోంటే ఎవడో వచ్చి నన్ను ఇంటర్వ్యూ చేశాడుబావోదని కొన్నాను".

రెండు హెయిరాయిల్ సీసాలూ, రెండు సెంటు సీసాలు బ్యాగ్‌లోంచి బయటికి తీస్తూ అంది శ్రీలక్ష్మి.

"ఎంతకి కొన్నావ్?" ఏడుపు మొఖంతో అడిగాడు.

"రెండు వందలు చెబితే బేరమాడి వందకి కొన్నాను మీరు?" యాభైకి కొన్నాను నేనెలాగైనా గ్రేట్ కదా" ఠకీమనీ అబద్ధమాడేశాడు.

"ఏం కాదు మీరు కొన్నది సెకండ్ క్వాలిటీది అయి వుంటుంది. అదైతే యాభైకే ఇస్తానని అన్నాడు. మేం క్వాలిటీ సరుకే కొంటాం అన్చేప్పి ఇవి కొన్నాను..

." తెల్ల మొఖం వేశాడు బ్రహ్మానందం. బ్రహ్మానందలహరి హాస్య కథాసంపుటంలో కథలన్నీ ఎంతో చక్కని హాస్యం మనకి అందిస్తాం. దోచుకోవడానికి వచ్చిన దొంగలు తమ పాలసీలు ఇలా చెబుతారు కష్టసుఖాలు డిమాండ్లు ఇలా చెబుతారు.

"ప్రతి కులస్తులకు ప్రతి వృత్తి వారికి ప్రతి కేడర్ వారికి సంఘాలున్నప్పుడు మాకు మాత్రం ఎందుకండకూడదనుకుని ఓ సంఘాన్ని స్థాపించాం. రిజిస్టర్ కూడా చేయించాం".

"అబ్బో ! రిజిస్టర్ సంఘం అన్నమాట. . . చాలా మంచి సంగతులు చెప్పేరు. మీ సంఘం తరపున ప్రభుత్వాన్నేమయినా సహాయాలర్థిస్తున్నారా?"

"మేం చాలా డిమాండ్లు చేస్తున్నాం. మమ్మల్ని ప్రొఫెషనల్ అండ్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ కేటగిరిగా గుర్తించి స్వయం ఉపాధిపథకాల క్రింద బ్యాంకులు మాకు రుణాలిచ్చేట్టు చూడమంటున్నాం. మాకు ఇళ్ళ స్థలాలిప్పించమని అడిగాం. పోలీసుల వాటాలనీ మామూళ్ళనీ క్రమబద్ధం చెయ్యమంటున్నాం.

"ఇంతేనా ఇంకేమైనా డిమాండ్స్ వున్నాయా?"

"ఇంకా ముఖ్యమైనవి వున్నాయి. - కరెంటు కోతని రాత్రి పదకొండు గంటల్నుండి ఒంటి గంట వరకూ విస్తరించాలి. కరెంటు పరిస్థితి మెరుగుపడినప్పటికీ కోతని రాత్రివేళ కంటిన్యూ చెయ్యాలి. టీవి కార్యక్రమాలన్నీ రాత్రి పదకొండు గంటలకి బంద్ చెయ్యాలి. మసాలా సినిమాలూ మసాలా పాటలూ అర్థరాత్రుళ్ళు చచ్చినా ప్రసారం చెయ్యకూడదు.

## తెలిదేవర భానుమూర్తి గిల్లిదండ:

తెలంగాణా ప్రాంతంలోని ప్రజల మనస్తత్వాలు వారి భావప్రకటనల్లో సారళ్యం. లౌక్యం లేని సహజత్వం ప్రస్ఫుటంగా తీర్చిదిద్దారు తెలిదేవర భానుమూర్తి. భిన్న మనస్తత్వాల్లోని వైవిధ్యం వైరుధ్యం కనిపిస్తున్నప్పటికీ వంకర మాటలు చేష్టలు ఉండవు. కాకపోతే చిన్న చిన్న బలహీనతలు ఉంటాయి. ఇది మానవ ప్రవృత్తి సహజ లక్షణం కదా గిల్లిదండ అనే ఆట సామాజిక జీవితం యొక్క ఆట ఇందులో ఆడేవారు ఆడించేవారు భిన్న స్వరూపాల్లో కనిపిస్తారు.

టికెట్లను చేతుల బట్టుకోని గాడు టి.సి. కాడ్కి వొచ్చిండు. గాడిచ్చిన టికెట్లను టి.సి. జూసిండు. ఒక ఆఫ్ టికెట్ రెండు ఫుల్ టికట్లు ఉన్నాయి.

“గీ పోరడు ఎవ్వలి పోరడు?” ఇస్త్రారి గాని చిన్న పొరన్ని సూబెట్టుకుంట టి.సి. అడిగిండు.

“మా పోరడే” అని ఇస్త్రారి అన్నాడు.

“గీనికి ఎన్నేండ్లు” అని టి.సి. అడిగిండు.

“నాలుగేండ్లు” అని ఇస్త్రారి జెప్పిండు.

“నీకెన్నేండ్లు?” అని టి.సి. ఇస్త్రారిగాని చిన్న పోరన్ని అడిగిండు.

“రేల్ గాడిల గూసున్నప్పుడు నాలుగేండ్లు, రేల్‌గాడి దిగంగానే ఎన్మిదేండ్లు” అని ఇస్త్రారి గాని పోరడు అన్నాడు.

“గట్లనా గీ పోరనికి ఆఫ్ టికెట్‌కు అయ్యేటి పైసలే గట్టిండు. ఆటెంకల చిన్న పోరన్ని మెత్తగ తోమిండు. గాదినం ఐతారు. మొగలైంది. మొగులయ్యే బట్టె ఒక ఛత్రిని దీస్కోని కూరగాయలు కొనెందుకు ఇస్త్రారి ఇంట కెల్లి ఎల్లిండు. గాడు గిట్ల బజార్లకు బొంగనే గట్ల వాన దల్గింది. వాన దల్గినా గాడు ఛత్రికులాయించలేదు. ఛత్రి కులాయించకుంటగాడు వానల దద్వబట్టిండు. అందురు గాని దిక్కు సూసి నవ్వబట్టింద్రు. ఒగలు నవ్వితే నాకేంది అనిగాడు అనుకున్నాడు. తొవ్వలగాని దోసుత యాద్గిరి గలిసిండు.

“ఛత్రి ఉండంగ వానల దదుస్తున్నవేంది?” !అనిగాడు అడిగిండు.

“ఛత్రి కులాయిస్తే వానల దదుస్తది గదా ” అని ఇస్త్రారి అన్నాడు.

“నువ్వు దదుస్తున్నావుగదా” అని యాద్గిరి అంటే

“నేను దడిస్తి దప్పిని ఛత్రి దద్వకుంటే సాలు” అని ఇస్త్రారి అన్నాడు.

“ఛత్రి గినకొత్తదా”? అని యాద్గిరి అడిగిండు.

“పాతదే పెండ్లిలో మా అత్తగారిచ్చింద్రు” అని ఇస్త్రారి అన్నాడు.

"గిన్ని దినాలైనా నీ ఛత్రి కొత్తగ ఎందుకున్నదో గియ్యాల ఎర్కైంది" అని యాద్గిరి అన్నాడు. వానల దద్వ బట్టె ఇస్తారికి సర్దయ్యింది. సర్ది జెరమొచ్చింది. జెరమొస్తెగాడు డాక్టర్ తాన్కి బోయిండు ఫీజు కింద మస్తు పైసలు కర్సయినయి.

## ఎస్. వివేకానంద కామెడీ కథలు:

హాస్య కథల్లో హాస్యం ఒక్కొక్కరిది ఒక్కో రీతిలో ఉంటుంది. జీవితాన్ని విడిచి హాస్యమే ఉండదు. ప్రతి సగటు యువకుడి కలలు ఇంచుమించు ఒకేలా ఉంటాయి. వీటిని హాస్య కథలుగా మలిచే రీతిలో భాష ప్రకటన శైలి కథనంలో హాస్యం ప్రస్ఫుటం కావించడం వివేకానంద గారి ప్రత్యేకత. గల్లంతు కథలో రాజమౌళి భావాలిలా ఉంటాయి.

రాజమౌళికి జాబొచ్చింది. జాబ్ రావటమంటే లాటరీలో బంపర్ ప్రైజ్ తగిలినట్టు. . . ఫ్లాపవుతుందేమోని అన్పించిన సినిమా వందరోజులు ఆడినట్టు. . . ఫస్ట్ ఛాన్స్‌లోని ఎం.ఎల్.ఏ. గా గెలిచిన అభ్యర్థికి కేబినెట్ హోదా మినిస్టర్ పదవి వచ్చిందానికంటే కోటి రెట్లు ఎక్కువన్నమాట !. ఆ తరువాత ఓ తిలోత్తమ లాంటి పిల్ల చేతిలో స్టెతస్కోపు చూసి మెడికో అనుకుని దగ్గరవటానికి ప్రయత్నాలు చేసుకుంటాడు. ఆ పిల్ల ఎయిడ్స్ వ్యాధి నిరోధించే డాక్టర్ కాదని, ప్రసారం చేసే డాక్టరని తెలిసి హతాశుడవుట కథనంలో సరసం ఆయన ప్రత్యేకత.

గోరింటాకుని గోంగూర అనుకుని తినేసి అందర్ని కంగారు పెట్టి తెలుగు, ఇంగ్లీషు భాషే కాదు భారతీయ భాషలన్నీ కలగాపులగం చేసిన తెలుగు సినిమా పాటలా తిట్టే కధానాయికలు (గోరింటాకు గోంగూర పచ్చడి) వరినారులా ఏపుగా పెరిగిన మీసాలతో ఇబ్బంది పడే హీరోలు(మీసాల మొగుడు). చాలా కథల్లో పెళ్ళిచూపులు కొత్త కథలు మనల్ని నవ్విస్తాయి. నోట్లో వేలేసుకుని ముద్దెట్టుకోనీయని శోభనపు పెళ్ళికూతుళ్ళు. కుక్కపిల్ల నీళ్ళోసుకున్నదని సంబరపడే కుటుంబాలు ఎన్నో హాస్య కథలు మనల్ని నవ్విస్తాయి.

## 'మజుందార్' కథల్లో హాస్యం:

జీవితంలో సీరియస్సుగా నడిచే కాలంలో హాస్యం. సరదాగా మధురంగా,

నడిచే కాలంలో సీరియస్సునెస్సు కనిపిస్తుంది. మంచి చెడు కలిస్తేనే మనిషి ముళ్ళపూడి అన్నాడు ఆత్రేయ నవ్వినా ఏడ్చినా కన్నీళ్ళే వస్తాయి అన్నాడు కాకపోతే కన్నీళ్ళు వచ్చినప్పుడు నవ్వేవాడే హీరో అన్నాడు ముళ్ళపూడి. ఈ రెండింట్లోనుండి సరదాగా నవ్వించే ముజుందార్ 1960లో ఆ నాటి పత్రికల్లో ఎన్నో రచించారు. అబ్బాయిలు ప్రేమించిన అమ్మాయితో ముందు మాట్లాడటానికి పరిచయం పెంచుకోవడానికి సృష్ట్యాది నుండి రకరకాల ఇబ్బందులు పడుతునే ఉన్నారు. ప్రేమిస్తున్న పిల్లని కత్తితో పొడుస్తానని అనడం కన్న (ఈ రోజుల్లో ప్రేమించకపోతే అలాగే చేస్తామంటున్నారు కుర్రకారు.) కాని ప్రేమిస్తున్నానని చెప్పడమే కష్టం. ఆ పిల్ల ఏమంటుందో అవి భయం. అది ఇలా ఉంటుంది.

"ఏమండీ"

ఆ అమ్మాయి తన్ను కాదనుకుని వెళుతున్నది. మళ్ళీ పిలిచాడు.

"ఏమండీ" వసుంధర్గారు. . ."

ఆగి అడిగింది "ఏమండి పిలిచారా ?" అని

''గోపాలానికింక చెమటలు పోయసాగాయి. కాళ్ళూ చేతులు వణుకుతున్నాయని నా అనుమానం.

"సహాయం"

వసుందర ఒక నిముషం వీడి వైపు చూసింది. చక్రాల్లా పెద్దవయిన కళ్ళతో

"అరె ! మా అన్నయ్య పేరు మీకెలా తెలుసు ? వాడు తెలుసేమిటి మీకు?" అంది.

"అక్కె . . . బాదండి".

"ఏమిటండి మీరనేది ? ఎవరిని బాదమంటారు ?

"అబ్బె కాదండి !" ధైర్యం పుంజుకుంటున్నాడు వెధవ. . . "నేను సెలవు రెండు. . . రోజులు" కంగారులో పదాలు దొర్లించి అర్థం చేసుకోమన్నట్లు అన్నాడు.

"సారీ టు నోట్. . . అయితే !" అంది వసుంధర వస్తున్న నవ్వాపుకుంటూ

"మీ. . . తెగులు" ఛీ ! వెధవ కంగారు వీడు !

"ఏమిటి మిష్టర్ తెగులంటున్నావ్ ? ఏమిటి అల్లరి ?"

"నో. . . నో. . . అది కాదండీ నేను జ్వరం వలన 2 రోజులు సెలవు పెట్టాను. మీ తెలుగునోట్స్ ఒకసారి యిస్తే రెండ్రోజుల్లో రిటర్న్ చేస్తాను"

అమ్మయ్య ! కర్త 'కర్మ క్రియతో వాక్యాలు నిర్మించగలగుతున్నారు".

## డా. మృణాళిని కోమలి గాంధారం:

పువ్వుకి నొప్పి పుట్టకుండా పువ్వులో మకరందం తీయడం ఎలాగో మృణాళినికి బాగా తెలుసు. రంగనాయకమ్మ పురుషాధిక్యతని మగాహంకారాన్ని, బలహీనతలని క్రూరంగా కఠినంగా కొరడా దెబ్బలు కొడుతున్నట్లు చెబుతుంది. ఇదే లక్ష్యం ఇంచుమించుగా మృణాళినిలో కూడా కనిపిస్తుంది. కాని లలితంగా దెబ్బలు తిన్నవాడికి కూడా నవ్వొచ్చేలా. . . నిజమా. . . నేను కూడా ఇలాగే ఉన్నానేమో అని ప్రతి మగవాడికి అనిపించేలా మృణాళిని, కోమలి గాంధారంలోని కథలు వ్రాసింది. నిజానికి భానుమతీ రామకృష్ణ అత్తగారి కథల్లో అత్తగారితో కోమలి భర్త అనే ప్రతి మగవాడి పాత్రనీ పోల్చవచ్చును. ఈ రెండు పాత్రల శిల్పంలోను, మనస్తత్వాన్ని వర్ణించే, హాస్యశైలిలోను లోపాలు బలహీనతలను, నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికి అనుభవంలోకి వచ్చే చాలా అందమైన హాస్యంలో ఈ ఇద్దరినీ తులనాత్మకంగా చూడవచ్చును. కాకపోతే భానుమతి అత్తగారిలా అమాయకులు కాదు కోమలి భర్త.

భార్య ఉద్యోగిని అయితే భర్తల కాంప్లెక్సులు ఎంత చిత్రాతిచిత్రంగా ఉంటాయో మృణాళిని ఇలా చెబుతూ నేనింట్లో ఉన్నానని అనుకుంటే మీకొచ్చే తృప్తి ఏమిటి అంటుంది కోమలి.

"ఎందుకు లేదు. మా కొలీగ్స్ అందరికీ చెబుతాను కదా. నేనింటికి వెళ్ళేసరికి మా ఆవిడ కళ్ళు కాయలు కాచేలా నా కోసం ఎదురు చూస్తుందని. వాళ్ళందరి భార్యలు ఉద్యోగాలు చేస్తారు. నా భార్యే చెయ్యడం లేదని ఇన్నాళ్ళు కుళ్ళుకు చచ్చేవారు. ఇప్పుడు స్టేటస్ ఎంత దెబ్బతిన్నదో నీకేం తెలుసు? పాపం వీడూ మనలాంటివాడే

అని అందరూ జాలి పడుతున్నారు.

బాస్‌ని కాకా పట్టి ప్రమోషన్ తెచ్చుకుందామనుకుంటూ పదిమందిలో భార్య మీద బోలెడెంత ఆధిక్యం చూపించడం ద్వారా తన తెలివితేటలనీ సమర్థతని చూపించుకుందామనుకునే పురుష పుంగవుల కథ.

ఖరీదైన హొటల్లో భోజనం చేస్తున్నారు కోమలి, భర్తా, భర్త, బాసు, భార్య "కోమలి గారు. మీ ఇష్టం వచ్చింది. ఆర్డర్ చెయ్యండి" అంటూ మెనుకార్డ్ ఆమె వైపుకి తోశాడు బాసు.
కోమలి భర్త దాన్ని మధ్యలోనే ఆపాడు.

"అయ్యో పాపం మా కోమలికేం తెలుస్తాయండి. ఆవిడ ఎప్పుడైనా స్టార్ హొటల్‌కి వచ్చిందనుకున్నారా? 'నాన్' అంటే ప్రాచీన తెలుగు భాష అనుకుంటుంది. 'నవరతన్ కుర్మా' అంటూ నవరత్నాలుంటాయనుకుంటుంది పాపం. అమాయకురాలు, తన తరుపున కూడా నేను అర్డరిస్తా లెండి"

"కో.భ. ఆర్డరిచ్చాడు, బాసు భార్య కోమలి కేసి జాలిగా చూసింది.

"అరే, పాపం ఇదే మొదటిసారా? మీకీ డామ్‌లైట్ సాఫ్ట్ మ్యూజిక్ కొత్తగా ఉన్నాయేమో కదా" అంది.

"అందుకే చూడండి. ఎప్పుడూ బడబడ వాగుతుందా? ఇవాళ నోరు మెదపడం లేదు. మీ టేస్టుకు ఆవిడ నిర్ఘాంతపోయింది".

"అసలు మేం ఇంట్లో కూడా ఇలాంటి టేబుల్స్ పైనే ఇంటి ఫుడ్ తింటామనుకోండి. హొటల్ లాగా నీట్‌గా ఉండాలి. నాకు ఇల్లు" బాస్ అన్నాడు.

"నాకు మాత్రం ? కో.భ. అందుకున్నాడు. ఇల్లు నీట్‌గా లేకపోతే" చంపెయ్యానూ ! నేను ఆఫీసు నుంచి ఇంటికి వెళ్ళేసరికి ఇల్లు అద్దంలా ఉండాలి. నేల తళతళా మెరుస్తూండాలి. "మా ఇంట్లో అందరం నేలలోకి చూస్తూ జడ వేసుకుంటామండీ. బొట్టు కాటుకా ఫేసు సీలింగ్ చూస్తూ పెట్టుకుంటాం. ఇంట్లో అసలు అద్దాల్లేవు" కోమలి అంది.

## భానుమతి రామకృష్ణ అత్తగారి కథల్లో హాస్యం:

ఆంధ్రుల అత్తగారిపాత్రను ఒక సజీవ పాత్రగా డా. భానుమతీ రామకృష్ణగారు సృష్టించారు. నిజానికి నిత్య జీవితంలో అత్తగారు అంటే గయ్యాళి, కోపిష్టి అనో సాధింపులు, వేధింపులు అనో అనుకోవడం కద్దు. జనశ్రుతిలో వినిపించడమూ కద్దు. అందుకే సామెత కూడా ఉంది. అత్తలేని కోడలుత్తమురాలు, కోడలు లేని అత్త గుణవంతురాలు అని భానుమతిగారు అత్తగారి పాత్రని చాలా హృద్యంగా, ఇంతటి సాత్వికమైన మనిషి సృష్టిలో ఉంటుందా అనిపింపజేస్తూ సృష్టించింది. ఇది ఎంతటి విలక్షణమైన పాత్ర అంటే ఇందులో మంచితనం, బోళాతనం, కాస్త చాదస్తం కనిపిస్తాయి. తనకు లోకజ్ఞత చాలా ఎక్కువ అనుకుంటూ, లోకం గురించి తెలియని అమాయకత్వంతో సర్వవిధ సంప్రదాయాలూ తనకు చాలా పరిచయమే అనుకునే నమ్మకం ఆవిడలో కనిపిస్తుంది. ఇతరుల తప్పులని కూడా క్షమించేయగల శక్తి, తన తప్పు బయటపడ్డా గంభీరంగా చాటుకోగల నిబ్బరం ఈ అత్తగారికి ఉన్నాయి. అన్నింటికన్నా గమ్మత్తేమిటంటే ఈ పై లక్షణాలన్నింటినీ జీవితంలో జరిగే సన్నివేశాల్లో నుండి ఎంతో హాస్యంగా చమత్కారంగా వ్రాయడం భానుమతీ రామకృష్ణకే చెల్లింది.

ఈ అత్తగారు అన్నీ తెలుసుకునే ఏమి తెలియని మనిషి."ఆవకాయ పెట్టాలా. . . పెట్టేస్తేపోలా, నిమ్మకాయెంతో దబ్బకాయ అంతా" అది విన్న వారికి గుండెల్లో రైళ్ళు పరిగెత్తవచ్చు ఆవిడ మాత్రం చాలా నిబ్బరంగా ఉంటుంది. గొడ్ల విషయంలో నిశ్చితాభిప్రాయాలున్నాయి. గేదె ఎంతో ఆవూ అంతే. ఆవుకి మేత ఎంతో దానికీ అంతే. తన అభిప్రాయాల్లో ఎవరైనా సందేహాలు వెలిబుచ్చితే ఆవిడ పెద్దగా పట్టించుకోదు. "తనే తప్పేమో" కనీసం అనుమానం కూడా రాదు. వీశె కారం అయిదువేల మామిడికాయలకు సరిపోతుందా అని ఆవకాయ పెట్టేవారిని ఎవరైనా అడిగితే. . . ఆ. . . ఆ. . .ఉత్తరాది వాళ్ళ లాగా (మద్రాసు క్రింద అంతా ఆవిడకి ఉత్తరమే . . ) నేనంత కారం వేయనమ్మా. చాలకపోతే కాస్త తరవాత కలుపుకోవచ్చు అంటుంది. నన్నడిగితే ఉప్పెంతో కారం అంత. కారం ఎంతో ఆవపొడి అంత. అవన్నీ ఎంతో నూనె అంత అంటుంది. ఆవకాయ శాస్త్ర నిపుణురాలు అత్తగారు.

ఓసారి మా అత్తగారు ఆవుని కొనాలని సంకల్పించింది. ఆవిడకి నచ్చిన సర్వలక్షణాల ఆవు వెతికినా దొరకలేదు. దాన్ని కొనడానికి సీతాకోకచిలకల్లాంటి ఇద్దరు పెళ్ళాలున్న పాలవాడు ఓ మంచి సిస్టమ్ ఉన్న 23వ నెంబరు ఆవుని ఎంచుకుని తీసుకువస్తాడు. "ఇంతకీ ఆవెట్లా ఉందిరా" అని అడిగితే "నల్లపొడలు, తెల్లపొడలు ఎఱ్ఱ మచ్చలు అంటాడు. పసుపచ్చ గీరాలు, ఆకుపచ్చసోన, పొగాకురంకు సెవులు. బూడిదరంగు మొకం తోక అదోలాగ అమ్మగారూ" అంటాడు పాలవాడు.

ఓరీ నీతోక దొంగల్దోలా ! ఇన్ని రంగులుంటాయట్రా ఒక ఆవుకు అంటే. అయినా అది ఆవుగాదమ్మా పంచరంగుల సిలకంటే నమ్మండీ. . .పూటకి అయిదు మానికలిస్తుంది.

ఏమిట్రా పాలా ? పంచితమా ? అన్నది అత్తగారు. పాలేనమ్మగారూ. . . ఒక్కోగొడ్డుని రోజుకు అయిదారు సార్లు పిండుతారు. అంతా దొరల పద్ధతి గొడ్లు రూల్సు ప్రకారం ఇస్తాయి అంటాడు.

అత్తగారు శాస్త్రోక్తంగా ఇరవైమూడో నెంబరు ఆవుకి స్వాగతం చెప్పడానికి సిద్ధమయ్యేసరికి ఆకాశం దద్దరిల్లేలా మేరు పర్వతంలా ఓ బ్రహ్మాండమైన వృషభం వచ్చి నిలబడింది. ఇదంతా నెంబరు పొరబాటని తరువాత తెలుస్తుంది. గేదె అచ్చి రాలేదంటే మనకు ఆవు కూడా అచ్చిరాలేదని అత్తగారు నిట్టూర్పు విడిసింది.

అత్తగారు తిరుపతి వెళ్ళినప్పుడు ఆవిడ దిగదలచుకున్న శకుంతలా వాళ్ళిళ్ళూ సరోజా వాళ్ళిల్లు తాళం పెట్టి ఉండటాన్ని ఆవిడ తీరని పరాభవంగా భావిస్తుంది. తాను వద్దను కున్న తోడికోడలింటికి వెళ్ళటం అంతకంటే ఎక్కువ పరాభవం. వద్దనుకున్నా చిన్నప్పటి రోజుల ముచ్చట్లు రాకమానవు కాదా. . .మీ కోసం బస్సుకు పోబోతున్నాం అన్నది తోడికోడలు మా కాలంలో బస్సులు కాకపోతే కార్లక్కెడున్నాయి అన్నది అత్తగారు "మా పెద్దనాన్నకు కారుండేది" చిన్నప్పుడు కార్లోనే తిరిగే దాన్ని అన్నది తోడికోడలు మాకు పెద్దనాన్నల్లేరు కార్లు లేవు. మా నాన్న విషయంలో గుఱ్ఱపు బళ్ళల్లో వెళ్ళేవాళ్ళం. అన్నది అత్తగారు.

"ఆ. . . ఆ. . . కక్కి వాళ్ళ నాన్నకి గుఱ్ఱబండీ ఉండేదట ఆయన కాంపుకి వెళ్ళదానికి" కళ్ళతో గుడ్లురిమి చూశారు. మా బావగారు. మా తోడికోడలు నోరు,

ఆటో మేటిక్ సిస్టమ్‌లో పనిచేస్తుంది. ఆవిడ వద్దనుకున్నా ఆవిడ నోరు ఆవిడ కంట్రోల్లో ఉండదు.

"ఏమేనమ్మా నేనెన్నడూ గుర్రబ్బళ్ళు ఎక్కలేదూ బంటెద్దు బళ్ళు ఎక్కలేదు. ఇలా సంవాదం సాగిపోతుంది. ఆ తరువాత చిత్రాతిచిత్రంగా ఇద్దరినీ ఏ కాంతంగా వదిలేసినప్పుడు కలయో వైష్ణవ మాయయో అన్నట్లు "పొందత్తా" అంతే "ఛీ.ఫో.గాడిద" అనుకుంటూ కలిసిపోయి పెళ్ళి సంబంధాలు ఆఖరికి కట్నాలు లేకుండా మాట్లాడేసుకుంటారు. "ఔరా క్షణ క్షణములో జవరాంఢ్ర చిత్తముల్" అనిపిస్తారు.

ఓ సందర్భంలో అత్తగారికి వృద్ధాప్యంలో లంకెబిందెలు దొరుకుతాయని చిన్నప్పుడు ఎవరో జాతకం చెప్పారట. తనకి వృద్ధాప్యం వచ్చేసరికి తీర్మానించేసుకుని ఓసారి జాలీగా కొన్ని ఇంగ్లీష్ పదాలు కూడా ప్రయోగించి కాలగర్భంలో కలిసిపోవడానికి సిద్ధంగా ఉన్న కాగితం పట్టుకొచ్చింది. అందులో వయస్సు చెప్పలేదు కానీ లంకెబిందెలు దొరుకుతాయని ఉన్నది. కట్టించబోయే సొంత ఇంట్లో పూజా విగ్రహం నుండి తూర్పుకు ఇరవై గజాలు తప్పుకుంటూ పోతే అక్కడ నుండి దక్షిణం వైపుకి తిరిగి ముప్పయి గజాల దూరం మూడడుగుల లోతు తవ్వాలి. అలా వెళితే ప్రహరిగోడ ప్రక్కన నగలు ఖంగుమని తగులుతాయని చెప్పారు. మొత్తం దొరకబోయే నగల వివరాలు దొరికాయి. దీని ప్రకారం ఎవరికి ఎంతెంత ఇవ్వాలో తీర్మానించేశారు.

ఇంక తవ్వే కార్యక్రమాల్లో బోలెడు లంకెబిందెలు చప్పుళ్ళు లక్ష్మీదేవి గజ్జెల చప్పుళ్ళు వినిపించాయి. లంకెబిందెలు లేకపోయినా పాములు కుప్పలు కుప్పలుగా బయటపడ్డాయి. చివరికి ఓ నాగేంద్రుడి శిల దొరుకుతుంది. ఇలా అత్తగారు అష్టాధానాలు అంతరాత్మలు పర్సనాలిటీలతో ప్రతి విషయంలో జీవితంలో అణువణువునా హాస్యం ప్రభవిస్తుంది. భానుమతి కథల్లో ఈ అత్తగారిని ఆవిడ స్వభావాన్ని అందరూ ప్రేమిస్తారు. ఎన్నటికీ సజీవంగా నిలిచే పాత్ర అత్తగారు.

# 7

# పేరడీల్లో హాస్యం

సాహిత్యంలోని సౌందర్యాన్ని ఆస్వాదించి, దాని మాధుర్యాన్ని మళ్ళీ మళ్ళీ తలచుకునేటలా దాని తత్వాన్ని గమనాన్ని శైలిని తలపించేలా చేసిన రచన పేరడీ అవుతుంది. అనుకరణ పేరడీ కాకపోవచ్చు కాని మాతృక ఆకృతి, శిల్పం పాఠకుడికి స్ఫురించాలి. ఒక మాతృకకు అధిక్షేపాత్మకమైన హేళనాత్మకమైన, హాస్యాత్మకమైన విషయాంతరంతో కూడిన అనుకరణ పేరడీ అంతేకాని ఒక పద్యాన్ని కాని ఖండికని కాని అనుకరించినంత మాత్రాన అది పేరడీ అని తొందరపాటుతో తలపోయరాదు. (తెలుగు సాహిత్యంలో పేరడీలు డా. వెలుదండ నిత్యానందరావు) ఇన్ని ఆత్మలు ఇందులో ఉన్నా అసలు మాతృక ఆత్మ కనిపించకపోతే అది పేరడీ కాదు. పరిహాసదృష్టితో ప్రధానంగా పేరడీలు రచించబడూ మాతృక శిల్పశైలి కనిపించకపోతే కూడా అది పేరడీ కాదు.

ప్రిన్స్‌టిన్ విజ్ఞాన సర్వస్వం ఈ క్రింది గుణాలని పేరడీ చేస్తారని పేర్కొంది. 1. వ్యక్తిగత వైపరీత్యం 2. అహేతుక విశ్వాసం 3. శబ్దకాల్యం 4. నిస్తేజత 5. పటాటోపం 6. స్వీయోత్కర్ష.

విశ్వనాథ సత్యనారాయణ గారి హాస్యం చక్కగా చిక్కగా గిల్లుతూ గిలిగింతలు పెడుతూ చురుక్కుమనిపించే హాస్యం. పాండితీ ప్రకర్షగలిగిన వారిని తూర్పారబట్టేది.

సభల్లో సన్మానపత్రాల గోలను విశ్వనాథ వేయిపడగలను విష్ణుశర్మ ఇంగ్లీషు చదువులోను, నందిగ్రామ రాజ్యంలోను పేరడీ చేసి అధిక్షేపించాడు. 'నందిగ్రామ రాజ్యం'లో రావణవధ జరిగాక రాముడు అయోధ్యకు తిరిగి వస్తాడు. పట్టాభిషేకం చేసుకోవాలంటే చాలినన్ని నిధులుండవు. సుగ్రీవునకు సన్మానం చేసి 'మనీపర్సు' బహూకరిస్తే కొంత నిధి సమకూరుతుంది. దానితో శ్రీరాముని పట్టాభిషేకం

చేయవచ్చునని ఎవరో చెప్పిన ఆలోచన సుగ్రీవునకు సమర్పించిన సన్మానపత్రం ఇప్పుడు సభల్లో సమర్పిస్తున్న సన్మాన పత్రాలను స్మరింపచేస్తుంది. చూడండి.

నీవు వానర రాజ్యానికి పాలకుడవు. మహావీరుడవు. వానరసేనకు తరలించుకొని పోయి రాముడు రాక్షస సంహారం చేయుటకు సహాయపడినావు.

ఓయి సుగ్రీవా !

నీవు సంఘ సంస్కారివి. వాలి భార్యను విధవగా వుంచకుండా ఆవిడను కూడ రాణిని చేసి సంఘమున కెంతో మేలు చేశావు.

ఓ కపిలోక నాయకా !

నీకు సన్మానం చేయటం మాకు మేము సన్మానం చేసుకోవటమే. నీకు నిజానికి సన్మానాలక్కరలేదు నీవంత గొప్పవాడవు.

ఆంగ్ల సాహిత్య పరిచయానంతరమే పేరడీ ఒక ప్రక్రియగా తెలుగు సాహిత్యంలో స్థిరపడింది.

నవల, నాటకం, కథ, వ్యాసం మొదలైన గద్య ప్రక్రియలకన్నా పేరడీ రచయితల కవిత్వమే బాగా ఆకర్షించింది. కవిత్వానికి త్వరగా ఆకట్టుకునే లక్షణం ఉండటమే దీనికి హేతువు. జరుక్‌శాస్త్రి, మాచిరాజు దేవీప్రసాద్ పేరడీ కవిత్వానికి పర్యాయమై నిలిచారు. శ్రీశ్రీ మహాప్రస్థాన గీతాలు విరివిగా పేరడికి గురయ్యాయి. జరుక్‌శాస్త్రి, మాచిరాజు దేవిప్రసాద్, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మొదలైన వారెందరో ఆ గీతాలకు పేరడీలు రాశారు. శ్రీ'కాట్రగడ్డ' ఏకంగా ఆ గీతాలన్నింటిని పేరడీ చేస్తూ 'మహోగ్రతాపం' పేర ఒక పుస్తకాన్నే ప్రకటించాడు. దీనికి కారణం మహాప్రస్థానంలోని పద గతి ఆ వేగమేనని చెప్పవచ్చు. సుమతీ శతకం, కవి చౌడప్ప శతకం, భాగవతం పద్యాలకు వచ్చిన పేరడీలు కూడా పేర్కొనదగినవి. దైవస్తుతికే పరిమితమైన దండకాలు, సుప్రభాతాలకు విలోమ పేరడీలను సృష్టించి కవులు ఆనందించారు.

తెలుగులో పేరడీకి ప్రక్రియాపరంగా ప్రాచుర్యం కల్పించి సుస్థిర రూపకల్పన చేసింది జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి గారే. నాయని సుబ్బారావు, మల్లవరపు విశ్వేశ్వరరావు, శ్రీశ్రీ, విశ్వనాథ లాంటి సుప్రసిద్ధ కవుల రచనల తీరుతెన్నులను,

భావాల సొబగులను అకటావికటం గావించారు.

మహాకవి శ్రీశ్రీ కలంలో పేరడీ విశిష్టమైన పోకడలు పోయింది. సరికొత్త వయ్యారాలను సంతరించుకొంది. సిరిసిరిమువ్వల సవ్వడులు వినిపించింది. ప్రాస క్రీడలాడింది. పదవైచిత్రి, అర్థవైచిత్రి, హాస్యలాస్యం, అధిక్షేప విక్షేపం శ్రీశ్రీ విదూషక కవిత్వంలో అడుగడుగునా అలరిస్తాయి. ఆయన హాస్య కవిత్వమంతా 'సిప్రాలి' పేరుతో గ్రంథరూపంలో వచ్చింది.

నీకొక సిగరెట్టిస్తా
నాకొక శతకమ్ము రాసి నయముగ నిమ్మా
త్రైకాల్య స్థాయిగనీ
శ్రీకావ్యము వరలువోయి సిరిసిరి భాయీ.

గండపెండేరాలు అగ్రహారాలు ఆశించే కృతికర్తలను తమ మీద కవిత్వం వ్రాయించుకుని మీసం దువ్వే కృతి భర్తలని శ్రీశ్రీ వెక్కిరించాడు. శ్రీశ్రీ సిరిసిరిమువ్వలు ప్రాసకీడలు వీరు బుక్కులు కలిసి సిప్రాలి అయింది. 1981లో ఇది ప్రచురించబడింది.

పద్యాలు వ్రాయుడానికి వయసుండొద్దా అని రసజ్ఞుడు శ్రీశ్రీ చమత్కరించాడు.

మళ్ళీ ఇన్నాళ్ళకి ఇ
న్నేళ్ళకి పద్యాలు రాయుటిది మెట్లన్నన్
పళ్ళూడిన ముసలిది కు
చ్చిళ్ళను సవరించినట్లు సిరి సిరిమువ్వా.

శ్రీశ్రీనీ శ్రీస్కీ అని చమత్కరించే వారున్నారు ఆయన ఉప్పు కప్పురంబు ఒకటే కాదనే భావంతో

మీసాలకు రంగేదో
వేసేస్తే యౌవనం లభించదు నిజమే
సీసా లేబిల్ మార్చే
స్తే సారా బ్రాందీ యగునె సిరిసిరిమువ్వా.

ఇది విదూషక కవితావనికి పేరడీ.

సుమతీ శతకానికి పేరడీ వ్రాస్తూ ఈనాడు ఏవి ఊళ్ళో ఉంటే ఆ ఊళ్ళోనే ఉండాలంటూ ఆయా వస్తువులు వస్తు నిర్దేశం చేశాడు. అప్పిచ్చువాడు వైద్యుడు ఏరు కాదు. కాఫీ లేకపోతే మానవులందరికీ ఈనాడు కాలు కదలదు.

ఎప్పుడు అడిగిన అప్పుడు
కప్పెడు కాఫీ నొసంగగలిగెడు సుజనుల్
చొప్పడిన యూరనుండుము
చొప్పడకున్నట్టి యూర చొరుము ముప్పా. అన్నా

అక్కరకు రాని కారును
మ్రొక్కిన పెడజూచు బాసు, మోహమునదా
నెక్కిన ప్లేనును
గ్రక్కున విడువంగ వలయు గదరా సుమతీ
అనాడు ఓ అజ్ఞాత కవి

అక్కరకు రాని బస్సును
చక్కగా సినిమాకు రాక సణగెడు భార్యన్
ఉక్కగ డెదు ఇంటిని
గ్రుక్కున విడువంగ వలయు గదరా సుమతీ.

(మన హాస్యంలో పేర్కొనబడిన అజ్ఞాత కవి)

పులికొండ సుబ్బాచారి వ్రాసిన పేరడీ పద్యాలు సాధన పత్రికలో సీరియల్‌గా వచ్చాయి. ఎక్కువగా భాగవతం పద్యాలకు కవి చౌదప్ప సుమతి శతక పద్యాలకు ఆయన పేరడీల వ్రాశారు.

నీతులకేమి యొకించుక
బూతుండని ఫిల్ములిపుడు బోరందురుగా
ప్రీతిగ వీటిని జూతురు
ఖ్యాతిగ నో కుందవరపు కవి చౌడప్పా అన్నాడు.
నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని భాగవత పద్యానికి పేరడీ ఇది.

కలదందురు మంజీరలో
కలదందురు గండిపేట కాలువలందున్
కొందందురు పంపులలో
కలదు కలందనెడు నీరు కలదో లేదో.

నేటి ఇల్లాలి విశ్వరూపానికి చక్కని భాగవత పద్య పేరడీ ఇంతింతై వధు వింతయై గృహమునందింతయై స్వయం వీధిలో నంతై గ్రామ సభా విభాగమున కల్లంతై స్వతాలుకపై నంతై మండలమంతయై మరియు కావాంధ్రప్రదేశమ్ముపై నంతై భారతదేశమంతయు బ్రహ్మాండాంత సంవర్థియై అలా–

డా. వెలుదండి నిత్యానందరావుగారి పేరడీలు భాగవతం పద్యాలను ఆధునిక రాజకీయాలకు అన్వయించి వ్రాసిన పేరడీలు ఆంధ్రప్రభ దినపత్రికలో కార్టూన్‌లతో సీరియల్‌గా పక్షం రోజులకు పైగా వచ్చాయి.

వారి జాక్షులందు వైవాహికములందు అవీ భాగవత పద్యానికి

పదవి వచ్చువేళ పదవి పోయెడు వేళ
ప్రాణమైన పదవి భంగమందు
కూడబెట్టినట్టి కోట్ల రక్షణ మందు
బొంకవచ్చు నఘము పొందద ధిద   అన్నాడు.

ఆయన తనని తాను విమర్శించుకుంటూ చాలా నిజాయితీగా భావపునరుక్తి దోషానికి పాల్పడ్డానని వ్రాసుకున్నారు. నిజానికి భావపునరుక్తం కాలేదు. పదవి పోవడానికి, భంగానికీ బోలెడండత తేడా లేదూ !! రసజ్ఞులు అన్వయం చేసుకుంటే భావం ద్విగిణీకృతమవుతుంది.

శ్రీశ్రీ మహాప్రస్థానంలోని

పొలాలదున్నీ
హలాలదున్నీ
ఇలాతలంలో హేమం పడగ
జగానికంతా సౌఖ్యం నిండగ అనే గేయాన్ని

జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ఇలా వ్రాశారు.

అవాకులన్నీ
చవాకులన్నీ
మహారచనలై మహిలో నిండగ
ఎగబడి చదివే పాఠకులుండగ
విరామమెరుగక పరిశ్రమిస్తూ
అహోరాత్రులూ అవేరచిస్తూ
ప్రసిద్ధికెక్కే కవి పుంగవులకు
వారికి జరిపే సమ్ మానాలకు
బిరుదల మాలకు
దుశ్శాలువలకు
కరతాళాలకు ఖరీదు లేదేయ్.

జలసూత్రం రుక్మిణీనాధశాస్త్రి గారి పేరిట జరుక్‌శాస్త్రి పేరడీలు సాహిత్యంలో చాలా ప్రసిద్ధి కెక్కారు ఈ ప్రక్రియకి ప్రాచుర్యం సుస్థిర రూపకల్పన చేసింది. ఆయనే జరుక్‌శాస్త్రి విశ్వనాధ మీద చెప్పిన పేరడీ.

శ్రీకావ్యాత్తే రసప్రపీథులు సితశ్రీ శ్శ్యేష్ఠ కాష్ఠాయిత
వ్యాకృత్ ప్రాక్తన సామిధేని జ్వలన వ్యాలోల ధూమచ్ఛటా
చ్ఛేక ప్రాభవ జంఖనీకృత సురజ్యేష్ఠాది వాసాధికత్
బ్రేకుల్ లేని కవీ గలీద్య తతికిన్ భీతార్తి కేల్మోడ్చిదన్.

దేవులపల్లి కృష్ణశాస్త్రి "తొలి వియోగిని నేనే తొలి ప్రేయసిని నేనే" అని సాగే ప్రసిద్ధ ఖండికని హేళనాత్మకంగా అనుసరించాడు.

విరహం విశ్వముగా బేల కార్చిచ్చుగా
నుసిగా పలకరించి పసిమిగా పులకరించి
తులసి మొక్కను నేనే
తురక వేపను నేనే
ఆనాటి కీనాటి
నేను మృత్కణ మేను (జరుక్‌శాస్త్రి పేరడీలు)

శ్రీశ్రీ కవితలోని ఉద్వేగ గాంభీర్యాలది విపద్యయు చేస్తూ జరుక్‌శాస్త్రి సరదాగా వ్రాశాడు.

మాగాయీ కంది పచ్చడి
ఆవకాయా పెసరప్పడమూ
తెగిపోయిన పాత చెప్పులు
పిచ్చొడి ప్రేలాపం, కోసం
వైజాగులో కారాకిల్లీ
సామానోయ్ సరదా పాటకి

నేను సైతం కిల్లీ కొట్లో పాత బాకీ లెగరగొట్టాను.
నేను సైతం జనాభాలో సంఖ్య నొక్కటి వృద్ధి చేశాను.

మాచిరాజు దేవీప్రసాద్ కూడా శ్రీశ్రీకి పేరడీ చెప్పారు.

లారీరాజం భారీ బస్సు
రోడ్డు రోలర్ బ్రెన్‌గనా కారీర్
ట్రాంకారు సమైతేనేం
ఒత్తేయును టూత్పేస్టుల ట్యూబల్లే.

శ్రీరమణగారి పేరడీల్లో సాహితీ ప్రముఖులందరూ కనిపిస్తారు. విశ్వనాధ ఆత్మని శ్రీరమణ ఇలా వ్యవస్థాపించారు.

సర్వశ్రీ గారి గ్రంధమును ఔచితిని, చదివితిని, నా వద్దకు బరిచయ వాక్యముల నర్చించుచు వచ్చెడి. వారి సంఖ్య యధికము బహుళః నేడాంధ్ర దేశబున నాకు గల పేరు ప్రతిష్ఠలు అందుకు కారణముగావచ్చును.

వెలనాటి బ్రహ్మణులలో కొందరు మంచి కవులు వున్నారు వీరి తండ్రి గారిని నే నెరుగుదును, ఆ మొగమాటము, చేతన్ కాదనలేకపోతిని ఆయన అవధానములు చేసేడివారు మంచి ధారాశుద్ధి యున్నది. కనుక వీరు బండిత పుత్రులు.

సర్వశ్రీ అనునది వీరి అజ్ఞాత నామము, జ్ఞాత నాయమము వేరుగా యున్నది. దానిలో మనకు బనిలేదు. వీరి గ్రంధములో ఛందోబద్ధమైన, పద్యములు కానుపించవు,

పద్యమనగా నేమి? అదిగణయతి ప్రాసలు చేతనిబద్ధమైన యొక ఛంద: ఖండము అందు భావము నిక్షిప్తము కావలె అందు కొన్ని వాక్యములుండును వాక్యమునందు. శబ్ద ములుండును, అచ్చలము, హల్లులయ కూడిన శబ్దము, మేము నిబద్ధలము కావలి, ఆనబద్ధులమని కొందరు ప్రతిభావంతులు ప్రేలుచున్నారు. ఇట్టి వారికి బఠితల సంఖ్య శాదధికముగన్ యున్నవి. కావనన్ దేశమునకీ దుర్యోగము పట్టినది.

వీరికి రాదగిన కీర్తి పరమేశ్వరుడు తెచ్చునుగాక !

విశ్వనాధ వ్రాస్తే ఇలా ప్రేమలేఖ ఇలా ఉంటుందిట. ఓ కాలేజీ స్టైల్‌లో ఉన్న ముద్దుగుమ్మకి ఈ ఉత్తరం అందితే-

బాలామణి !

అశీ:

నిన్ను జొచితిని తదాది ఆలోచనలన్నియు నీ చుట్టూ పరిభ్రయించును. వదలి వచ్చుట కవి మొరాయించున్నది. నా వంటి వాని మనస్సు సైతము బంతీకృతమొనర్చిన నీదగురూప లావణ్యములు అసామాన్యమే అయి వుండవలె.

మునుపే సరస్వతి నన్ను వరించెననుటలోకి విచితము అందులకే ఎందరు. ఈర్ష్య ఒడిలో, ఒడుతుండిలో అది వేరు విషయము, నేటి వరకు రస భంగం కలగకుండ నెహోకాలము వెళ్ళదీయుచుంటిని సరస్వతికి రసభంగము వాటిల్లిన 'సవతి' యగము కదా ! సవతిపాడు. కొని తెచ్చుకొనుటకు యే పురుషుడు మాత్రమే ఇచ్చగించును? నేను వెర్రివాడను కాను సాహిత్యమున సముద్రంలాంటి వాడనని లోకము అంగీకరించిననూ లేకున్నరూ నేను భావింతును, ఈవు కిన్నెరసానివి. ఇక, నేమి గావలె.

నా మనము నీపై నిడుట నీయదృష్టము కుంకుమ శోభితమైన నీ నొసట. . . కుంకముయునిగ జ్ఞప్తికి వచ్చును. కాశ్మీరు దేశము. కుంకుమ పూలకు ప్రసిద్ధి పుప్పొదులు తెమ్మరలపై దేలుచూ అరణోదయ యేధియా ! మధ్యాహ్న యెదియో పసిగట్టనలవి గాకుండ సేయును, కుయ్ యెను శబ్దము జేయుచు ఆ మొగ్గలు విచ్చుకొనును. అందుకే యది కుంకము యైనది. కాశ్మీరు కుంకమలో పదియారు. వన్నెలున్నవి. వన్నెకొక ప్రత్యేకత గలదు. . .

(ఇలాసాగే వీరి ప్రేమలేఖకు జవాబు వస్తుందంటారా ?)

కాసుల పురుషోత్తమ కవిదే అత్యంత అధిక్షేపమనుకుంటే ఆయనకి పేరడి శ్రీ ఇలపావులూరి సుబ్బారావు వ్రాశారు.

ఆలు నిర్వాహకురాలు భూదేవియై
అఖిల భారకుడన్న నాఖ్య దెచ్చె

అనే పద్యానికి వైద్యులపై పేరడీ ఇలా వ్రాశారు.

చెవుల స్టెతస్కోపు చెప్పి గుండియబీటు
హార్టు స్పెషలిస్టను వాఖ్య దెచ్చె
జ్వరమాని దేహాన వరలు నుష్ణత దెల్పి
ఫీవర్ల వైద్యుడన్ పేరు దెచ్చె
బీపీని తెలియజెప్పెడి సాధనము నీకు
రక్త పోటెరిగిడి శక్తి నిచ్చె
ఎక్కుసరే విరిగిన యెముకలు చూపించ
బోన్స్ స్పెషలిస్టుగా పొగడబడితి
వంతె యిసుమంత యెఱుగవు సుంతయేని
అమ్మలెవరును చదువంగ నలవి కాని
లిపి దివ్యౌషధముల పేర్లెల్లి వ్రాసి
వ్యాధి కుదిరింతు వయ్యయ్యో వైద్య విద్య.

జానపదగేయాల్లో హాస్యం:

జానపదగేయాల్లో ఎక్కడా మొహమాటం అరమరికలు లేని సహజమైన సరళమైన కుటుంబ జీవితంలోని హాస్యం కనిపిస్తుంది. వీటికి సాహితీ కట్టుబాట్లు నియమాలు సాంప్రదాయిక మర్యాదలు సరిహద్దులు ఉండవు.

బావామరదుల వికటాలు, వదిని మరదళ్ళ వేళాకోళాలు, ఇంట్లో సరాగాలు,

నీలాటి రేవులో పరాచకాలు, నలుగుల పాటలు, నాగవల్లి పాటలు, అల్లుడి మీద పాటలు, అత్తగారి మీద పాటలు, అలకపాన్పు దగ్గరి పాటలు, తలుపు దగ్గర పాటలు, తగవుల పాటలు, వియ్యపురాలి మీద పాటలు, విందుల పాటలు మొదలైనవెన్నో జానపదుల హాస్యపు పాటలు. అనివార్యమైన ఆధునిక నాగరికతా భూతోచ్చాటనతో జీవించడానికే తీరికలేని నేటి మానవుడు ఆనందించే ప్రవృత్తిని, పాటలు పాడి పరవశించే తీరికకు, ఓపికను కోల్పోయాడు. జీవితంలో అంతటా ప్రవేశించిన 'కల్తీతనం' జానపద గీతాల్లోను ప్రవేశించింది. ఆధునిక చదువులు, నాగరికత వంట బట్టని ముందు తరం ముసలాళ్ళు కొంత మంది దగ్గర జానపదం మూలధనంగా ఉండిపోయింది.

అప్పగింతల్లో అమ్మాయికి కాపరం ఎలా చేయాలో భర్తని ఎలా అదుపు ఆజ్ఞల్లో పెట్టుకోవాలో ఉపదేశిస్తున్నారు.

అత్తమామలు గాని ఆడుబొట్టెలు గాని
లేరమ్మ నీదెంత పుణ్యమోగాని
మగడొక్కడేగాన మనసు కెక్కినయట్లు
మర్దించి నీ వశము చేసికోవమ్మా
నీ మాట వినబడ్డ నిమిషంబు నందు
అదలి పోయేటట్లు అతని భయపెట్టు
పతి కోపపడినప్పుడు పడియుండబోక
అంతకు పదిరెట్లు అతని మర్దించు
ఇరుగు పొరుగువారలేమైన అంటే
యేడ్వక వేయిరెట్లు దుమ్మెత్తిపోయి
భర్తను వంచుకోగల భార్య గౌరవమెన్న
రారాజునకునైన రమణిరా లేదు
ఇవి యెల్ల మరువక ఏ మాత్ర మలియక
సుఖపడుచుండుమో సొగసు పూదీవ.

# 8

# హాస్య పరిణామం

యుగయుగాలుగా హాస్యాన్ని నవరసాల్లో ఒక రసంగా పేర్కొన్నా ,అది ఆధునిక యుగం వరకు ఒక సస్థితి రూపంలో ఆవిష్కరించబడలేదు. భావాదుల పరిపుష్టి, చిత్తద్రవీకరణ, తాదాత్మ్యస్థితి కలిగినప్పుడే ఒక రసం ఆవిష్కరించబడుతుందనే విషయం అందరికీ తెలిసినదే. ఈ లక్షణాలు లేనిదే అది ఒక రసం కాలేదు. దానికి ఆ అర్హత యోగ్యత ఉండదు. అది కేవలం ఒక సంచారీ భావంగానో లేదా ఏదో ఒక మనోవికారంగానే మిగిలిపోతుంది. హాస్యం ఒక రసమని ధృవీకరించబడిన మాట నిర్వివాదాంశం. ఇదే నిజమయినా, ప్రాచీన సాహిత్యంలో మరే రసానికి లేని ఉపేక్షతస్థితి ఒక హాస్యానికే సంప్రాప్తించింది. నవరసాల్లో ఏ రసమూ ఆభాసరూపం కాదు. లాక్షణికుల సిద్ధాంతాల్లో హాస్య నిర్వచనాలు అత్యంత దయనీయ అభివర్ణించబడినాయి హాస్యం ఆకార వేషాభాషా చేష్టాగత వికృత వికార రూపం ధరించింది.

మరికొందరు ఇంకా ముందుకి వెళ్ళి హాస్యమంటేనే ఒక అభాస రూపం. మిగిలిన హాస్యం కూడా రసాల్లా క్రమ క్రమానుగత భావపరిపుష్టి వలన సిద్ధించే ఒక రసమే అన్న విషయాల వేయి సంవత్సరాల పరిణామ రూపంలో క్రమానుగతంగా ధృవపడింది. ఈ రోజుల్లో హాస్యం ఒక రసంగా సంపూర్ణంగా ఆవిష్కరించబడింది. అంటే ఏ ఒక్కరికీ అభ్యంతరం ఉండదు. దానిని ఒక సహజ స్థితిగా కూడా చూస్తున్నారు. దశవిధ రూపకాలు సంస్కృతిక కావ్యాలు నాటకాల్లో విదూషక పాత్రలు తిండిపోతు తనం అసందర్భ ప్రేలాపనతో మోటుగా వికారంగా ప్రారంభమైన హాస్య స్వరూపాన్ని మారిస్తే దాని నిర్వచనానికి భంగం కలుగుతుందని భావించారు. కాబోలు తత్స్వరూపాన్నే తెలుగుకవులు కూడా అందించారు. పరిహాసాలకు వేళాకోళాలకు వినోదాలకు చమత్కారాలకు వక్రోక్తులకు శ్లేషలకు ధ్వనికి పర్యాయపదంగా నిలిచిన

హాస్యం ప్రతి కావ్యంలోనూ ఒక క్షణికమైన స్థితిగా నిలిచిందే తప్ప అంగిరసంగా అంటే ప్రధానరసంగా ఎవరి చేత స్వీకరించబడలేదు.

హాస్యం యొక్క ప్రాధాన్యాన్ని దాని స్వభావం కావచిత్తుగా కవిత్రయం యుగంలో కనబడితే కురవంజి శ్రీనాథుడు, ఇతర చాటు పద్యాల్లోనూ రాయల యుగంలోను కొంత ప్రాచుర్యాన్ని సంపాదించుకుంది. తెనాలిరామకృష్ణుడి ద్వారా ఈ రోజుల్లో కూడా ప్రజల్లో వ్యాపించి వినిపించేటంత కీర్తిని స్థానాన్ని సంపాదించుకుంది. ప్రజల జీవితంలోని సరసాలు వేళాకోళాలు పరిహాసాలు వెక్కిలింతలు పద్యరూపంలో ఇలా ప్రచారంలోకి వచ్చాయే తప్ప అప్పుడు కూడా పెద్దగా చెప్పుకోదగిన గౌరవం హాస్యానికి లభించలేదు.

అన్నమయ్యతో ప్రారంభమైన సంగీతసాహిత్య ప్రక్రియల ద్వారా హాస్యం కొంత విలక్షణరూపం ధరించింది. కూచిపూడి భాగవతులు పగటివేషాలు కురవంజి పౌరాణిక ఆభాస రూపకాలను ఆడుతూ పాడుతూ వివిధ హాస్యాలను అందించారు. అప్పుడు కూడా హాస్యం ఆయా ప్రక్రియల స్వరూపమంతటా వ్యాపించలేదు. పైగా హాస్యం కొన్ని స్త్రీ పురుష పాత్రలకే పరిమితమయింది. బొమ్మలాటలు, కీలుబొమ్మలు, ఛాయాచిత్రాల ప్రదర్శనల్లో మౌఖికంగా హాస్యం సృష్టించబడింది. శిష్టసాహిత్యానికి ఉన్న పరిమితులు దేశి కవితలపై లేదు కాబట్టి జానపదకవి చాలా హాయిగా మంచి హాస్యాన్ని అందించాడు. ఏ పాత్ర అయినా స్వేచ్ఛగా మనసులో భావాన్ని ఆహ్లాదంగా ఆనందంగా చెప్పుకోగలగడం కనిపిస్తుంది. అప్పుడు హాస్యం కూడా ఒక్క పాత్రకే పరిమితం కాలేదు. జీవిత ఉన్న హాస్యం అంతా నిర్మలంగా కల్లా కపటం లేకుండా మొదటిసారిగా వెలికి వచ్చింది. బావమరదళ్ళు, అత్తాకోడళ్ళు, బావబావమరుదులు, మామా అల్లుళ్ళు అన్ని వావి వరసలతో హాస్యాన్ని పండించారు.

ఆధునికయుగంలో పాశ్చాత్య భాషల్లోని సాహిత్య ప్రక్రియల ప్రభావంతో మనకి తెలుగు వ్యాసం నవల కథ జీవితచరిత్ర. సృష్టించబడినాయి. సంస్కృత నాటక ప్రభావం, ముద్ర తొలిగి, తెలుగు నాటకం ఇంగ్లీషు నాటకపు సొగసులు కథనం సామాజిక స్పర్శలను స్వీకరించింది. ఈ ముద్ర అన్ని ప్రక్రియలపైన పడింది. సాహిత్య ప్రయోజనం కోసం కాక సామాజిక ప్రయోజనం కోసం వ్రాయడమే ఆధునికమైతే,

అవి హాస్య ప్రధానాలు కావడం మరీ ఆధునికం.

నవలల్లో ఆద్యంతం హాస్య ప్రధానమని సంపూర్ణంగా చెప్పుకోకపోయినా వ్యంగ్యం అధిక్షేపంతో సామాజికంగా ఆనాటి స్త్రీ స్థితిగతులను దర్శింపజేస్తూ కందుకూరి వీరేశలింగం గారు సత్యరాజా పూర్వదేశయాత్రలనే హాస్య నవలని గలివర్ ట్రావెల్స్ ఆధారంగా భారతీయ సంస్కృతీ నేపథ్యంలో రచించారు. ఇది సంపూర్ణమైన హాస్యం కాదని కొందరు విమర్శించినా ఒక ప్రక్రియ ఆద్యంతం అంగిరసంగా హాస్యం భిన్న రూపాలతో కనిపించే తొలి సాహితీ ప్రక్రియా రూపం మాత్రం ఈ నవలే. స్త్రీలు ఆ రోజుల్లో పడే బాధలన్నీ పురుషులకు ఆపాదిస్తూ రచింపబడిన నవల. సత్యరాజాచార్యులు హాస్యం పండించిన నవలా నాయకుడు.

నాటక లక్షణాల ముద్రని విడిపించుకుని సర్వాంగీణమైన హాస్యంతో కన్యాశుల్కాన్ని గురజాత అప్పారావుగారు రూపొందించారు. నాయక ప్రతినాయక రూపాలు రెండూ గిరీశానివే. ఇతడి ప్రవృత్తి మోసగించడం సంఘం మీద పడి బ్రతికేయడమే. అతడెక్కడ ఉన్నా అతడి గిరిశానికి ఎక్కడా ఏ లోటూ ఉండదు. హాస్యం వ్యంగ్యాలు ప్రచండంగా నిండిన పాత్ర ఇది. కన్యాశుల్కమనే సామాజిక దురాచార ఇతివృత్తంతో రచించబడినా పాత్రచిత్రణ భాషలో శైలిలో భిన్న మనస్తత్వాల నిరూపణలో సామాజిక జీవిత దృశ్య నిరూపణలో హాస్యం వికాసవంతమయింది. నూట పాతికేళ్ళు దాటినా కన్యాశుల్కం ప్రజల నాలుకలపై నిలిచి అద్వితీయ హాస్య నాటకంగా ప్రకాశిస్తున్నది. మిగిలిన నాటకాల్లో అక్కడక్కడ హాస్యం కనబడుతుంది. కన్యాశుల్కంలో హాస్యం అధిక్షేపం వ్యంగ్యం కనిపించినా హాస్యమే ప్రధానంగా రాజ్యమేలుతుంది.

ఈ ముద్రతోనే కొంత నడిచినా హాస్యం మరికొంత లలితమై అధిక్షేపాలు వ్యంగ్యాలు తిట్లు శాపనార్థాలు తగ్గి ఒక హాస్య పాత్ర నవలా నాయకుడు కావడం తెలుగు సాహిత్యంలో ప్రప్రథమంగా చిలకమర్తి వారి గణపతితోనే జరిగింది. ఇందులో హాస్యం ఎందుకు లేదో పనిగట్టుకు చెప్పినవారున్నారు. ఏది ఏమైనా తొలి హాస్యనాయకుడు సూపర్ స్టార్‌గా గణపతిని అందరూ అంగీకరించారు.

కందుకూరి వీరేశలింగంపంతులుగారు, చిలకమర్తి లక్ష్మీనరసింహారావుగారు తమ ప్రక్రియలన్నింటిలోనూ ముఖ్యంగా వినోదాలు ప్రహసనాల్లో తెలుగువారి

ఇంటింటి కథలని సామాజిక సమస్యలని వ్యసనాలనీ, బలహీనతలనీ, తూర్పారబడుతూ మంచి హాస్యాన్నే అందించారు. కాళ్ళకూరి నారాయణరావుగారు వీరికి తోడయినారు.కాకపోతే ఇందులో కూడా వ్యంగ్య ప్రధానాలే ఎక్కువ. వైదికాచారాలు కన్యాశుల్కాలు పెళ్ళిళ్ళు వేశ్యా ప్రియత్వం మధుసేవలు వరవిక్రయాలు అధికంగా కనిపించాయి. పానుగంటి లక్ష్మీనరసింహరావుగారి ప్రవేశంతో హాస్యమనే కత్తికి రెండు వైపులా పదునెక్కింది. స్పెక్టేటర్ ప్రభావంతో సాక్షి వ్యాసపరంపర ప్రారంభమై భారతీయ సంస్కృతిలో క్షీణిస్తున్న విలువలు నిత్యజీవితంలోని క్రమశిక్షణా రాహిత్యంపైన అధిక్షేపరూపంలో ఆయన హాస్యాన్ని అందిస్తూ విరుచుకుపడ్డారు. కంఠాభరణం సంపూర్ణమైన హాస్యనాటకం. వైదికాచారాలు మూర్ఖత్వం నేపథ్యంలో బాల్యవివాహాలు శ్రాద్ధ తంతుకున్న ప్రాధాన్యంతో పానుగంటివారు లలితమైన హాస్యాన్నే అందించారు.

భమిడిపాటి కామేశ్వరరావు, మునిమాణిక్యం నరసింహరావుగారి ప్రవేశంతో కథాల్లో హాస్యవిష్కరణ ప్రారంభమయింది. దాంపత్యజీవితం అత్యంత మనోహరంగా రంగరించబడి మనకి అందుతుంది. కొడవటిగంటి కుటుంబరావు, రావిశాస్త్రి, బీనాదేవి రచనలు హాస్యస్వరూప వైలక్షణ్య పరిధిని విస్తృతం చేశాయి. హాస్యం అంటే కేవలం ఓ క్షణం నవ్వుకోవడమే అంతకిమించి ఏ ప్రయోజనం లేదు అనుకునే రోజులు పోయాయి. సామాజిక స్థితిగతుల్లో వచ్చిన మార్పులు సామాజిన్న కొందరు ఎన్ని రీతుల్లో దోచుకుంటున్నారో చెప్పే కథనంతో ఈ నవలల్లో కథల్లో ఈ నిరూపిస్తు వ్యంగ్య అధిక్షేపరూపంలో హాస్యాన్ని పండించారు. వీరికి హాస్య రచయితల ముద్ర ఎవరూ వేయలేదు. కొన్ని స్వీట్లు రూపాలు మార్చుకుంటే, వాటిని ఆస్వాదించి ఆనందదుతున్నా, వాటిని "స్వీటు" అని పిలవాలని తోచడానికి కొంత కాలం పడుతుందేమో ఆకార వేషా చేష్టా భాష గత హాస్య రూపంలో ఎన్నో మార్పులు వచ్చాయి.

అన్ని ప్రక్రియల్లోను ఇతివృత్త నిర్వహణలో కథనంలో సంభాషణల్లో వర్ణనల్లో వ్యాఖ్యానంలో వాక్య నిర్మాణంలో శైలిలో హాస్యం క్రొత్త అందాలు సంతరించుకుంది. ప్రేలాపనలు వికటకవిత్వం, శృంగారాభాసం పరిణామం చెంది మధురమైన రూపంతో

ఆధునిక సాహిత్యంలో కనిపించింది. ప్రేమకథల పర్వం ప్రారంభమయింది. ధీరోదాత్త ధీరోద్ధత ధీరశాంత ధీరలలిత నాయకులు మాత్రమే కాక సామాన్యుడు కూడా అన్ని ప్రక్రియల్లోనూ నాయకుడయ్యాడు. దానికి తగినట్లుగా హాస్యం విదూషక పాత్రకి పరిమితం కాకుండా నాయికా నాయక ప్రతి నాయకాది సర్వవిధ పాత్రల్లోనూ ప్రవేశించింది.

స్త్రీపురుష సంబంధాలు మానవతా వాదం, అనేక ఇజాలు సాహిత్యంలో ప్రవేశించాయి

ఇవన్నీ హాస్యరూపంలో ప్రతిఫలించాయి.

బాపురమణల ప్రవేశం హాస్యయుగంలో ఓ బ్రహ్మాండమైన మలుపు. బుడుగులు సీగాన పెసూనాంబలు రాధాగోపాలాలు మన జీవితాల్లో నుండి సాహిత్యంలో ప్రవేశించారు. వీరి భాషా నవ్యత్వం హాస్యంలోకనిపించి ఆద్యంతం హాస్యం ఒక రూపంగా ఆవిష్కరించబడింది. బాపుగారి పేరు హాస్యంలో చెప్పకపోతే ఆధునిక హాస్యంలో 'హా' అనే అక్షరమే మాయమైనట్లుంటుంది. బాపు కార్టూన్లు చిత్రాలు ప్రపంచఖ్యాతిని ఆర్జించాయి. బాపురమణల్లో ఎవరిలో ఎవరు ఉన్నారో చెప్పడం కష్టం. ఓసారి ముళ్ళపూడి 'నాగానందం' చెబుతూ ఈ పాముతోకని ఆ పాము మింగింది. ఆ పాము తోకని ఈ పాముని మింగింది. కాసేపటికి రెండు పాములూ మాయమై పోయాయి. ఎందుకంటే ఈ పాము కడుపులో ఆ పాముంది. ఆ పాము కడుపులో ఈ పాముంది అన్నారు. నిజం అనిపించటం లేదూ. బాపురమణల విషయంలో ఇదే నిజం. బాపులో రమణ ఉన్నాడు, రమణలో బాపున్నాడు.

నిత్యజీవితంలో ఎనిమిది రసాలకి స్థాయిభావాలు ప్రతి క్షణం అనుభవంలోకిరావు. హాస్యం కోసమే ప్రపంచం అంతా ఎదురు చూస్తుంది. చిరువ్వులతో జీవితం గడపాలని కోరుకుంటుంది. వయోభేదాలు స్థితిగతులు దేశకాల పాత్రాదులు అనేవి ఏవీ పరిగణనలోకి తీసుకోకుండా హాస్యరస వృక్షానికి ఎన్నో కొమ్మల ప్రక్రియలు పెరిగాయి. కాలమ్స్ పేరడిల్లో హాస్యం కూడా చేరింది. అన్నీ ద్రాక్షపాకాలు కలిగిన ఫలాలే. హాస్యం సంపూర్ణ రసస్వరూప స్థితిని సంతరించుకుంది.

సర్వలక్షణ సుశోభితం ఆలోచనామృతం అయింది. ఆ పాత మధురం అయింది. ఇప్పుడు హాస్య మేవ ఏకోరస: అని ఎవరైనా అంటే (పోనీమనమే అనేద్దాం) అలాక్షణికుల సంగతి తెలియదు కాని మనమందరం ఒప్పేసుకుని నవ్వుల్లో వియాడుదాం.

ఆధునిక యుగంలో హాస్యనాటికలు విస్తృతంగా రచించబడటంతోబాటు ఇవి కథానికలపైన కూడా తీవ్ర ముద్ర వేశాయి. సీసగర్భ కందంలా కథానికాశిల్పంలో నాటిక శిల్పం ప్రవేశించింది. కథలో కథనం, వ్యాఖ్యానం తగ్గి రచనలో హాస్యం శ్రవ్యం నుండి దృశ్యానికి మళ్ళింది. యర్రంశెట్టిశాయి, శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి మొదలైనవారి నవలను  దీనికి ప్రముఖంగా పేర్కొనవచ్చును.

తెలుగు సాహిత్యంలో కొన్ని పాత్రలు సుస్థిర స్థానంసంపాదించుకున్నాయి. గురజాడ గిరీశం, మధురవాణి, పానుగంటి జంఘాలశాస్త్రి, చిలకమర్తి వారి గణపతి, మొక్కపాటి బారిస్టర్ పార్వతీశం, మునిమాణిక్యం కాంతం, భానుమతిరామకృష్ణ అత్తగారు ముళ్ళపూడి బుడుగు అప్పారావులు, మృణాళిని కోమలి తెలుగువారి విశిష్ట హాస్యానికి ప్రతీకలుగా నిలుస్తారు.

## ఉపయుక్త గ్రంథ పట్టిక


1. వీరేశలింగం రచనలు : నాలుగు సంపుటాలు
2. సత్యరాజా పూర్వదేశయాత్రలు : శ్రీకందుకూరి వీరేశలింగం
3. కాళ్ళకూరి నారాయణరావు – జీవితం సాహిత్యం : శ్రీవేమూరి శ్రీనివాసమూర్తి
4. రాచకొండ విశ్వనాథశాస్త్రి ం – రచనా సాగరం : సమస్త లభ్య రచనల సంఘం
5. బీనాదేవి సమగ్ర రచనలు : సమస్త రచనల సంపుటం
6. ముళ్ళపూడి వెంకటరమణ : తొమ్మి సంపుటాలు
7. బ్రతికిన కాలేజి : పాలగుమ్మి పద్మరాజు
8. రెండవ అశోకుడి మూణ్ణాళ్ళపాలన : పాలగుమ్మి పద్మరాజు
9. ప్రసిద్ధ తెలుగు హాస్య నాటికలు (50): విశాలాంధ్ర ప్రచురణ
10. హాస్య ప్రపంచం : శ్రీమాచర్ల రాధాకృష్ణమూర్తి
11. నవ్వుల నవాబులు : శ్రీనివాస సాహితీ సమితి
12. కోమలి గాంధారం : డా. మృణాళిని
13. తాంబూలం : డా. మృణాళిని
14. ప్రేమలేఖ : శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి
15. శ్రీరమణ పేరడీలు : శ్రీరమణ
16. అప్పులు చేయడం తీర్చడం : శ్రీమునిమాణిక్యం నరసింహరావు
17. హా. . .హా. . . హస్వానందం : వియోగి
18. బ్రహ్మానంద లహరి : సింహప్రసాద్
19. రావికొండలరావు నాటికలు : శ్రీరావికొండలరావు
20. హాస్య జ్యోతి : శ్రీరమణ
21. వరవిక్రయం : శ్రీకాళ్ళకూరి నారాయణరావు
22. మధుసేవ : శ్రీకాళ్ళకూరి నారాయణరావు
23. చింతామణి : శ్రీకాళ్ళకూరి నారాయణరావు
24. సాక్షి వ్యాస సంపుటాలు : శ్రీపానుగంటి లక్ష్మీనరసింహారావు

25. కంఠాభరణం : శ్రీపానుగంటి లక్ష్మీనరసింహారావు
26. ప్రేమకు ఫుల్‌స్టాపు ఉన్నదా : శ్రీయర్రంశెట్టిశాయి
27. కథల అత్తయ్యగారు : నిడదవోలు మాలలు
28. శ్రీఛానల్ : శ్రీరమణ
29. సం.సా.రా.లు : సుధామ
30. భమిడిపాటి కామేశ్వరరావు
 రచనలు హాస్యవల్లరి : విశాలాంధ్ర
31. నవ్వితే నవరత్నాలు : మల్లిక్
32. పడక్కుర్చీ కబుర్లు : ఎమ్.బి.ఎస్. ప్రసాద్
33. బాసుగారి కుక్కగారు (హాస్యకథలు) : వియోగి
34. గిల్లిదండ : శ్రీతెలిదేవల భానుమూరి & క్తి
35. సరదా కథలు : శ్రీభమిడిపాటి రామగోపాలం
36. హాస్యలహరి : యువభారతి
37. అమెరికా మీజీ కబుర్లు : వంగూరి
38. హాస్యవనం 1 & 2 : సంకలనకర్త శ్రీమతి కె.వసంతా ప్రకాష్
39. ఆనందమే అందం : శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి
40. కామెడీ కథలు : శ్రీ ఎస్. వివేకానంద
41. పొత్తూరి విజయలక్ష్మి హాస్యకథలు : శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి
42. హ్యూమరాలజీ : శ్రీయర్రంశెట్టిశాయి
43. శరద్రాత్రులు : శ్రీమునిమాణిక్యం నరసింహారావు
44. నవ్వులగని : శ్రీచిలకమర్తి లక్ష్మీనరసింహారావు
45. వియోగి నాటికలు : వియోగి
46. తెలుగు నాటక సాహిత్యం
 హాస్య రస పోషణ : శ్రీ ఎన్. తారకరామారావు
47. చిలకమర్తి ప్రహసనములు : శ్రీచిలకమర్తి లక్ష్మీనరసింహ
48. సరదాగా కాసేపు : శ్రీగబ్బిట కృష్ణమోహన్
49. హాస్య బిందువులు : శ్రీమతి కె. వసంతప్రకాష్

50. మన హాస్యం : శ్రీ మునిమాణిక్యం నరసింహరావు
51. తెలుగు హాస్యం : శ్రీమట్నూరి సంగమేశం
52. జరుక్‌శాస్త్రి పేరడీలు : జరుక్‌శాస్త్రి
53. సి.ప్రా.లి : శ్రీశ్రీ
54. తెలుగు సాహిత్యంలో పేరడీ : ఆచార్య డా. మొదండ నిత్యానందరావు
55. సాంఘిక నవల కథన శిల్పం : డా. మృణాళిని
56. ప్రేమిస్తే ఏమవుతుంది : డా. మృణాళిని
57. లవ్ ఎట్ సెకండ్ సైట్ : శ్రీయర్రంశెట్టిశాయి
58. నిత్యానుశీలనం : డా. వెలుదండి నిత్యానందరావు
59. గణపతి : శ్రీచిలకమర్తి లక్ష్మీనరసింహం
60. అద్దం అబద్ధం చెప్పదు : మజుందారీ కథల సంపుట
61. పద్య కవిత్వం – వస్తు వైవిధ్యం : డా. కె.వి. రమణాచారి
62. కొడవటిగంటి రచనా ప్రపంచం
నవలలు కథలు నాటికలు : విప్లవ రచయితల సంఘం
63. హాస్య విలాపం : డా. వెలుదండి నిత్యానందరా
64. హాస్యవధాని అభినందన సంచిక : శ్రీశంకరనారాయణ
65. మహర్దిశ
(ఆంధ్ర సచిత్ర వార పత్రిక) : మూడు పదుల ముచ్చట
66. ఫన్‌గన్ : శ్రీశంకరనారాయణ
67. పన్‌పరాగ్ : శ్రీశంకరనారాయణ
68. అప్రస్తుత ప్రసంగాలు : శ్రీశంకరనారాయణ
69. వినోదములు : చిలకమర్తి లక్ష్మీనరసింహ.



పేరు : **డా. పి.ఎల్.ఎన్. ప్రసాద్**

తల్లిదండ్రులు : శ్రీమతి కృష్ణవేణి, శ్రీ పత్రి గోపాలకృష్ణరావు

జననం : 8-1-1956

విద్యార్హతలు : M.A. (తెలుగు) 1978 (ఉస్మానియా విశ్వవిద్యాలయం)
M.Phil. (తెలుగు) 1981
"ఉద్యోగపర్వంలో వాక్యలయ" (ఉస్మానియా విశ్వవిద్యాలయం)
Ph.D. (తెలుగు) 1991.
"తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనల్లో రసవృత్తి - వాక్యలయ" (కాకతీయ విశ్వవిద్యాలయం)

ఉద్యోగ జీవితం : ఆంధ్రవిద్యాభివృర్ధనీ కళాశాలలో ఇరవయి తొమ్మిది సంవత్సరాలుగా ఆంధ్రోపన్యాసకుడిగా సరస్వతీ సేవ.

సాహితీ జీవితం: అనువాదాలు, రచనలు, మీడియా

1. డాII అనీబిసెంట్ రచించిన 'A Study in Karma' తెలుగులోకి అనువాదం: 'కర్మాధ్యయనం' ప్రచురణ : రాయలసీమ థియొసాఫికల్ ఫెడరేషన్
2. డాII అనీబిసెంట్ రచించిన 'Thesophic Life' తెలుగులోకి అనువాదం: 'దివ్యజ్ఞానోద్దీపిత జీవితం' ప్రచురణ : రాయలసీమ థియొసాఫికల్ ఫెడరేషన్
3. లెడ్‌బీటర్ రచించిన 'A Text Book of Theosophy' తెలుగులోకి అనువాదం: 'దివ్యజ్ఞాన ప్రబోధిని' ప్రచురణ : రాయలసీమ థియొసాఫికల్ ఫెడరేషన్
4. "దివ్యజ్ఞాన బోధామృతం" ప్రచురణ: తెలుగు ఫెడరేషన్ దివ్యజ్ఞాన సమాజం
5. తమాలకృష్ణ గోస్వామి రచించిన ఆంగ్లనాటకం 'Drama of Lord Jagannadha' తెలుగులోకి అనువాదం: 'జగన్నాటకం' ఇస్కాన్ (ప్రచురణలో).
6. డాII అనీబిసెంట్ రచించిన 'A Study in Karma' తెలుగులోకి అనువాదం: 'కర్మాధ్యయనం' ప్రచురణ : రాయలసీమ థియొసాఫికల్ ఫెడరేషన్
7. డాII అనీబిసెంట్ మరియు సి.డబ్ల్యూ. లిడ్‌బెటర్ రచించిన 'The Nobel Eightfold Path' తెలుగులోకి అనువాదం: 'విశిష్ట అష్టాంగ మార్గం' ప్రచురణ : రాయలసీమ థియొసాఫికల్ ఫెడరేషన్
8. ఎ.ఇ. పావెల్ రచించిన 'The Astral Body' And Others Astral Phenomena తెలుగులోకి అనువాదం: 'కామశరీరం' ప్రచురణ : రాయలసీమ థియొసాఫికల్ ఫెడరేషన్
9. బాపు బాలి చంద్ర బొమ్మలతో తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనలపై శీర్షికలు, కథలు, వ్యాసాలు, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఉదయం మొదలైన పత్రికల్లో 150కి పైగా వ్యాసాలు, ఆకాశవాణి, టెలివిజన్ ఛానళ్ళలో భిన్న రచనలు.

Blank Page

Blank Page

# ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు

* తెలుగు జాతి భాషా సంస్కృతులపై నేటి యువతరానికి ఆసక్తి కలిగించేలా ప్రణాళికలు తయారుచేయడం.
* ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక వేదికపై చేర్చి భాషా సంస్కృతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం.
* తెలుగుభాష ప్రపంచ భాషలతో సరితూగేలా అంతర్జాలంలో ఉపయోగించడానికి చర్యలు చేపట్టడం.
* తెలుగు పాలన, బోధన, ప్రసార మాధ్యమ భాషగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవడం.
* తెలుగు వారి జానపద, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలకు, ప్రచారానికి ప్రణాళిక రూపొందించడం.
* తెలుగు జాతి ప్రాచీనతలను, ప్రశస్తిని వెలుగులోకి తేవడం.
* తెలుగు జాతి చరిత్రపై, భాషపై గ్రంథాలు ప్రచురించి కొత్త పారిభాషిక పదాలు తయారుచేయడం.
* తెలుగు భాషను అభ్యసించే వారికి సరళమైన శైలిలో పాఠ్యగ్రంథాలు, బోధనోపకరణాలు తయారు చేసే ప్రణాళిక రూపొందించడం.
* తెలుగు నేలపై గల చారిత్రక, ఆధ్యాత్మిక స్థలాలకు, పర్యాటక కేంద్రాలకు ప్రాచుర్యం కల్పించడం.

తెలుగు భాష వికాసం — తెలుగు సంస్కృతి ప్రకాశం

**దేశ భాషలందు తెలుగు లెస్స**